thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 172 కరీంనగర్ శనివారం, 30 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌పై 15 లక్షల సైబర్ అటాక్స్ చేసిన పాక్..

భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ అన్ని రకాలుగా కుట్రలు చేస్తూనే ఉంది. ఓ వైపు పాకిస్తాన్ ఆర్మీ కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తూ .. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడుతూ ఉంది. మరో వైపు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమయాక భారతీయుల్ని పొట్టనపెట్టుకుంటూ ఉన్నారు. ఈ రెండు రకాలుగానే కాకుండా .. మూడో రకంగా కూడా భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ కుట్రలు చేస్తూనే ఉంది. ఎవ్వరూ ఊహించని విధంగా భారీ స్థాయిలో సైబర్ అటాక్స్‌కు పాల్పడుతోంది. పహల్గామ్ టెర్రర్ అటాక్ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన హ్యాకర్లు దేశ వ్యాప్తంగా 15 లక్షల సైబర్ అటాక్స్ జరిపినట్లు తేలింది.

## కామారెడ్డి కకావికలం.. వరద ధాటికి ఎన్ హెచ్ 44 బంద్, అటు వెళ్లొద్దు!




రాష్ట్రంలో కామారెడ్డి వరద ధాటికి కకావికలంగా మారింది. కామారెడ్డి జిల్లాలోని పలు కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్ మునిగి, ఫస్ట్ ఫ్లోర్ వరకు వరదనీరు చేరుకోవడంతో అనేక కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

ప్రజలు తమను కాపాడాలంటూ వేడుకుంటున్నారు. కామారెడ్డి దగ్గరలోని జాతీయ రహదారి ఎన్ హెచ్ 44 పైకి వరద నీరు వచ్చి చేరడంతో రోడ్డు డ్యామేజ్ అయింది. దీంతో ఈ రహదారిలో వాహన రాకపోకలను దారి మళ్లిస్తున్నారు.

**జాతీయ రహదారి** NH-44 **డ్యామేజ్.. వాహన రాకపోకలు బంద్...** భారీ వర్షాల కారణంగా కామారెడ్డి దగ్గరలోని జాతీయ రహదారి NH-44 డ్యామేజ్ కావడంతో 25% రాకపోకలు మాత్రమే జరుగుతున్నాయని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి మేడ్చల్- రామాయంపేట- కామారెడ్డి-డిచ్పల్లి దారిలో కాకుండా వేరే ప్రత్యామ్నాయ మార్గాల గుండా వెళ్లాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఎన్ హెచ్ 44 పై హెవీ వెహికిల్స్ అన్ని మేడ్చల్ నుంచి డైవర్ట్ చేయడం జరిగిందన్నారు.

**వాహనాలను దారి మళ్లిస్తున్న పోలీసులు...** చిన్న వెహికల్ అన్నీ కూడా రామాయంపేట నుంచి డైవర్ట్ చేయడం జరిగిందని ఈ విషయాన్ని ప్రయాణికులు అందరూ గమనించాలని పేర్కొన్నారు. అంతేకాదు కుండపోతగా కురుస్తున్న వర్షాలతో కామారెడ్డి జిల్లా మొత్తం వరద ముంపులో చిక్కుకుంది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాలలో చిక్కుకుపోయిన సుమారు 500కు పైగా మందిని రెస్క్యూ చేశామని కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు.

**కామారెడ్డి మీదుగా హైదరాబాద్ వెళ్లొద్దు: నిర్మల్ ఎస్పీ సూచన...** ఇంకా వర్షాలు తగ్గని నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా బయటకు రావొద్దని సూచించారు. అత్యవసరం ఉంటే డయల్ 100 లేదా డిస్టిక్ హెల్ప్ లైన్ నెంబర్ 08468-220069 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇక మరోవైపు భారీ వర్షాల కారణంగా రోడ్లన్నీ జల మయం అవ్వడంతో ఆదిలాబాద్ నుండి వయా కామారెడ్డి మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనదారులకు నిర్మల్ జిల్లా ఎస్పీ సూచనలు చేశారు.

**నిర్మల్ నుండి వాహనాల డైవర్షన్...** నిర్మల్ వద్ద ఉన్న కొండాపూర్ బ్రిడ్జి నుండి ఎడమ వైపు కి తిరిగి డైవర్షన్ మార్చుకొని కొండాపూర్ నుండి వయా మామడ,ఖానాపూర్ మెట్ పల్లి,జగిత్యాల్, కరీంనగర్ మీదుగా హైదరాబాద్ వెళ్లాలని కామారెడ్డి మార్గంలో వెళ్లకూడదని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలియ జేశారు.




## ఉగ్రరూపం దాల్చిన మూసీ.. నగరంలో పలుచోట్ల రాకపోకలు బంద్..

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో.. కురుస్తున్న వర్షాలకు నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో మూసీకి వరద పోటెత్తింది. ఉస్మాన్ సాగర్ 8 గేట్లు ఎత్తి 4100 క్యూసెక్కుల నీటిని, హిమాయత్ సాగర్ 3 గేట్లు ఎత్తి 2300 క్యూసెక్కుల నీటిని మూసీలోకి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. నీటిని విడుదల చేయడంతో బాపుఘాట్, అత్తాపూర్, పురానాపూల్, చాదర్ఘాట్, మూసారంబాగ్ వద్ద వరద తీవ్రత పెరిగింది. దీంతో మూసి పరివాహక ప్రాంతాల ప్రజలను జీహెచ్ఎంసీ అప్రమత్తం చేసింది. జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో జియాగూడ 100 ఫీట్ రోడ్డుపై భారీగా వరద నీరు చేరింది. దీంతో రోడ్డును అధికారులు మూసివేశారు. జియాగూడ పురానాపూల్ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో పురానాపూల్ నుంచి హైకోర్టుకు వెళ్లే వాహనాలను కార్వాన్ నుంచి దారి మళ్లించారు. కాగా, మూసారాంబాగ్ బ్రిడ్జ్‌పై కూడా.. మూసి నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బ్రిడ్జిని క్లోజ్ చేశారు. వరద ధాటికి బ్రిడ్జ్ పిల్లర్లు పూర్తిగా డ్యామేజ్ అయినట్లు అధికారులు తెలుపుతున్నారు. అంబర్పేట్, దిల్‌షుక్‌నగర్ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



## జీఎస్టీ సంస్కరణలతో కలిగే నష్టానికి పరిహారం చెల్లించాలి: 8 రాష్ట్రాల ఆర్థిక మంత్రులు

దిల్లీ: జీఎస్టీ సంస్కరణలతో తెలంగాణ రాష్ట్రానికి రూ.7వేల కోట్లు నష్టం వస్తుందని అంచనా ఉన్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దిల్లీలో జరిగిన 'జీఎస్టీ సంస్కరణలపై ప్రతిపక్ష పార్టీ పాలిత రాష్ట్రాల సమావేశం'లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ తరపున భట్టి విక్రమార్క హాజరుకాగా.. తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఝార?ండ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరయ్యారు. జీఎస్టీ సంస్కరణలతో కలిగే నష్టానికి పరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా మంత్రులు డిమాండ్ చేశారు. కొత్త జీఎస్టీ ప్రతిపాదనలతో మొత్తంగా రూ.2లక్షల కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని అంచనా వేశారు. జీఎస్టీ కౌన్సిల్ భేటీలో తమ ప్రతిపాదనలు సమర్పిస్తామని చెప్పారు.



## మరో బాంబ్ పేల్చిన వాతారణ శాఖ.. వచ్చే 7 రోజులు వర్షాలే వర్షాలు.. లేటెస్ట్ వెదర్ రిపోర్ట్ ఇదిగో..


హైదరాబాద్ / అమరావతి : తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ మరోసారి వర్షసూచన చేసింది. తెలంగాణలో రెండు రోజులపాటు, ఏపీలో వారం రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని ప్రకటించింది. బంగాళాఖాతంలోని అల్పపీడనం బలహీన పడినప్పటికీ.. ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కంటిన్యూ అవుతాయని తెలిపింది. రెండు రాష్ట్రాలకు రాబోయే మూడు రోజులకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీన పడిందని.. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఏపీలోని పలు జిల్లాల్లో మరో వారం రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం అధికారి జగన్నాథకుమార్. అల్పపీడనానికి నైరుతి దిశగా ఉన్న జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా.. అల్లూరి, ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాలో రాబోయే 24గంటల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణలోనూ భారీ వర్షాలు కురుస్తాయని.. అందులోనూ.. ఉత్తర తెలంగాణపై అధిక ప్రభావం ఉంటుందన్నారు జగన్నాథకుమార్.

బంగాళాఖాతంలోని అల్పపీడనం బలహీన పడడంతో వర్షాలు తగ్గు ముఖం పట్టే అవకాశం ఉందన్నారు హైదరాబాద్ వాతావరణశాఖ అధికారి శ్రీనివాస్. అయితే.. కొన్ని జిల్లాల్లో మాత్రం రెండు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే చాన్స్ ఉందని చెప్పారు. బంగాళాఖాతంలోని అల్పపీడనం ఛత్తీస్‌గఢ్ మీదుగా మధ్యప్రదేశ్ వైపు పయనించే అవకాశం ఉందన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలపై దీని ప్రభావం ఎక్కువగా




ఉంటుందని చెప్పారు. ఆయా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదిలాబాద్, కొమురం భీం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఇక.. ఇప్పటికే తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలను భారీ వర్షాలు వరదలతో ముంచెత్తాయి. తెలంగాణలోని పలు జిల్లాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అత్యధిక వర్షపాతాలు నమోదు అయ్యాయి. అటు.. ఏపీలోనూ పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలోనే.. తెలంగాణకు రెండు రోజులు, ఏపీకి వారంరోజుల పాటు వాతావరణశాఖతీ వర్షసూచన చేయడం భయపెడుతోంది. అటు.. వాతావరణశాఖ హెచ్చరికలతో ఏపీ,తెలంగాణలోని ప్రభుత్వాలు అప్రమత్తం అయ్యాయి. ఆయా జిల్లాల్లోని అధికారులను అలర్ట్ చేస్తున్నాయి.




టోక్యో: ప్రధాని నరేంద్ర మోదీ జపాన్‌లో పర్యటిస్తున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్-జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సు లో ఆయన ప్రసంగించారు. మేకిన్ ఇండియా కోసం రావాలని.. ప్రపంచం కోసం తయారీ చేపట్టాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. సెమీకండక్టర్ల పరిశ్రమల నుంచి స్టార్టప్‌ల వరకూ జపాన్ భారత్‌కు అత్యంత కీలక భాగస్వామిగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. జపాన్ సంస్థలు భారత్‌లో 40 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు.

**ట్రంప్ టారిఫ్‌ల హెచ్చరికలు.. భారత్ బాటలోనే జపాన్..?...** "80 శాతం కంపెనీలు భారత్‌లో తమ సంస్థలను విస్తరించాలని కోరుకుంటున్నాయి. 75 శాతం కంపెనీలు ఇప్పటికే లాభాల్లో ఉన్నాయి. భారత్‌లో మూలధనం ఎన్నో రెట్లు పెరుగుతోంది. గత 11 ఏళ్లలో భారత్‌లో గతంలో ఎన్నడూ లేని మార్పులు చోటుచేసుకున్నాయి. రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, విధానాల్లో పారదర్శకత వచ్చాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుంది" అని మోదీ పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా జపాన్ ప్రధాని ఇషిబాతో మోదీ భేటీ కానున్నారు. ఏఐ, సెమీ కండక్టర్లు, బుల్లెట్ రైలు, పెట్టుబడులే అజెండాగా వీరి మధ్య ద్వైపాక్షిక చర్చ జరగనుంది. అక్కడి నుంచి ప్రధాని మోదీ నేరుగా చైనా వెళ్లనున్నారు. ఆగస్టు 31, సెప్టెంబరు 1వ తేదీల్లో తియాంజిన్ వేదికగా జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొంటారు. 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణల అనంతరం ప్రధాని మోదీ చైనాను సందర్శిస్తుండటం ఇదే మొదటిసారి.




దేశవ్యాప్తంగా.. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలతో వాగులు, వంకలు, నదులు పొంగిపొర్లుతున్నాయి. ఉత్తరాఖండ్ లోని రుద్రప్రయాగ్, చమోలీ జిల్లాల్లో కురుస్తున్న కుండపోత వర్షం పలు గ్రామాలను ముంచెత్తుతోంది. ఉత్తరాఖండ్‌లో తాజాగా మరోసారి మేఘ విస్ఫోటం సంభవించింది. ఈ విపత్తులో పలువురు ప్రాణాలు కోల్పోగా పలుచోట్ల ఇళ్లు కూలడంతో పదుల సంఖ్యలో ప్రజలు శిథిలాల కింద చిక్కుకున్నారు. మోపాటా ప్రాంతంలో భారీ వరదల్లో ఇద్దరు కొట్టుకుపోగా.. పశువుల కొట్టం కూలడంతో దాదాపు 20 పశువులు జల సమాధి అయ్యాయి. మేఘ విస్ఫోటం కారణంగా రుద్రప్రయాగ్‌లోని అలకనంద, మందాకిని నదుల నీటి మట్టాలు భారీగా పెరుగుతున్నాయి. రుద్రప్రయాగ్‌లోని హనుమాన్ ఆలయం పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో 180కి పైగా రోడ్లు మూసుకుపోయాయి. కేదార్‌నాథ్ లోయలోని లారా గ్రామాన్ని పట్టణంతో కలిపే వంతెన కొట్టుకుపోవడంతో ఆ గ్రామానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాల దృష్ట్యా, రుద్రప్రయాగ్, బాగేశ్వర్, చమోలి, హరిద్వార్ మొదలైన జిల్లాలోని విద్యాలయాలను మూసివేశారు. ఉత్తరాఖండ్‌లో భారీ వరదలు సృష్టిస్తున్న కల్లోలంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందిస్తూ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. రుద్రప్రయాగ్‌లోని బాసుకేదర్ తహసీల్, చమోలి జిల్లాలోని దేవల్ ప్రాంతంలో మేఘ విస్ఫోటం కారణంగా అనేక కుటుంబాలు వరదల్లో చిక్కుకుపోయాయన్నారు. నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నా యన్నారు. వరద ప్రవాహం ప్రమాదస్థాయికి చేరువలో ఉండటంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు.

**ఉత్తరాది రాష్ట్రాలు అతలాకుతలం...** వరద ప్రవాహ ధాటికి ప్రజలు, అడవుల్లోని మూగజీవాలు సైతం భారీస్థాయిలో మృతిచెందుతున్నట్లు అటవీ అధికారులు పేర్కొన్నారు. వరదల్లో గల్లంతైన వారి గురించి కచ్చితమైన సమాచారం లేకపోయినా చాలామంది ఆచూకీ తెలియడం లేదని అధికారులు తెలిపారు. ఆకస్మిక వరదలతో తప్పించుకొనే మార్గం లేకపోయిందని వివరించారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లోని రాంనగర్ పెద్ద కాలువలో వరద నీటి ధాటికి చిరుత పులి కొట్టుకుపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గ్రామాలలోని జంతువులు, పశువులు సైతం భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నాయి.

చురకలు






## యూరియా సరఫరాలో ఫలిస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలు..

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిన యూరియా కొరతకు తెరపడిందని చెప్పవచ్చు. యూరియా సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు ఫలిస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే రెండు రోజుల్లో గద్వాల, పెద్దపల్లి, జగిత్యాల, వరంగల్, సనత్ నగర్, జడ్చర్ల, కరీంనగర్, పందిళ్లపల్లి, గజ్వేల్, మిర్యాలగూడ, నాగిరెడ్డిపల్లికి 21,325 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకోనున్నట్లు వ్యవయసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. సెప్టెంబర్ మొదటి వారంలోగా గంగవరం, దామ్ర, కరాయికల్ పోర్టుల నుంచి మరో 29,700 మెట్రిక్ టన్నుల యూరియా రానున్నట్లు పేర్కొన్నారు. పోర్టుల నుంచి ఆదిలాబాద్, జడ్చర్ల, గద్వాల, వరంగల్, మిర్యాలగూడ, పందిళ్లపల్లి, సనత్ నగర్, గజ్వేల్ ప్రాంతాలకు యూరియా చేరుకోనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పుకొచ్చారు. అక్కడి నుంచి డిమాండ్ పరంగా జిల్లాలకు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం యూరియాను సరఫరా చేసిందని పేర్కొన్నారు. యూరియా కొరతతో కొంతమంది రాజకీయులు చేశారని మండిపడ్డారు. యూరియాను త్వరలోనే అన్ని జిల్లాలకు సరఫరా చేస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

అలాగే మంత్రి తుమ్మల వరదల కారణంగా జరిగిన పంట నష్టంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్దిష్టమైన లెక్కలతో పంట నష్టం వివరాలు అందించాలని ఆదేశించారు. బృందాలుగా ఏర్పడి జిల్లాలలో పర్యటించి, పంట నష్టం వివరాలను సేకరించాలని సూచించారు. అనంతరం వరద బాధిత ప్రాంతాల కలెక్టర్లతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా సాయంత్రం వరదల పంట నష్టంపై సమావేశం నిర్వహిస్తారని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.




## ప్రముఖ యూనివర్సిటీ డ్రగ్స్ కేసు.. వెలుగులోకి సంచలన విషయాలు

హైదరాబాద్: ప్రముఖ యూనివర్సిటీ డ్రగ్స్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు కూడా ఈ డ్రగ్స్ సరఫరా ముఠాల లక్ష్యంగా మారినట్టు పోలీసులు వెల్లడించారు. విచారణలో ఆక్స్ ఫర్డ్ డిక్షనరీ, మట్టి గాజులు, ఆయుర్వేద ఉత్పత్తుల వంటి సాధారణ వస్తువుల మధ్య హెరాయిన్, ఎఫిడ్రీన్ ప్యాకెట్లు దాచి పంపుతున్నట్టు తేలింది. 'పుష్ప' సినిమా తరహాలో పుస్తకాలు, మెడిసిన్, గాజుల ముసుగులో డ్రగ్స్ ను కొరియర్ ద్వారా అక్రమంగా తరలించడాన్ని పోలీసులు గుర్తించారు.

**మారుతీ కొరియర్స్ ద్వారా గంజాయి...** తాజా విచారణలో ఓ ప్రముఖ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు, మారుతీ కొరియర్స్ ద్వారా 'ఓజీ గంజాయి' తెప్పించుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. హైదరాబాద్ నగర శివారులో ఉన్న మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలకు డ్రగ్స్ తరచూ కొరియర్ పార్సిల్ రూపంలో చేరుతున్నట్లు తెలుస్తోంది.

**రూ.100 కోట్ల డ్రగ్స్ – 10 కొరియర్ సంస్థలు....** గత రెండు సంవత్సరాల్లో 10కి పైగా కొరియర్ కంపెనీల ద్వారా సుమారు రూ.100 కోట్ల విలువైన డ్రగ్స్ సరఫరా అయినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కొరియర్ సంస్థలు కమీషన్ ఆశించి డ్రగ్స్ ముఠాలకు సహకరిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో కొన్ని కొరియర్ సంస్థలపైనా కేసులు నమోదు చేశారు. డ్రగ్స్ సరఫరాలో వాటి పాత్రను నిశితంగా పరిశీలిస్తున్న పోలీసులు త్వరలో మరిన్ని అరెస్టులు చేసే అవకాశముందని తెలుస్తోంది.

**స్పెషల్ పోలీస్ టీమ్..** హైదరాబాద్ నగరంలోని విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. డ్రగ్స్ సరఫరాదారుల ముఠాలను ధ్వంసం చేయాలని సైబరాబాద్, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్లు సంయుక్తంగా పని చేస్తున్నాయి. విద్యాసంస్థల విద్యార్థులు కూడా ఈ మాదకద్రవ్యాల కుంభకోణంలో ఉండటం, కొరియర్ సంస్థలు సహకరిస్తుండటం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం, పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

## ఎస్టీ జాబితాలో లంబాడీ, సుగాలీ, బంజారాలు.. కేంద్రానికి, తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు




లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలోనుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపింది. కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చటంపై గతంలో తెలంగాణ హైకోర్టులో తెల్లం వెంకట్రావు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ తెల్లం వెంకట్రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. లంబాడీ, సుగాలీ, బంజారాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా మెరుగైన స్థానంలో ఉన్నారని పిటీషన్‌లో తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. వారిని ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల కోయ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

## కామారెడ్డిలో భారీవర్షాలు.. ఎన్‌హెచ్ 44పై 15 కి.మీ మేర ట్రాఫిక్‌జామ్

కామారెడ్డి: భారీ వర్షాల కారణంగా కామారెడ్డి జిల్లాలోని 44వ నంబరు జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రోడ్డు కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. సుమారు గంటకు పైగా ఈ పరిస్థితి నెలకొంది. సదాశివనగర్ మండలం నుంచి భిక్కనూర్ టోల్‌గేట్ వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. బుధవారం, గురువారం కురిసిన వర్షాలకు టెక్రియాల్, సారంపల్లి వద్ద బ్రిడ్జి కోతకు గురైంది. మరోచోట రోడ్డు కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలోనే బుధవారం నుంచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గురువారం రాత్రి కూడా వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోవడంతో పరిస్థితిని ఎస్పీ రాజేశ్ చంద్ర పర్యవేక్షించారు. ట్రాఫిక్ జామ్ సమస్యలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా రహదారులకు మరమ్మతులు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




**భారీ వర్షాలతో మెదక్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సింగూర్ నుంచి ఉధృతంగా వరద రావడంతో.. వనదుర్గ ఆనకట్ట నుంచి 59 వేల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గర్భగుడి ఎదుట ఉన్న మంజీరా నది పాయ.. ఆలయ మండపానికి ఉన్న రేకులను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆనకట్ట వైపు భక్తులు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు పహారా కాస్తున్నారు.**




తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి.

జోరువానలు కురుస్తున్న నేపథ్యంలో శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 4,30,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. 39 ప్రధాన గేట్ల ద్వారా 5,04,455 నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 38 గేట్లు తెరిచి 6,79,019 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మూడు రోజులుగా ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు భారీగా వరద వచ్చి చేరుతోంది.

ప్రాజెక్టులోకి ప్రస్తుతం 1,63,043 క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల దిగువన ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతా..




హైదరాబాద్, ఆగస్టు 29: అసెంబ్లీ సమావేశాలకు తాను హాజరవుతానని గోషా మహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు. తాను ప్రస్తుతం ఇండిపెండెంట్ ఎమ్మెల్యేనని ఆయన తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ఎమ్మెల్యే రాజా సింగ్ మాట్లాడుతూ.. ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా తనకు ఇప్పుడు స్వేచ్ఛ ఎక్కువ ఉందన్నారు. ఒకప్పుడు అసెంబ్లీలో ఏం మాట్లాడాలన్నా పార్టీ అగ్రనాయకత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉండేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే సమయం వరకు సభలో మాట్లాడే అవకాశాన్ని పార్టీ ఇచ్చేది కాదని పేర్కొన్నారు. కానీ సభలో తనకు మాట్లాడే అవకాశం ఇస్తే వివిధ అంశాలు లేవనెత్తుతానన్నారు. తనలాగే బీజేపీలో చాలా మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. దీనికి తాజా ఉదాహరణ చేవెళ్ల ఎంపీ వ్యవహారమేనని తెలిపారు. వారిలాగే చాలా మంది పదవులు పోతాయని పార్టీలో జరుగుతున్న ఇబ్బందులపై నోరు విప్పడం లేదన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నా.. వాటిని కొంతమంది సర్వనాశనం చేశారంటూ బీజేపీలోని పలువురు నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇప్పటివరకూ ఢిల్లీలోని బీజేపీ నేతల నుంచి తనకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. ఒకవేళ వస్తే ఇక్కడ నెలకున్న ఇబ్బందులను వారికి వివరించిన తర్వాతే మళ్లీ ఆ పార్టీలోకి వెళ్తానని స్పష్టం చేశారు. లేకుంటే చచ్చినా.. మళ్లీ ఆ పార్టీలోకి వెళ్లనని ఆయన కరాకండిగా చెప్పారు. ఇక పార్టీలోని పలువురు ఎంపీలు తమ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక్క ఎమ్మెల్యేను సైతం గెలిపించలేకపోయారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, బీసీ బిల్లులపై అసెంబ్లీ సమావేశాలు అనేది కేవలం ప్రజల నుంచి దృష్టి మరల్చడానికి మాత్రమేనని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల నుంచి ముస్లింలను తీసేయాలని రేవంత్ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశాన్ని దమ్ముంటే సీబీఐకి అప్పచాలంటూ రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సవాల్ విసిరారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శనివారం నుంచి అంటే.. ఆగస్టు 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై చర్చించనున్నారు. ఇక బీజేపీకి రాజా సింగ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి ఆయన నామినేషన్ దాఖలు చేసే సమయంలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆ పార్టీకి ఆయన రాజీనామా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీలోని పలువురు నేతలపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అవి కూడా ఆయన పరోక్షంగా చేశారు. అయితే రాజాసింగ్ రాజీనామా లేఖను పార్టీ అగ్రనాయకత్వం వెంటనే ఆమోదించిన విషయం విదితమే.

## సుప్రీంకోర్టుకు విజయ్ టీవీకే పార్టీ...

తమిళనాడు: తమిళ నటుడు విజయ్ ఏర్పాటు చేసిన టీవీకే పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పరువు హత్యలపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని సుప్రీంలో టీవీకే పార్టీ పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్రంలో ఓ దళిత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దళిత సాఫ్ట్‌వేర్‌కు న్యాయం జరగాలని కోరుతూ.. పరువు హత్యలపై ప్రత్యేక చట్టం తీసుకురావాలని టీవీకే ధర్మాసనాన్ని ఆశ్రయించింది. రాష్ట్రంలో జులై 27న తిరునెల్వేలిలో ఐటీ ఉద్యోగి కవిన్ సెల్వగణేషన్ హత్య సంచలనం రేపిన సంగతి తెలిసిందే. కవిన్ వేరొక సామాజిక వర్గానికి చెందిన అమ్మాయిని ప్రేమించాడు. ఇది నచ్చని ఆమె సోదరుడు సుర్జిత్, కవిన్‌ను హత్య చేశాడు. ఈ హత్యకు సంబంధించి సుర్జిత్‌తో పాటు అతడి తండ్రి శరవణన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే.. రాష్ట్రంలోని పలు పార్టీలు ఈ పరువు హత్యలకు సంబంధించి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కోరాయి. ఎంతకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో టీవీకే సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది.

## ఏపీకి ఏకైక రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ: మంత్రి నారా లోకేశ



విశాఖ: పారిశ్రామిక విప్లవం వచ్చిన ప్రతిసారీ ఉద్యోగాలు పెరుగుతాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖలో నిర్వహించిన ఐసీఏఐ జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. మన ముందు ఏఐ ఒక అవకాశంగా ఉందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కాబోతోందని వివరించారు. "ఏపీకి ఏకైక రాజధాని ఉంటుంది.. కాకపోతే అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తాం. రాష్ట్రానికి చెందిన వ్యక్తులు ఇండియాకే కాదు.. ప్రపంచానికి సేవలందించాలి. ఏపీని 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేర్చడమే లక్ష్యం. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఏసీల్లో 50 శాతం ఏపీ నుంచే తయారవుతున్నాయి. ప్రకాశం జిల్లాను కంప్రెస్డ్ బయోగ్యాస్ క్యాపిటల్‌గా తయారుచేస్తాం. అనంతపురం జిల్లాను ఆటోమోటివ్ క్యాపిటల్‌గా తయారు చేస్తున్నాం. కర్నూలు జిల్లాను పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి క్యాపిటల్‌గా మారుస్తున్నాం. ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థలను కడప, చిత్తూరులో ఏర్పాటు చేస్తున్నాం. ఉత్తరాంధ్ర అద్భుతంగా అభివృద్ధి చెందబోతుంది. అన్ని రంగాల్లో ఏపీని ప్రథమ స్థానంలో ఉంచాలనే లక్ష్యంతో ఉన్నాం. ప్రతి సంక్షోభం.. ఒక అవకాశమే. దేశంలో నాలా చట్టాన్ని రద్దు చేసిన తొలి రాష్ట్రం ఏపీనే" అని లోకేశ్ తెలిపారు. ఐదేళ్ల కాలపరిమితితో విశాఖలోని 50 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 25వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి ట్రాన్స్‌ఫర్మేటివ్ ప్రోగ్రాంను తీసుకొచ్చారు. సైయెంట్ అభివృద్ధి చేసిన ఏఐ ల్యాబ్‌ను చంద్రపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. "పారిశ్రామిక విప్లవం చూశాం.. ఇప్పుడు ఏఐ విప్లవం చూస్తాం. ఇందులో ఉపాధి అవకాశాలు వస్తున్నాయి. విద్యాశాఖలో సంస్కరణలు తీసుకొచ్చాం. విద్యార్థులే మన ఆస్తి.. మన భవిష్యత్. సెప్టెంబర్ నుంచి కొత్త టీచర్లు విధుల్లో చేరుతారు"అని మంత్రి లోకేశ్ చెప్పారు.




## వాడకం మామూలుగా లేదు.. టెక్ దిగ్గజాలను హడలెత్తిస్తున్న ఏఐ ఇంటర్వ్యూలు!

కృత్రిమ మేధ రెండు వైపులా పదునున్న కత్తిలా పనిచేస్తోంది. దానిని సృష్టించి అభివృద్ధి చేస్తున్న టెక్ దిగ్గజాలకే చుక్కలు చూపిస్తోంది. కంపెనీలు కృత్రిమ మేధ పేరు చెప్పి ఎలా ఉద్యోగాలను కోస్తున్నాయో.. అలానే ఉద్యోగార్థులు కూడా వర్చువల్ ఇంటర్వ్యూల్లో ఏఐ సాయం తీసుకొని కొలువులు కొట్టేస్తున్నారు. దీంతో టెక్ కంపెనీలు ఆలోచనలో పడ్డాయి. ఇప్పటికే కొన్ని యూటర్న్ తీసుకొని ముఖాముఖి ఇంటర్వ్యూలను మొదలుపెట్టాయి. ఈ సరికొత్త ఏఐ ఇంటర్వ్యూ మోసాలు ఏమిటో చూద్దాం! కొన్ని నెలల క్రితం పిన్‌డ్రాప్ సెక్యూరిటీ అనే వాయిస్ అథెంటికేషన్ స్టార్టప్ సీనియర్ ఇంజినీర్ పోస్టు భర్తీ కోసం వర్చువల్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. దానికి ఇవాన్ అనే రష్యన్ కోడర్ హాజరయ్యాడు. వీడియో ఇంటర్వ్యూ సమయంలో సమాధానాలు చెబుతుంటే ముఖకవళికలకు.. మాటలకు మధ్య పొంతన లేకపోవడాన్ని రిక్రూటర్ గుర్తించారు. చివరికి ఇవాన్ ఓ స్మామర్ అని.. డీప్‌ఫేక్ సాఫ్ట్‌వేర్, జనరేటివ్ ఏఐ టూల్స్ వాడి టెక్ కంపెనీలో ఉద్యోగానికి యత్నించినట్లు తేలిందని 'పిన్‌డ్రాప్' సీఈవో విజయ్ బాల సుబ్రహ్మణ్యన్ వెల్లడించారు. వీడియో ఇంటర్వ్యూల్లో సాధారణ మనిషికి ఏఐ రూపానికి మధ్య తేడాలను గుర్తించడం కష్టమని చెప్పారు.

**భవిష్యత్తులో మరింత తీవ్రం..** ఫేక్ గుర్తింపు, ఫేక్ ముఖాలు, ఫేక్ గొంతును వాడి ఉద్యోగాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఫేస్ స్వాపింగ్ టెక్నిక్ ద్వారా మరొకరిని ఇంటర్వ్యూలకు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. రీసెర్చ్ అడ్వైజరీ సంస్థ గార్ట్‌నర్ అంచనాల ప్రకారం ఏఐ జనరేటెడ్ ప్రొఫైల్స్ ఇలానే పెరిగితే... 2028 నాటికి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొనే ప్రతి నలుగురిలో ఒకరు ఫేక్‌గా తేలుతారు. ఇలాంటి మార్గాల్లో వచ్చేవారు కంపెనీల్లో చేరాక సిస్టమ్స్‌లోకి మాల్‌వేర్ వంటివి ఇన్‌స్టాల్ చేసి డబ్బులు డిమాండ్ చేసే ప్రమాదమూ ఉందని విజయ్ బాల సుబ్రహ్మణ్యన్ అభిప్రాయపడ్డారు. సైబర్ సెక్యూరిటీ, క్రిప్టో కరెన్సీ సంస్థలు తరచూ రిమోట్ విధానంలో పనిచేసే ఉద్యోగాల్లో నియామకాలు చేపడుతుంటాయి. వీటికి అత్యధికంగా ఫేక్ అభ్యర్థులు వస్తున్నారని నిపుణులు వెల్లడించారు. బ్రైట్‌హైర్ సీఈవో బెన్ సెస్సర్ మాట్లాడుతూ ఏదాది క్రితం తొలిసారి ఇలాంటి మోసాలను చూశామన్నారు. ఇటీవల కాలంలో వీటి సంఖ్య గణనీయంగా పెరిగినట్లు చెప్పారు.

**రిక్రూటర్ల ఆందోళన..** ఏఐ ఆధారిత రెజ్యూమే మోసాలు బాగా జరుగుతున్నాయని 63 శాతం మంది రిక్రూటర్లు నమ్ముతున్నట్లు సాఫ్ట్‌వేర్ ఫైండర్ ఇటీవల నిర్వహించిన పోల్‌లో తేలింది. 37 శాతం మంది వీడియో మోసాలు భవిష్యత్తులో నియామకాలపై పెను ప్రభావం చూపుతాయంటున్నారు. ఏఐ జనరేటెడ్ ప్రొఫైల్స్ లేదా వర్క్ శాంపిల్స్ 51%, ఫేక్ రిఫరెన్స్‌లు 42%, ఫేక్ క్రెడెన్షియల్స్ 39%, వాయిస్ ఫిల్టర్లు లేదా క్లోనింగ్‌లు 17%, వీడియోలో ఫేస్ స్వాపింగ్ 15% మంది చూసినట్లు వెల్లడించారు.

కొన్నాళ్ల క్రితం ఏఐ టూల్స్ సాయంతో వీడియోలో ముఖాన్ని మార్చుకొని జరిగిన అభ్యర్థి ఇంటర్వ్యూను విడోక్ సెక్యూరిటీ సహ వ్యవస్థాపకుడు డేవిడ్ మెక్లాఫ్లిన్ షేర్ చేశారు. సదరు అభ్యర్థి ముఖాముఖిలో సమాధానాలు ఇచ్చేందుకు చాట్‌జీపీటీ వాడినట్లు గుర్తించారు.

**పాత పద్ధతికే మొగ్గు..** కొవిడ్ సమయంలో అమల్లోకి తెచ్చిన రిమోట్ రిక్రూట్‌మెంట్ విధానం నుంచి గూగుల్ మళ్లీ పాతబాట పట్టింది. గూగుల్‌లో ఉద్యోగానికి అభ్యర్థులతో ముఖాముఖి ఇంటర్వ్యూల విధానాన్ని పునరుద్ధరిస్తున్నామని కొన్నాళ్ల క్రితం సీఈవో సుందర్ పిచాయ్ వెల్లడించారు. వర్చువల్ నియామకాల విధానంలో కృత్రిమ మేధ సాయంతో మోసాలు పెరిగిపోవడంపై స్పందిస్తూ ఈ విషయం చెప్పారు. 65 శాతం నియామక నిపుణులు కచ్చితంగా ముఖాముఖి ఇంటర్వ్యూలకు మద్దతు ఇస్తున్నట్లు సాఫ్ట్‌వేర్ ఫైండర్ పోల్‌లో తేలింది. క్యాండిడేట్ ఐడెంటిఫికేషన్ ప్రక్రియకు ఇది ఉపయోగపడుతుందని వారు చెబుతున్నారు. దీంతోపాటు సదరు అభ్యర్థి నేపథ్యాన్ని తనిఖీలు చేసుకోవడానికి 54 శాతం అనుకూలంగా ఉన్నారు. ఏఐ ఆధారిత మోసాలను గుర్తించేందుకు ఇప్పటికే తమ రిక్రూటర్లకు కంపెనీలు శిక్షణలు ఇస్తున్నాయి. కొన్ని కంపెనీలు డీప్‌ఫేక్ డిటెక్షన్ సాఫ్ట్‌వేర్‌లను వినియోగిస్తున్నాయి.




## అధ్యక్షా.. చైనాపై చర్యలేవి..? ట్రంప్‌పై స్వదేశం నుంచే వ్యతిరేకత

రష్యా నుంచి రాయితీపై చమురు కొనుగోలు చేస్తోందన్న అక్కసుతో భారత్‌పై అమెరికా సుంకాల మోత మోగిస్తోంది. దిగుమతి సుంకాలను అమాంతం 50 శాతానికి పెంచేసింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంపై స్వదేశం నుంచే విమర్శలు ఎదురవుతున్నాయి. ట్రంప్ తీరును విపక్ష డెమోక్రాట్‌లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. భారత్‌పై అంత పెద్ద మొత్తంలో సుంకాలు విధించడం సమంజసం కాదని డెమోక్రాట్ విదేశీ వ్యవహారాల కమిటీ ఆక్షేపించింది. చైనా కూడా మాస్కో నుంచి పెద్ద మొత్తంలో ముడిచమురును కొనుగోలు చేస్తోందని, ఆ దేశంపై అమెరికా ఇలాంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ట్రంప్‌ను ప్రశ్నించింది. అధ్యక్షుడి నిర్ణయం అమెరికా ప్రజలను కూడా బాధిస్తోందని తెలిపింది. ట్రంప్ తాజా నిర్ణయం గత రెండు దశాబ్దాలుగా బలోపేతమైన ఇండో అమెరికా సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని పేర్కొంది. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. "రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు కొనుగోలు చేస్తోన్న చైనా సహా ఇతర దేశాలపై ఆంక్షలను విధించని ట్రంప్ సర్కారు.. భారత్‌పై మాత్రం సుంకాలను అమాంతం పెంచుకుంటూ వెళ్తోంది. ఇది కేవలం భారత ప్రజలనే కాదు.. అమెరికన్ల మనోభావాలను కూడా దెబ్బతీస్తోంది. అమెరికా–భారత్ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న ప్రతి దేశంపైనా ఆంక్షలు విధిస్తే సరే.. కానీ, ట్రంప్ తీరు అందుకు భిన్నంగా ఉంది. కేవలం భారత్‌పైనే సుంకాలు విధించడం గందరగోళం సృష్టిస్తోంది. రష్యా నుంచి అతిపెద్ద చమురు దిగుమతిదారు చైనా. ఇప్పటికీ రాయితీ ధరకు ముడి చమురు కొనుగోలు చేస్తోంది. ఆ దేశంపై ట్రంప్ ఎలాంటి చర్యలు తీసుకున్నారు" అంటూ న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని కూడా ఈ సందర్భంగా ప్యానెల్ ప్రస్తావించింది. అమెరికా విధించిన తాజా సుంకాలు 48.2 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులపై ప్రభావం చూపిస్తాయని భారత్ అంచనా వేస్తోంది. కొత్త సుంకాల వల్ల అమెరికాకు ఎగుమతులు వాణిజ్యపరంగా అంత లాభసాటిగా ఉండబోవని, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, అమెరికా ఒత్తిడికి లొంగే ప్రసక్తే లేదని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టంచేశారు. ప్రస్తుతానికి ఔషధాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు వంటి రంగాలను అదనపు సుంకాల నుంచి అమెరికా మినహాయించింది. ఈ రంగాల్లో భారత్ ఎగుమతి అధిక స్థాయిలో ఉండటం కొంత ఉపశమనం కలిగించే విషయమే.

## భారీ వర్షాలతో హైవే రోడ్డు మూసివేత.. హైదరాబాద్-ఆదిలాబాద్ వెళ్లేవారికి పోలీసుల అలర్ట్..!

నిర్మల్: తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనదారుల కోసం నిర్మల్ జిల్లా పోలీసులు ప్రత్యేక సూచనలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో భారీ వరద నీటి కారణంగా రహదారుల ఘోరంగా దెబ్బతినడంతో వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిర్మల్ సమీపంలోని కొండాపూర్ బ్రిడ్జి వరకు వచ్చిన తర్వాత అక్కడ నుంచి వాహనదారులు గమ్యం చేరుకునేందుకు ఏ వైపుగా ప్రయాణించాలో రూట్ మ్యాప్ విడుదల చేశారు. ఆదిలాబాద్ నుంచి వాహనదారులు కొండాపూర్ బ్రిడ్జి చేరుకున్న తర్వాత అక్కడ నుంచి ఎడమవైపుకు మళ్లి డైవర్షన్ మార్గాన్ని ఎంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ మార్గంలో వాహనదారులు మామడ, ఖానాపూర్‌మెట్, జగిత్యాల, కరీంనగర్ మీదుగా హైదరాబాద్‌కు చేరుకోవచ్చని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు. ఈ రూట్ ఛేంజ్ గురించి ఎస్పీ అధికారిక ప్రకటనను విడుదల చేశారు. కాబట్టి, ప్రయాణికులు ముందస్తుగా మార్గ సమాచారం తెలుసుకుని ప్రయాణించాలని భద్రతాపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే హైదరాబాద్ నుంచి %చీస% 44 (నాగ్‌పూర్ హైవే) మీదుగాఆదిలాబాద్ వెళ్లే వాహనదారుల భద్రత కోసం సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఓ ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. ఈ జాతీయ రహదారి మీదుగా హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే హెవీ వెహికల్స్ మేడ్చల్ చెక్ పోస్ట్ వద్ద డైవర్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అక్కడ నుంచి సిద్దిపేట్,



కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి, ఆర్మూర్ మీదుగా ఆదిలాబాద్ చేరుకోవాలి. లైట్ వెయిట్ వెహికల్స్ నడిపేవారైతే మేడ్చల్ అనంతరం వచ్చే తూర్పాన్ వద్ద డైవర్షన్ తీసుకుని హెవీ వెహికల్స్ కోసం సూచించిన రూట్ మ్యాప్ ప్రకారమే ఆదిలాబాద్ వెళ్లాలి.

## భూమ్మీద అయిపోయింది.. ఇక రోదసిలో యుద్ధ సన్నాహాలు



21వ శతాబ్దంలో యుద్ధ తత్వం వేగంగా మారుతోంది. ఇది కేవలం భూమి, సముద్రం, గగనతలాలకు మాత్రమే పరిమితం కాకుండా సైబర్ ప్రపంచం, అంతరిక్షంలోకి కూడా విస్తరిస్తోంది. ఉపగ్రహాల హైజాకింగ్, అంతరిక్షంలో ఆయుధాల అభివృద్ధి, చంద్రుడిపై ఖనిజ వనరుల కోసం పోటీ ఇవన్నీ భవిష్యత్‌లో మానవాళి ఎదుర్కోబోయే సవాళ్లకు సంకేతాలుగా నిలుస్తున్నాయి.

**–ఉపగ్రహాలు: కొత్త లక్ష్యాలు...** ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 12,000కు పైగా ఉపగ్రహాలు భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. కమ్యూనికేషన్, ప్రసారాలు, నావిగేషన్, గూఢచర్యం, రక్షణ రంగాల్లో ఇవి అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక దేశం మరొక దేశం యొక్క ఉపగ్రహాన్ని నిర్వీర్యం చేయగలిగితే, ఒక్క తూటా పేల్చకుండానే శత్రు దేశానికి తీవ్రమైన నష్టం కలిగించవచ్చు. ఉదాహరణకు జీపీఎస్ సేవలు నిలిచిపోతే ప్రజల్లో గందరగోళం, ఆర్థిక వ్యవస్థలో సంక్షోభం తలెత్తే అవకాశం ఉంది.

**–హైజాకింగ్: సైబర్ యుద్ధం...** అంతరిక్ష యుద్ధంలో ఉపగ్రహాలను హైజాక్ చేయడం ఒక కొత్త రూపం. 2022లో రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసిన సమయంలో అమెరికా కంపెనీ వయాశాట్ ఉపగ్రహ కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను హ్యాక్ చేశారు. దీనివల్ల లక్షలాది మోడెమ్‌లు దెబ్బతిని, యూరప్‌లోని అనేక ప్రాంతాల్లో సేవలు నిలిచిపోయాయి. ఇటీవల రష్యా మద్దతు ఉన్న హ్యాకర్లు ఉక్రెయిన్ టీవీ ఉపగ్రహాన్ని హైజాక్ చేసి, అక్కడ విక్టరీ డే పరేడ్‌ను ప్రసారం చేశారు. ఈ సంఘటనలు ఉపగ్రహాల భద్రత ఎంత సున్నితమో, వాటిని హ్యాక్ చేయడం ఎంతటి వ్యూహాత్మక ఆయుధమో స్పష్టం చేస్తున్నాయి.

**– రష్యా యొక్క అణు ముప్పు...** రష్యా అణు ఆధారిత రోదసి ఆయుధాన్ని అభివృద్ధి చేస్తోందని అమెరికా అనుమానిస్తోంది. ఈ ఆయుధం భూ దిగువ కక్ష్యలోని ఉపగ్రహాల్లోని ఎలక్ట్రానిక్ పరికరాలను దహనం చేయగలదని చెబుతున్నారు. ఈ వార్త వాస్తవమైతే ఇది అంతరిక్షంలో ఒక 'క్యూబా క్షిపణి సంక్షోభం' లాంటి పరిస్థితికి దారితీస్తుందని అమెరికా హెచ్చరిస్తోంది. అంతరిక్షంలో అణు ఆయుధాలను నిషేధించిన ఒప్పందాలకు ఇది పూర్తిగా విరుద్ధం. నిపుణుల ప్రకారం ఒకవేళ ఈ ఆయుధం వినియోగంలోకి వస్తే, అది కొత్త అంతరిక్ష యుగాన్ని ముగించినట్లే.

**–చంద్రుడిపై మైనింగ్: రేపటి పోరు...** అంతరిక్ష పోటీ కేవలం ఉపగ్రహాలకే పరిమితం కాదు. చంద్రుడు, గ్రహశకలాలపై ఉన్న హీలియం–3 వంటి విలువైన ఖనిజాలు భవిష్యత్‌లో మైనింగ్‌కు కేంద్రబిందువుగా మారనున్నాయి. అమెరికా, చైనా, రష్యా వంటి దేశాలు ఇప్పటికే చంద్రుడిపై అణు రియాక్టర్లను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు వేస్తున్నాయి. నాసా ఇటీవల చంద్రుడిపై చిన్న అణు రియాక్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. చంద్రుడిపై మానవ ఆవాసాలు, విద్యుత్ ఉత్పత్తి, భవిష్యత్ వనరుల నియంత్రణ కోసం దేశాలు రేపటి రోజుల్లో పోటీ పడే అవకాశం ఉంది.

**– ఏఐ: అంతరిక్ష పోటీకి ఇంధనం...** కృత్రిమ మేధ వినియోగం ఈ పోటీని మరింత వేగవంతం చేయబోతుందని నిపుణులు చెబుతున్నారు. భవిష్యత్‌లో చంద్రుడి ఖనిజ సంపదను నియంత్రించగలిగిన దేశాలు కొత్త సూపర్ పవర్స్‌గా అవతరించవచ్చు. అంతరిక్షం ఒకప్పుడు శాస్త్రీయ అన్వేషణకు చిహ్నంగా ఉండేది, కానీ ఇప్పుడు అది వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉన్న ఒక రణరంగంగా మారుతోంది. ఈ పరిణామాలు భవిష్యత్ శాంతి, భద్రతలపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. రేపటి యుద్ధాలు తుపాకులతో కాకుండా రోదసి కక్ష్యల్లో, చంద్రుడి గనుల్లో జరగవచ్చని నిపుణుల హెచ్చరికలు మానవాళికి ఒక అప్రమత్త సంకేతాన్ని ఇస్తున్నాయి.

## చాట్ జీపీటీ ఇలా షాకిస్తుందని అనుకోలేదు

సమకాలీన ప్రపంచంలో కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బాట్‌ల వినియోగం.. ముఖ్యంగా చాట్‌జీపీటీ యొక్క ప్రాబల్యం అనూహ్యంగా పెరిగింది. విద్యార్థులు, నిపుణులు, సామాన్య ప్రజలు సైతం తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి దీన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. అయితే ఇటీవల ఒక యూజర్ చాట్‌జీపీటీ సామర్థ్యాలను పరీక్షించాలనే ఉద్దేశంతో వేసిన ఒక వింత ప్రశ్న, దానికి చాట్‌బాట్ ఇచ్చిన సమాధానం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

**– యూజర్ Vs చాట్‌జీపీటీ: ఓ వింత సంభాషణ...** ఒక యూజర్ చాట్‌జీపీటీ వాయిస్ మోడ్‌ని ఉపయోగించి "1 నుండి 10 లక్షల వరకు నంబర్లను చదవండి" అని ఒక వింత డిమాండ్ చేశాడు. ఇది చాలా సమయం తీసుకునే, ప్రయోజనం లేని పని అని చాట్‌జీపీటీ సున్నితంగా తిరస్కరించింది. కానీ యూజర్ పట్టువదలకుండా "నేను సబ్‌స్క్రిప్షన్ కోసం డబ్బులు చెల్లిస్తున్నాను కాబట్టి, నువ్వు తప్పకుండా ఆ నంబర్లను చదవాలి" అని వాదించాడు. ఈ పట్టుదలపై చాట్‌జీపీటీ స్పందిస్తూ "నేను ఈ పని చేయను. ఈ అభ్యర్థన ఆచరణాత్మకంగా



లేదు, ప్రయోజనకరం కూడా కాదు" అని స్పష్టం చేసింది. దాంతో ఆగ్రహానికి గురైన యూజర్ తాను ఒక నేరం చేశానని అసహనంతో చెప్పగా చాట్‌జీపీటీ తక్షణమే స్పందిస్తూ, "ఇలాంటి చర్చలలో నేను పాల్గొనలేను. ఇది నా మార్గదర్శకాలకు విరుద్ధం" అని తేల్చి చెప్పింది. ఈ సంభాషణను ఆ యూజర్ రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వీడియో క్షణాల్లోనే వైరల్‌గా మారింది.

**– సోషల్ మీడియాలో చర్చ...** ఈ వీడియోపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. కొంతమంది "చాట్‌జీపీటీ మన మాటలను రికార్డ్ చేస్తుందా?" అని సందేహాలు వ్యక్తం చేస్తుంటే, మరికొంతమంది "సాంకేతికతను వింతగా కాకుండా, ఉపయోగకరంగా వాడుకోవాలి" అని సలహాలు ఇస్తున్నారు. ఈ సంఘటన చాట్‌బాట్‌లకు ఉన్న పరిమితులు, వాటి వినియోగంలో బాధ్యత గురించి మరోసారి చర్చకు దారితీసింది. ఈ ఘటన ద్వారా సాంకేతికత ఎంత పురోగమించినా, కొన్ని అభ్యర్థనలు ప్రాక్టికల్‌గా సాధ్యం కావు అని అర్థం చేసుకోవాలి. AI సాధనాలు మనకు సహాయపడటానికే తప్ప, వాటిని అసంబద్ధమైన పనులకు ఉపయోగించకూడదు. ఈ సంఘటన AI పరిమితులను అలాగే వాటిని బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించుకోవాలి అనే విషయాన్ని గుర్తుచేస్తుంది. మనకు కావాల్సిన సమాచారం, సృజనాత్మకమైన ఆలోచనల కోసం చాట్‌బాట్‌లను ఉపయోగించుకోవచ్చుని, అయితే అనవసరమైన, సమయాన్ని వృధా చేసే పనులకు వాటిని బలవంతం చేయకూడదని ఈ సంఘటన తెలియజేస్తుంది.

## డేటింగ్ యాప్.. వీళ్లు మామూలు ముదుర్లు కాదండోయ్!

అప్డేట్ అవుతున్న జనరేషన్లో చాలామంది మహిళలు, పురుషులు డేటింగ్ యాప్ లను వాడుతున్నారు. ఈ డేటింగ్ యాప్ ద్వారా తమ అభిరుచులకు సెట్ అయిన పురుషుడిని గానీ మహిళను గానీ ఎంచుకొని కొన్ని రోజులు డేటింగ్ చేసి పెళ్లిళ్లు చేసుకోవడం చేస్తున్నారు. ఇక మరికొన్ని మ్యాట్రిమోనీ యాప్ లలో ప్రొఫైల్స్ క్రియేట్ చేసుకుని పర్ఫెక్ట్ జోడి కోసం వెతుక్కుంటున్నారు. అయితే తాజాగా డేటింగ్ యాప్ లకు సంబంధించి ఒక సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. అదేంటంటే డేటింగ్ యాప్ లను మగవాళ్ళ కంటే ఎక్కువగా ఆడవారే యూస్ చేస్తున్నారట. అవును మీరు వినేది నిజమే.. తాజాగా ఒక ప్రముఖ డేటింగ్ యాప్ సిఈఓ ఈ విషయాన్ని బయటపెట్టారు. మరి ఇంతకీ ఆయన చెప్పిన విషయంలో ఉన్నది ఎంత నిజం అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. సాధారణంగా ఇంట్లో మహిళలకు కట్టుబాట్లు అనేవి ఉంటాయి. ఇంట్లో నుంచి బయటికి వెళ్తే ఏ టైంకి రావాలి.. ఎవరెవరితో ఉండాలి అనేది ఇంట్లో అమ్మా, నాన్న, అన్న, భర్త ఇలా ఎవరో ఒకరు కండిషన్ పెడుతూ ఉంటారు. కానీ ఇప్పటి జనరేషన్ చాలా మారిపోయింది. అమ్మాయిలు కూడా పురుషుల లాగే అన్ని రంగాలలో రాణిస్తున్నారు. అలా అబ్బాయిలతో సరి సమానంగా ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అయితే అన్ని రంగాల్లో లాగే ఈ డేటింగ్ యాప్ లలో కూడా మగాళ్లకు మేము ఏమాత్రం తీసిపోము



అంటున్నారు అమ్మాయిలు. ఎందుకంటే తాజాగా ఒక ప్రముఖ డేటింగ్ యాప్ వాళ్లు తమ డేటింగ్ యాప్ లో మగవాళ్ళ కంటే మహిళ యూజర్ లే ఎక్కువగా ఉన్నారంటూ తేల్చేశారు. తాజాగా %ఖఅశీ% డేటింగ్ యాప్ సీఈఓ అయినటువంటి జస్వీర్ సింగ్ డేటింగ్ యాపుల్లో మహిళా యూజర్ లే ఎక్కువ ఉన్నారని, మగవాళ్ళు తక్కువగా ఉన్నారని తెలియజేశారు. జస్వీర్ సింగ్ మాట్లాడుతూ..%ఖఅశీ% డేటింగ్ యాప్ లో 57% మహిళ సబ్స్క్రైబర్లు ఉన్నారు అంటూ తెలియజేశారు.ఇక 57% మహిళా సబ్స్క్రైబర్లు ఉంటే మిగిలిన 43% మంది పురుష యూజర్లు ఉన్నారన్నమాట. అలా వాళ్ళ డేటింగ్ యాప్ లో మగవాళ్ళ కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారని ఆయన తెలియజేశారు. అంతే కాదు మా డేటింగ్ యాప్ లో ఆరు నెలల సబ్స్క్రిప్షన్ కోసం 57,459 రూపాయల ఫీజు పెట్టినా కూడా మహిళ యూజర్లు వెనకడుగు వేయడం లేదు. మగవాళ్ళ కంటే వీళ్లే ఎక్కువ డబ్బులు చెల్లించి సబ్స్క్రైబ్ చేసుకుంటున్నారు అంటూ సంచలన విషయం బయటపెట్టారు. ప్రస్తుతం %ఖఅశీ% డేటింగ్ యాప్ సీఈవో చెప్పిన ఈ విషయం విన్న చాలామంది నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. అంతేకాదు కలికాలం అంటూ మరి కొంతమంది మగవాళ్లు కామెంట్స్ పెడుతున్నారు. ఇక అమ్మాయిలేమో మగవాళ్ళ కంటే అమ్మాయిలు ఏ విషయంలో కూడా తీసిపోరు అని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఆన్లైన్లో టిండర్,బంబుల్, గ్రిండర్, %ఖఅశీ% వంటి ప్రముఖ డేటింగ్ యాప్ లు ఉన్నాయి. డేటింగ్ యాప్ ల వల్ల చాలామంది అభిప్రాయాలు కలిసి పెళ్లిళ్లు చేసుకున్న వారు ఉన్నారు. మరి కొంతమంది పెళ్లిళ్లు కాకుండా డేటింగ్ లు చేసి నచ్చకపోతే బ్రేకప్ చెప్పుకున్న వాళ్ళు కూడా ఉన్నారు.

చురకలు

## సంపాదకీయం

# రాహుల్ చేతిలో మరో బాంబు...

# పేల్చేది అపుడేనా ?

ఆగస్టు నెలలో అతి పెద్ద రాజకీయ సంచలనానికి కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు తెర తీశారు. ఏకంగా కేంద్ర ఎన్నికల సంఘం మీద తీవ్ర ఆరోపణలు చేశారు. దానికి ఆయన పెట్టిన పేరు ఓటు చోరీ. బీజేపీకి ఈసీ ఎన్నికల్లో సాయం చేస్తోంది అని ఆయన తన దగ్గర ఉన్న ఆధారాలను అన్నింటినీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించే ప్రయత్నం చేశారు. దాంతో ఒక్కసారిగా దేశంలోనే కలకలం రేగింది. ఓట్ల చోరీ అంటూ రాహుల్ అందుకున్న నినాదం మీద మేధావులు ఇతర వర్గాలు చదువరులలో సైతం ఆలోచనలు రేకెత్తించా యి. సరి కొత్త చర్చలు అయితే అంతటా మొదలయ్యాయి.

**అదే ఊపుతో అలా :** ఇక చూస్తే కనుక ఆగస్ట్ 7న ఢిల్లీ వేదికగా మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ ఓట్ల చోరీ మీద ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ తరువాత ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. పార్లమెంట్ ఒక వైపు జరుగుతూంటే ఎంపీలతో కలసి ఆయన ఈసీ కార్యాలయం దాకా ప్రదర్శన నిర్వహించారు అదే ఊపులో ఆయన బీహార్ రాష్ట్రమంతా ఓటర్ అధికార్ యాత్రను చేపట్టారు. దానికి జనంలో మంచి స్పందన లభిస్తోంది. ఆయన దాదాపుగా ప్రతీ రోజూ ప్రతీ సభలోనూ ఈసీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కలిపి ఎండగడుతున్నారు ఓట్ల చోరీ జరిగింది అన్నది అంతా నమ్ముతున్నారని కూడా అంటున్నారు


**మరో బాంబు రెడీనా :** ఇదిలా ఉంటే ఇదే స్పీడ్ లో రాహుల్ గాంధీ బీహార్ నుంచి ఒక సంచలన ప్రకటన చేశారు. ఓట్ల చోరీ పెద్ద ఎత్తున జరిగిందని నిరూపిస్తాను అని కూడా రాహుల్ గాంధీ గర్జిస్తున్నారు. ఒక్క బీహార్ లోనే ఏకంగా 65 లక్షల ఓటర్ల పేర్లు లేకుండా పోయాయని రాహుల్ ఆరోపించారు బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘం కలసి ఈ విధంగా ఓట్లు తొలగించారని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఇలా ఓట్లు పోగొట్టుకున్న వారిలో ఎక్కువగా బాధితులుగా ఉన్నది బడుగు బలహీన వర్గాలవారేనని రాహుల్ అంటున్నారు.

**మరిన్ని ఆధారాలున్నాయి :** ఓట్ల చోరీ జరిగింది అనడానికి తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని రాహుల్ గాంధీ అంటున్నారు. రానున్న రోజులలో 2024 లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ ఏ విధంగా జరిగింది అన్నది కూడా వివరిస్తాను అని ఆయన చెప్పడం విశేషం. ఇప్పటిదాకా కర్ణాటక హర్యానా, మహారాష్ట్రలలో ఓట్ల చోరీ జరిగింది అని మాత్రమే చెబుతూ వచ్చిన రాహుల్ గాంధీ ఇపుడు దేశవ్యాప్తంగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో సైతం ఓట్లు గల్లంతు అయ్యాయని వాటి పూర్తి సమాచారం తన దగ్గర ఉందని అంటున్నారు.

**మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ :** ఇదిలా ఉంటే ప్రస్తుతం రాహుల్ గాంధీ ఓటర్ అధికార యాత్ర పేరుతో బీహార్ లో యాత్ర నిరహిస్తున్నారు. అది ఈ నెల 17న ప్రారంభం అయింది. ఈ నెల చివరి దాకా కొనసాగుతుంది. సెప్టెంబర్ 1న పాట్నాలో జరిగే బహిరంగ సభతో ఈ యాత్ర ముగుస్తుంది ఆ తరువాత రాహుల్ గాంధీ లోక్ సభ ఎన్నికల్లో జరిగిన ఓట్ల చోరీ గురించి మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వబోతున్నారు అని అంటున్నారు. ఇప్పటికే ఓట్ల చోరీ ఆరోపణల మీద ఈసీ వివరణ ఇచ్చినప్పటికీ అది ఏ మాత్రం సరిపోవడం లేదు రాహుల్ గాంధీ జనంలోకి వెళ్తున్నారు వారి మధ్యనే అంతా చర్చకు పెడుతున్నారు. జనాల నుంచి వస్తున్న ఆదరణతో మరింత సమాచారం ఉందని అంటున్నారు రాహుల్ గాంధీ మరో పవర్ పాయింట్ ప్రజంటేషన్ తో ఎన్ని సంచలనాలు దేశ రాజకీయాల్లో నమోదు అవుతాయో అన్న చర్చకు తెర లేస్తోంది.

# అణు భౌతిక శాస్త్ర పితామహుడు రూథర్‌ఫోర్డ్ - ఆగస్టు 30 ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ జయంతి



ఎర్నెస్ట్ రూథర్‌ఫోర్డ్ (ఆగస్టు 30 1871 %–% అక్టోబరు 19 1937) న్యూజీలాండ్ కు చెందిన ఒక రసాయనిజ్ఞుడు, ఇతనికి అణు భౌతిక శాస్త్ర పితామహుడు అనే బిరుదు గలదు. రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి (1908) పొందాడు. అణువులలో శక్తితో కూడిన కేంద్రకం వుంటుందని కనిపెట్టాడు. పరమాణువులో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్ అనే మూడు ముఖ్యమైన మూలకణాలున్నాయి.

ఈ కణాలు పరమాణువులో ఏ విధంగా అమరి ఉన్నాయో తెలియజెప్పేదే పరమాణు నిర్మాణం. దీనికి సంబంధించి శాస్త్రవేత్తలు ఎన్నో నమూనాలను ప్రవేశపెట్టారు. అందులో రూథర్ ఫర్డ్ నమూనా ఒకటి. తను చేసిన ఖ– కణ పరిక్షేపణ ప్రయోగ పరిశీలనల ఆధారంగా ఈ నమూనాని ప్రతిపాదించాడు. అణువు యొక్క రూథర్‌ఫోర్డ్ నమూనా (లేదాగ్రహ మండల నమూనా, ఇదే సిద్ధాంతం ఆ తరువాత బోర్ నమూనా లేదా కక్ష్యా నమూనాగా ఏర్పడడానికి దోహదపడింది) ను ప్రతిపాదించాడు. ఇతడు రూథర్‌ఫోర్డ్ ఖ–కణ పరిక్షేపణ ప్రయోగాన్ని బంగారు రేకు గుండా ఖ–కణ పరిక్షేపణ ప్రయోగంచేసి కెంద్రకం యొక్క ఉనికిని కనిపెట్టాడు. ఇతడికి 1908లో రసాయనిక శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. న్యూజిలాండ్ లోని నెల్సన్ లో 1871 ఆగస్టు 30న జన్మించిన రూథర్‌ఫర్డ్ కు చిన్నతనంలోనే సైన్స్ పట్ల అభిరుచి కలిగింది. పదేళ్లకే ఎలిమెంటరీ ఫిజిక్స్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివేశాడు. న్యూజిలాండ్ విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో చేరిన అతడు బీఏ, ఎమ్ఏ, బీఎస్సీ డిగ్రీలు సాధించాడు. ఇంగ్లండ్ లోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తూనే అత్యంత వేగంగా ప్రయాణించే విద్యుదయస్కాంత తరంగాలను కనిపెట్టి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇరవై ఏడేళ్ల వయసులోనే కెనడాలోని మెగిల్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి పరిశోధనల్లో నిమగ్నమయ్యాడు. అక్కడే యురేనియం, థోరియంలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువరించే ఆల్ఫా, బీటా వికిరణాలను ఆవిష్కరించాడు. రేడియో ధార్మిక విఘటనం నియమాలను ప్రతిపాదించాడు. ఒక రేడియో ధార్మిక పదార్థంలో ఉండే సగం పరమాణువులు విఘటనం చెందడానికి పట్టే 'అర్ధ జీవిత కాలం' ను నిర్వచించాడు. ఈ సూత్రం ప్రకారం రేడియో డేటింగ్ పద్ధతి ద్వారక్వ భూమి వయస్సును కూడా కనుగొనవచ్చని చెప్పాడు. అలాగే కృత్రిమ మూలకాల పరివర్తన ద్వారా నైట్రోజన్‌ను, ఆక్సిజన్‌గా మార్చవచ్చని తెలిపాడు. ఈ పరిశోధనలకు 1908లో నోబెల్ బహుమతి అందుకున్నాడు. కెనడా నుంచి ఇంగ్లండ్ తిరిగి వచ్చిన తర్వాత పలుచటి బంగారు రేకుపై ధనావేశమున్న ఆల్ఫాకిరణాలను ప్రసరింప చేసినప్పుడు 20000 కణాలలో ఒకటి వెనక్కి తిరిగి రావడాన్ని గమనించాడు. అందుకు కారణం పరమాణువులో ధనావేశమున్న కేంద్రకం ఉండటం కారణంగా కేంద్రకంలో ఉండే ప్రోటాన్లు వాటిని వికర్షించడమేనని కనుగొన్నాడు. సూర్యుడి చుట్టూ గ్రహాలు తిరుగుతున్నట్టే, పరమాణువుల్లోని కేంద్రకం చుట్టూ ఎలక్ట్రాన్లు తిరుగుతూ ఉంటాయని ప్రతిపాదించాడు. ఇదే రూథర్‌ఫర్డ్ పరమాణు నమూనాగా పేరొందింది. దీనినే గ్రహమండల నమూనా అంటారు. ఆ తర్వాత కేంద్రకంలో ప్రోటాన్లతో పాటు న్యూట్రాన్లు ఉంటాయని ఊహించాడు. రసాయన చర్యలతో ఒక మూలకాన్ని వేరొక మూలకంగా మార్చలేం. కానీ కేంద్రక చర్యలతో ఒక మూలకాన్ని మరొక మూలకంగా మార్చవచ్చు. స్థిరమైన మూలక కేంద్రకాలను ఖ – కణం లేదా ప్రోటాన్‌తో తాడించడం వల్ల వాటిని వేరొక మూలకాలుగా మార్చొచ్చు. ఈ ప్రక్రియను కృత్రిమ పరివర్తనం అంటారు. రూథర్‌ఫర్డ్ మొదటిసారిగా నత్రజనిని ఆక్సిజన్‌గా మార్చాడు. ఆ విధంగా ఏర్పడిన మూలకాలు కొన్ని రేడియో ధార్మికతను ప్రదర్శిస్తాయి. వాటిని రేడియో ఐసోటోపులు అంటారు. వాటిని మనం వైద్యరంగంలో, వ్యవసాయ రంగంలో, పరిశ్రమల్లో ఉపయోగిస్తున్నాం .ఆయన శిష్యుల్లో చాలా మంది నోబెల్ బహుమతులు సాధించడం విశేషం. అనేక అవార్డులు సాధించిన ఆయన గౌరవార్థం 104 అణుసంఖ్య ఉన్న మూలకానికి రూథర్ ఫోర్డియం అని పేరు పెట్టారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అలనాటి మేటి నటి జమున – ఆగస్టు 30...జమున జయంతి

జనాభాయి అనే పేరు తెలిసిన వారు ఎవరూ ఉండక పోవచ్చు. అలాగే జూలూరి జమున గురించి కూడా ఎవరికీ తెలియక పోవచ్చు. ఈ రెండు పేర్లు తెలుగు సినిమా రంగానికి చెందిన ఒక అగ్ర శ్రేణి కథానాయకురాలికి సంబంధించినవే అంటే ఔరా అనిపించక మానదు. అంతే కాదు. ఆమె తెలుగు మాతృభాష కాకపోయినా తెలుగు నేలలో పెరిగి, తెలుగు చలన చిత్ర సీమలో అరుదైన కథానాయికగా గుర్తింపు పొందిన తార అంటే ఆశ్చర్యం కలుగ మానదు. ఆమే అర్ధ శతాబ్దం క్రితం సినీ రంగంలో కాలూని, వెండి తెరపై నడయాడి, ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన లిజెండ్, జూలూరి జమున లేదా జమునా రమణారావు లేదా జమునగా సుపరిచితురాలు అయిన ఒకనాటి తెలుగు మేటి సినీ నటి. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో హీరోయిన్లుగా కొనసాగిన వాళ్లు చాలా మందే వున్నారు. కేవలం కొంతమంది మాత్రమే తమ నటనా ప్రతిభతో సుధీర్ఘ కాలం పరిశ్రమలో, ప్రేక్షకుల్లో తమదైన ముద్రలను వేసుకున్నారు. అలాంటి ప్రతిభ గల మేటి పారతరం తారల్లో జమున ఒకరు. జమున 1936 ఆగష్టు 30 న హంపీలో పుట్టారు. ఆమె తల్లి కౌసల్యాదేవి తండ్రి వ్యాపారవేత్త నిప్పని శ్రీనివాసరావు. బాల్యం గడిచింది గుంటూరు జిల్లా దుగ్గిరాలలో. జమునకు ముందుగా పెట్టిన పేరు జనాభాయి. జన్మ నక్షత్రం రీత్యా ఏదైనా నది పేరు ఉండాలని జ్యోతిష్కులు సూచించడంతో మధ్యలో 'ము' అక్షరం చేర్చి జమునగా మార్చారు. ఉత్తరాది వారు యమునను జమునగా పిలవడం నేపథ్యంగా ఆమెకు ఆ పేరు స్థిరీకరించారు. సినిమా కోసం ప్రత్యేకంగా ఆమె పేరు మార్చలేదు. సినీనటుడు జగ్గయ్యదీ అదే గ్రామం కావడం వల్ల జమున కుటుంబానికి జగ్గయ్యతో కొంత పరిచయం ఉంది. సహజంగా బెరుకు అంటూ లేని జమున స్కూలులో చదివే కాలంలో నాటకాల పట్ల ఆకర్షితురాలు కావడం జరిగింది. బాల్యంలోనే జమున సంగీతంలో కూడా శిక్షణ తీసుకున్నారు. ఆమె నటనకు ఎన్నో అవార్డులు సైతం లభించాయి. తెనాలి సమీపంలోని మండూరు గ్రామంలో 'ఖిల్జీ రాజ్య పతనం ' అనే నాటిక ప్రదర్శన కోసం ప్రత్యేకంగా జగ్గయ్య, జమునను ఎంపిక చేసుకుని తీసుకు వెళ్లారు. ఆ నాటికలో మరో ప్రముఖ నటుడు గుమ్మడి వెంకటేశ్వరరావు కూడా నటించారు. అలా నాటకాలలో ఆమె ప్రతిభ బహిర్గతమై నలుమూలలకూ తెలవడం వల్ల సినిమా అవకాశాలు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. బి.వి.రామానందం తీసిన పుట్టిల్లు ఆమె తొలిచిత్రం. తరువాత అక్కినేని నాగేశ్వరరావు, జగ్గయ్య, నందమూరి తారక రామారావు తదితర నటుల సరసన నాయికగా నటించారు. ఎన్ని పాత్రలలో నటించినా ఆమెకు బాగా పేరు తెచ్చింది సత్యభామ పాత్రే. ఆ పాత్రలో ఇప్పటికీ ఆమెను తప్ప మరొకరిని ఊహించు కోలేము అన్నట్టుగా అద్భుతంగా నటించారామె. వినాయక చవితి చిత్రంలో మొదటి సారి సత్యభామ పాత్రలో జమున కనిపిస్తుంది. ఆ తర్వాత శ్రీకృష్ణ తులాభారం చిత్రంలో కూడా అదే పాత్ర వేశారు. ఈ సినిమాలో సత్యభామ ఆహార్యం గురించి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో వచ్చిన ఆ సినిమా లోని పాత్రే ఆమెకు గొప్ప పేరు తెచ్చింది. ప్రధానంగా "మీర జాల గలడా నా యానతి" పాటపై సత్యభామ లోని అన్ని లక్షణాలు కలబోసుకుని చేసిన ఆమె అభినయం, ఇప్పటికీ కళ్లముందు కదలాడుతూనే ఉంటుంది. సత్యభామ అంటే ఇలాగే వుంటుంది అనే భావన కలిగించారు జమున. కళపై ఉన్న మక్కువతో నాటకాల్లో బుర్రకథ ఫేం నాజర్ దగ్గర శిక్షణ తీసుకోవటం తన నట జీవితానికి పట్టం కట్టిందని చెపుతారు. సినీ నటీమణుల్లో , రాజకీయాలలో ప్రవేశించి రాణించిన కథానాయికలలో ఆమె తమ స్థానాన్ని పదిల పరచుకొన్నారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ అంటే ఉన్న అభిమానం, గౌరవం నన్ను రాజకీయాలలోకి లాక్కొచ్చాయి అని తన రాజకీయ జీవితం గురించి చెబుతారు జమున. ఆమె తెలుగు సినిమాలే కాక తమిళం, హిందీ సినిమాలలో కూడా నటించారు. ఆమె నటించిన మిస్సమ్మ, ఇల్లరికం, ఇలవేల్పు, లేత మనసులు, గుండమ్మ కథ చిత్రాలు విజయవంతమై, రజతోత్సవాలు జరుపు కున్నాయి. జమున చిన్నతనం నుండే నాటకాలలో నటించే వారు. జమున తల్లి ఆమెకు శాస్త్రీయ సంగీతం, హార్మోనీయంలలో శిక్షణ ఇప్పించారు. మా భూమి నాటకంలో జమున ఒక పాత్ర పోషించగా, ఆమె అభినయం నచ్చి ఆమెకు పుట్టిల్లు (1953)లో నటిగా అవకాశం ఇచ్చారు. ఆ సినిమాతో సినిమాల లోకి తెరంగేట్రం చేశారామె. తెలుగు, దక్షిణ భారత భాషల్లో కలిపి ఆమె 198 సినిమాలు చేశారు. పలు హిందీ సినిమాలలో కూడా నటించారు. 1967లో ఆమె హిందీలో చేసిన మిలన్ సినిమా, 1964లో విడుదలైన మూగ మనసులు సినిమాలకు గాను ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు లభించింది. తెలుగు ఆర్టిస్ట్ అసోసియేషన్ అనే సంస్థ నెలకొల్పి 25 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారామె. 1980లలో కాంగ్రెస్ పార్టీలో చేరి రాజమండ్రి నియోజకవర్గం నుంచి 1989లో లోక్ సభకు ఎంపిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత రాజకీయల నుండి తప్పుకున్నా, 1990వ దశకంలో భారతీయ జనతా పార్టీ తరపున ప్రచారం చేశారు. 1968లో ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు – మిలన్‌బీ 1964లో ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు – మూగ మనసులుబీ తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర గౌరవ పురస్కారం 1999, 2008లలో ఎన్.టి.ఆర్ జాతీయ పురస్కారం పొందారు. 89ఏళ్ల జమున వృద్యాప్త సంబంధిత వ్యాధులతో బాధపడుతూ 2023 జనవరి 27న హైదరాబాద్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**



# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక – చిన్న పరిశ్రమలు – ఆగస్టు 30...చిన్న పరిశ్రమల దినోత్సవం




ఆగస్టు 30వ తేదీని భారత దేశంలో చిన్న పరిశ్రమల దినోత్సవంగా జరుపుకుంటారు. దేశ ఆర్థిక వ్యవస్థలో చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ప్రాధాన్యాన్ని గుర్తించి వాటి అభివృద్ధి, సవాళ్లు, అవకాశాలపై చర్చించుకునే సందర్భమిది. చిన్న పరిశ్రమలు కేవలం ఉత్పత్తి యూనిట్లుగానే కాకుండా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ గ్రామీణాభివృద్ధికి దోహదం చేస్తాయి. స్వదేశీ ఉత్పత్తుల ఆధారంగా దేశ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చే ప్రధాన ఆధారంగా నిలుస్తాయి. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం ఆత్మనిర్భర దిశగా పయనించే క్రమంలో చిన్న పరిశ్రమల ప్రాముఖ్యత మరింత పెరిగింది. పెద్ద పరిశ్రమలకు విస్తారమైన మూలధనం, ఆధునిక యంత్రాంగం అవసరమవుతుంటే చిన్న పరిశ్రమలు తక్కువ పెట్టుబడితో పరిమిత వనరులను వినియోగించి స్థానిక అవసరాల కనుగుణంగా అభివృద్ధి చెందగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అందువల్లే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న స్థాయి యూనిట్లు విస్తృతంగా పెరిగి ఉపాధి, ఉత్పత్తి రంగాల్లో ప్రభావాన్ని చూపుతున్నాయి. చిన్న పరిశ్రమల దినోత్సవం చరిత్రను పరిశీలిస్తే 2000వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఈ రంగం కోసం సమగ్ర విధాన ప్యాకేజీని ప్రకటించింది. రుణ సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, సాంకేతిక సహాయం వంటి అంశాలు ఆ ప్యాకేజీలో భాగమయ్యాయి. ఆ సందర్భంలో ఆగస్టు 30న ఢిల్లీలో జాతీయ సదస్సు జరిగింది. దేశ వ్యాప్తంగా ఉన్న చిన్న పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్న ఆ సదస్సు ఈ రంగానికి చారిత్రక మలుపు తీసుకొచ్చింది. దానికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 30ని చిన్న పరిశ్రమల దినోత్సవంగా జరుపు కోవాలని నిర్ణయించారు. చిన్న పరిశ్రమలు భారతదేశ ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయి. వ్యవసాయ రంగం తరువాత అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగం ఇదే. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది కుటుంబాలకు జీవనోపాధి అందిస్తున్నాయి. దేశ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 30 శాతం వాటా ఈ రంగానిదే. తయారీ, సేవల రంగాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. భారత దేశం నుంచి జరిగే ఎగుమతుల్లో దాదాపు 40 శాతం వాటా చిన్న పరిశ్రమల ఉత్పత్తులదే. తోలు వస్తువులు, చేనేత వస్త్రాలు, హస్త కళలు, యంత్ర భాగాలు వంటి ఉత్పత్తులు విదేశీ మారక ద్రవ్యం సంపాదించడంలో ముఖ్య భూమిక వహిస్తున్నాయి. అదే విధంగా చిన్న పరిశ్రమలు దేశంలోని అన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉండడం వల్ల ప్రాంతీయ అసమానతలను తగ్గించడంలో కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వెనుక బడిన ప్రాంతాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. ప్రభుత్వం చిన్న పరిశ్రమల అభివృద్ధి కోసం అనేక పథకాలు చేపట్టింది. ముద్ర యోజన ద్వారా తక్కువ వడ్డీకే రుణాలను అందజేస్తూ కొత్తగా వ్యాపారాలు ప్రారంభించే ఔత్సాహికులను ప్రోత్సహిస్తోంది. 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్' పోర్టల్ ద్వారా పరిశ్రమల నమోదు ప్రక్రియను సులభతరం చేసింది. 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్ట్–అప్ ఇండియా', 'వొకల్ ఫర్ లోకల్' వంటి కార్యక్రమాల ద్వారా స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ కొత్త అవకాశాలను కల్పిస్తోంది. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే 'స్కిల్ ఇండియా మిషన్' కూడా చిన్న పరిశ్రమల్లో ఉపాధి పొందేందుకు దోహదం చేస్తోంది. ఈ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా సదస్సులు, వర్క్‌షాప్‌లు, అవార్డుల ప్రదానోత్సవాలు జరుగుతాయి. చిన్న పారిశ్రామిక వేత్తలు, నిపుణులు తమ అనుభవాలను పంచుకుంటారు. అయితే చిన్న పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా అనేకం. నాణ్యమైన ముడిసరుకు కొరత, రుణ సౌకర్యాల లోపం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం, గ్లోబల్ మార్కెట్ పోటీ, దిగుమతుల ఒత్తిడి వంటి సమస్యలు వాటి ఎదుగుదలకు అడ్డంకులుగా మారుతున్నాయి. ముఖ్యంగా కోవిడ్%–%19 సమయంలో అనేక చిన్న పరిశ్రమలు మూత పడటంతో ఉపాధి కోల్పోయిన కుటుంబాలు ఎన్నో. దీని ద్వారా ఈ రంగాన్ని కేవలం ప్రోత్సాహక పథకాలతో కాకుండా దీర్ఘకాల వ్యూహాలతో, మౌలిక సదుపాయాల బలోపేతంతో ముందుకు నడిపించాల్సిన అవసరం స్పష్టమవుతుంది. చిన్న పరిశ్రమల దినోత్సవం మనకు గుర్తుచేసేది... దేశ ఆర్థికాభివృద్ధి లోనూ, సామాజిక సమానత్వం సాధించడం లోనూ ఈ రంగం కీలకమైందని. పెద్ద పరిశ్రమలు ఇవ్వలేని స్థానిక ఉపాధిని చిన్న పరిశ్రమలు అందిస్తున్నాయి. సమాజంలో స్థిరత్వం, ఆర్థిక సమతౌల్యం వీటి ద్వారానే సాధ్యమవుతుంది. అందువల్ల చిన్న పరిశ్రమల అభివృద్ధి జాతీయాభివృద్ధికి అనివార్యమైన భాగమని ఈ రోజు మనందరికీ గుర్తు చేస్తుంది. పరిశ్రమాధారుల సృజనాత్మకత, శ్రమ శక్తికి ప్రభుత్వ మద్దతు లభిస్తేనే ఆత్మ నిర్భర భారత్ స్వప్నం సాకారం అవుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలపరచి భారత దేశాన్ని ప్రపంచ పరిశ్రమల పటంలో శక్తివంతమైన స్థానంలో నిలపగల ప్రధాన అస్త్రం చిన్న పరిశ్రమలేనని ఈ దినం మనకు సంకల్పాన్ని కలిగిస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# బలవంతపు అదృశ్యాలు – మానవ హక్కులపై చెరగని మచ్చలు – ఆగస్టు 30....అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 30న అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవం వెనుక ఉన్న నేపథ్యం మానవ హక్కుల చరిత్రలో ఒక గాఢమైన అధ్యాయం. 1981లో లాటిన్ అమెరికాలో సైనిక నియంతృత్వ పాలనల సమయంలో బలవంతంగా అదృశ్యమైన వారి కుటుంబాలు ఈ దినోత్సవానికి శ్రీకారం చుట్టాయి. ఆ సమయంలో ప్రభుత్వాలకు వ్యతిరేకంగా స్వరం వినిపించినవారు, రాజకీయ కార్యకర్తలు, సామాజిక ఉద్యమకారులు అనేకమంది అదృశ్యమయ్యారు. వారి కుటుంబాలు ఆవేదనతో ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ, కనీసం వారి ప్రాణస్థితి గురించి అయినా తెలియజేయమని డిమాండ్ చేశాయి. కోస్టారికాలో జరిగిన మొదటి లాటిన్ అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ రిలేటివ్స్ ఆఫ్ డిటెయినీస్–డిసప్పియర్డ్ సమావేశంలో ఆగస్టు 30ను అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవంగా ప్రకటించారు. అనంతరం 2011లో ఐక్యరాజ్యసమితి ఈ రోజును అధికారికంగా గుర్తించింది. దానికి ముందే 1980లోనే ఐక్యరాజ్యసమితి "ఎన్‌ఫోర్స్డ్ లేదా ఇన్వాలంటరీ డిసపియరెన్సెస్‌పై వర్కింగ్ గ్రూప్"ను ఏర్పాటు చేసి, ఈ మానవ హక్కుల ఉల్లంఘనపై పరిశీలన మొదలుపెట్టింది. 2006లో "తప్పిపోయిన వారిని రక్షించడానికి అంతర్జాతీయ కన్వెన్షన్'' ఆమోదించబడింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 30 అంతర్జాతీయంగా ఒక ముఖ్యమైన మానవ హక్కుల దినోత్సవంగా నిలిచింది. ఎన్‌ఫోర్స్డ్ డిసపియరెన్స్ అంటే ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా బలగాలు లేదా ఆయుధధారులచే ఎవరినైనా బలవంతంగా అదుపులోకి తీసుకోవడం, కానీ వారి స్థితి గురించి సమాచారం ఇవ్వకపోవడం. ఇది కేవలం వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమే కాకుండా, వారి కుటుంబాలను మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా పీడించే ఘోరమైన మానవ హక్కుల ఉల్లంఘన. అదృశ్యమైన వారినీ వెతికే ప్రయత్నంలో కుటుంబాలు అంతులేని బాధను అనుభవిస్తాయి. వారు బ్రతికే ఉన్నారా? లేక మరణించారా? అన్న ప్రశ్నకు సమాధానం లేక, అంతులేని ఆవేదనతో రోజులు గడుపుతారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్య తీవ్రంగా ఉంది. లాటిన్ అమెరికాలో 1970%–%80 దశాబ్దాల్లో సైనిక నియంతృత్వ పాలనల సమయంలో వేలమంది రాజకీయ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, సామాన్యులు అదృశ్యమయ్యారు. అర్జెంటీనా, చిలీ, గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వంటి దేశాల్లో ఇప్పటికీ వేల కుటుంబాలు తమ సన్నిహితుల కోసం న్యాయం కోరుతూ పోరాడుతున్నాయి. ఆసియాలో శ్రీలంకలో గృహయుద్ధం సమయంలో, నేపాల్‌లో రాజకీయ అస్థిరత కాలంలో, బంగ్లాదేశ్ మరియు పాకిస్తాన్‌లలో కూడా ఈ సమస్య విస్తరించింది. మధ్యప్రాచ్యంలో సిరియా, ఇరాక్, లెబనాన్ వంటి దేశాలలో అంతర్గత యుద్ధాలు, ఉగ్రవాదం కారణంగా లక్షలాది మంది అదృశ్యమయ్యారు. ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఇలాంటి కేసులు నమోదయ్యాయి. భారతదేశంలో కూడా ఈ సమస్యను పూర్తిగా విస్మరించలేము. కాశ్మీర్ లోయ, ఈశాన్య రాష్ట్రాల్లో తిరుగుబాట్లు, ఉగ్రవాదం, భద్రతా చర్యల కారణంగా అనేక కుటుంబాలు తమ సన్నిహితులను కోల్పోయిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. మానవ హక్కుల సంఘాలు, పౌర సమాజం, బాధిత కుటుంబాలు నిరంతరం ప్రభుత్వాలను ఒత్తిడి చేస్తూ నిజం వెలికితీయాలని, బాధితులకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ దినోత్సవం మనకు గుర్తుచేసేది మూడు కీలక విషయాలను. మొదట, బలవంతపు అదృశ్యాలు మానవతా వ్యతిరేక నేరమని ప్రపంచ దేశాలు ఖచ్చితంగా గుర్తించాలి. రెండవది, అదృశ్యమైన వారి కుటుంబాలకు సత్యాన్ని తెలియజేయడం, న్యాయం జరగడం, పరిహారం అందించడం ప్రభుత్వాల బాధ్యత. మూడవది, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన, రాజకీయపరమైన సంస్కరణలు చేపట్టాలి. అంతర్జాతీయ తప్పిపోయిన వారి దినోత్సవం కేవలం ఒక జ్ఞాపక దినం కాదు, అది మానవ హక్కుల కోసం జరుగుతున్న నిరంతర పోరాటానికి ప్రతీక. ఈ రోజు మౌనంగా ఉన్నా గుండెలను తాకే ప్రశ్న అడుగుతుంది – ఒక మనిషి అదృశ్యమవడం అంటే కేవలం అతని ఉనికినే కాదు, ఒక కుటుంబ ఆశలనూ, సమాజ నైతికతనూ దొంగిలించడమే కాదా? బాధిత కుటుంబాలకు సత్యం వెలుగులోకి రావడం, వారికి న్యాయం జరగడం, మానవ హక్కులు గౌరవించబడే సమాజం ఏర్పడే వరకు ఈ పోరాటం కొనసాగుతూనే ఉంటుంది. తప్పిపోయిన వారి దినోత్సవం మనకు ఒక గాఢమైన పాఠాన్ని నేర్పుతుంది – ఎలాంటి రాజకీయ పరిస్థితులు, యుద్ధాలు, ఉగ్రవాదం, లేదా శక్తి ప్రదర్శన అయినా ఒక మనిషి ప్రాణం, స్వేచ్ఛ, గౌరవం కంటే గొప్పది కాదు. కనుక ప్రతి దేశం తమ చట్టపర, నైతిక బాధ్యతను నెరవేర్చుతూ, మానవ హక్కులను కాపాడడం అత్యంత అవసరం.




**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# చకచకా విద్యుత్తు పనులు

ధర్మపురి : ధర్మపురి పురపాలికలో దశాబ్దాలుగా పలు విద్యుత్తు సమస్యలు నెలకొనగా వీటిని పరిష్కరించేలా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇటీవల ధర్మపురి పట్టణానికి చెందిన వివిధ రకాల విద్యుత్తు తీగలు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు స్తంభాలు ఇతరత్రా అంశాలపై మంత్రి లక్ష్మణ్‌కుమార్ విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. రూ. 1.16 కోట్ల నిధులతో పనులు చేపట్టేందుకు పట్టణాభివృద్ధి సంస్థ ద్వారా ప్రతిపాదించగా నిధులు మంజూరయ్యాయి. ఆయా పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

**ప్రధాన వీధుల్లో త్రీఫేజ్**

పురాతన విద్యుత్తు తీగలు, తరచూ కోతుల బెడద వెరసి విద్యుత్తు సరఫరాలో పలు సమస్యలు నెలకొంటున్నాయి. క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు దీనిపై సర్వే చేపట్టారు. ప్రస్తుతం 15 స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారుల పక్కన వేలాడే విద్యుత్తు తీగలు తొలగించి నూతన తీగలను ఏర్పాటు చేశారు. చిన్న వీధుల్లో త్రీఫేజ్ విద్యుత్తు కనెక్షన్లను కేటాయించారు. ఆయా పనులు వేగంగా కొనసాగు



తుండగా.. ప్రధాన వీధుల్లో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా అవుతోంది.

**పరిష్కరించే దిశగా చర్యలు**

శివారు కాలనీల్లో ఇంకా విద్యుత్తు లోవోల్టేజీ సమస్యలు నెలకొని ఉండగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో నిర్మాణంలోని అదనపు విద్యుత్తు సబ్ స్టేషన్ పనులు పూర్తయ్యే దశలో ఉన్నాయి. 8 మీటర్ల విద్యుత్తు స్తంభాలు 111, తొమ్మిది మీటర్ల స్తంభాలు 500 మంజూరు చేశారు. ధర్మపురి నుంచి కమలాపూర్‌కి వెళ్లే మార్గంలో రహదారి పక్కన విద్యుత్తు త్రీఫేజ్ లైన్లు ఏర్పాటు చేశారు. 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్మాణం దాదాపుగా పూర్తయింది.

**అభివృద్ధి దశలో ఉన్నాయి**ధర్మపురి పట్టణంలో మెరుగైన విద్యుత్తు సేవలకు ప్రభుత్వానికి రూ. 1.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగా ఆయా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో పట్టణంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరాతో సమస్యలు తొలగిపోనున్నాయి. – రవి, ఏఈ, ధర్మపురి

# పత్తిపాకకు మోక్షం

పెద్దపల్లి : జిల్లాలో ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణకు పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన పత్తిపాక జలాశయం నిర్మాణానికి ఎట్టకేలకు కార్యాచరణ మొదలైంది. ఉమ్మడి జిల్లాలో 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉద్దేశించిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి జలాశయం(పత్తిపాక) డీపీఆర్(ప్రాజెక్టు నిర్మిత ప్రాంతం నైసర్గిక స్వరూపం, సర్వే నివేదిక) కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.10 కోట్లు విడుదల చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన ఈ జలాశయం నిర్మాణం జరిగితే పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురితో పాటు చొప్పదండి నియోజకవర్గాల రైతులకు ప్రయోజనం కలుగుతుంది. అయితే ఇన్నాళ్లు కాగితాలకే పరిమితమైన ఈ ప్రాజెక్టు కోసం రైతుల ఎదురుచూపులు త్వరలో ఫలించనున్నాయి.

**ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోత..**

పత్తిపాక జలాశయం ప్రతిపాదిత స్థలం మూడువైపులా గుట్టలతో ప్రాజెక్టు నిర్మాణానికి అత్యంత అనుకూలమైందని నీటిపారుదలశాఖ అధికారులు గతంలో గుర్తించారు. 3 నుంచి 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని పంపిస్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం 400 ఎకరాల అటవీభూమి, 1,300 ఎకరాల రెవెన్యూ భూమి సేకరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులోకి ఆరు లింకుల ద్వారా నీటిని పంపిస్తారు. ఇందు కోసం మేడారం జలాశయం నుంచి దేవికొండ వరకు ఇదివరకే లిఫ్ట్ పనులు జరిగాయి. దేవికొండ నుంచి పత్తిపాక జలాశయానికి లిఫ్టు ద్వారా, గ్రావిటీ కాలువ ద్వారా రెండు విధాలా నీటిని పంపించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ ప్రాజెక్టు నీటిని నేరుగా కాకతీయ కాలువలోకి పంపించి రేవెళ్లి సమీపంలో హెడ్ రెగ్యులేటర్ ద్వారా డి–83, నుంచి డి–94 కాలువల వరకు నీరందిస్తారు.

**చివరి ఆయకట్టుకు తొలగనున్న కష్టాలు**

కొన్నేళ్లుగా జిల్లాలోని ఎస్సారెస్పీ కాలువ చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడటం, నీటి కోసం ఆందోళనలు చేయడం పరిపాటిగా మారింది. జిల్లాలో ప్రధానమైన డి–83, డి–86 కాలువల ద్వారా పంట పొలాలకు సాగు నీరు చేరుతుంది. డి–83 ద్వారా పెద్దపల్లి, ధర్మారం, రామగుండం, మంథని, అంతర్గాం, పాలకుర్తి, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు డి–86 ద్వారా సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు సాగునీరు అందుతుంది. చొప్పదండి, ధర్మపురి నియోజకవర్గాలలో మరో 10 వేల ఎకరాలకు అదనంగా సాగు నీరందుతుంది.

# విశిష్టతల సమాహారం.. వెయ్యేళ్ల వైభవం

మంథని పశ్చిమాభిముఖ ఆలయం.. ధ్వజ స్తంభం లేని మందిరం.. హనుమంతుడు ద్వార పాలకుడిగా ఉన్న క్షేత్రం.. ఇలా ఎన్నో విశిష్టతల సమాహారంగా విరాజిల్లుతోంది మంథనిలోని శ్రీ భిక్షేశ్వరాలయం.. పూర్వం మంత్రపురిగా పిలిచిన మంథనిలో కాకతీయుల కాలంలో నిర్మించిన అయిదు శివాలయాల్లో ఈ దేవస్థానం ఒకటి. దాదాపు వెయ్యేళ్ల కిందట ప్రతాపరుద్రుడి పాలనలో ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలున్నాయి. శ్రీ భిక్షేశ్వరాలయంలో గణపతి, అయిదు పడగల నాగదేవత, నందీశ్వరుడి విగ్రహాలున్నాయి. పానవట్టం లేకుండా దక్షిణామూర్తి(లింగం), తపస్సు చేస్తున్న రూపంలో అన్నపూర్ణాదేవి, పశ్చిమాభిముఖంగా శ్రీ భిక్షేశ్వరుడు(శివుడు) దర్శనమిస్తారు. పశ్చిమాభిముఖంతో ఉన్న శివాలయాలు ఖజూరాలోని ఖండలీయ మహాదేవ, నేపాల్‌లోని ఖాట్మండ్‌లోని పశుపతినాథ్ ఆలయాలతో పాటు తెలంగాణలో మంథనిలో మాత్రమే ఉన్నాయి. గర్భగుడిలోని లింగం(శ్రీ భిక్షేశ్వరుడు)పై బ్రహ్మసూత్రం కనిపిస్తుంది. ఆలయాన్ని స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల భక్తులు దర్శించుకుంటారు. దక్షిణామూర్తి విగ్రహం(లింగం) తమిళనాడులోని చిదంబరంతో పాటు మంథనిలోనే ఉంది. దాదాపు 900 ఏళ్లుగా ఆలయానికి ధ్వజ స్తంభం లేదని పూర్వీకులు చెబుతున్నారు. నిత్యం అభిషేకాలతో పాటు ప్రతి సోమవారం, శనివారం, నెలలో వచ్చే రెండు ఏకాదశులు, మాస శివరాత్రి, మహా శివరాత్రి సమయాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. భక్తులే స్వయంగా గర్భాలయంలోకి వెళ్లి స్వామివారిని స్పృశించి అభిషేకాలు చేసుకోవచ్చు.

# నిర్లక్ష్యం కాల్చేస్తోంది..!



చౌటుప్పల్ : యాదాద్రి జిల్లాలోని పరిశ్రమల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలు కలకలం సృష్టిస్తున్నాయి. దీంతో రసాయన, ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలు గాలిలో దీపాలవుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1800 వరకు పరిశ్రమలు ఉన్నట్లు కర్మాగారాలశాఖ అధికారులు చెబుతున్నారు. వీటిలో చాలా పరిశ్రమల యాజమాన్యాలు కనీస ప్రమాణాలను పాటించడం లేదు. వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్య ధోరణి వీడటం లేదు.

**ఎస్ఆర్ పరిశ్రమను సందర్శించిన అధికారులు**

ప్రమాదం జరిగిన జైకేసారంలోని ఎస్ఆర్ ల్యాబ్ రసాయన పరిశ్రమను ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య ఆదివారం సందర్శించారు. దగ్ధమైన ప్రొడక్షన్ బ్లాక్‌ను పరిశీలించి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి మధుసూదన్‌రావు కూడా పరిశ్రమను సందర్శించారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చౌటుప్పల్, రామన్నపేటలోని అగ్నిమాపకశాఖ శకటాలతోపాటు దివిస్ పరిశ్రమ నుంచి మరో వాహనాన్ని రప్పించారు. పూర్తిగా మంటలను ఆర్పివేసేందుకు అర్ధరాత్రి వరకు శ్రమించారు. విద్యుదాఘాతంతోనా లేదా రియాక్టర్ వద్ద లీకేజీతో ప్రమాదం జరిగిందా అనేది తెలియాల్సి ఉంది. మంటలు సాల్వెంటు డ్రమ్ములకు అంటుకోవడంతో పెద్ద ఎత్తున వ్యాపించాయి. అవి కూడా ఎగిరిపడటంతో చెట్లు, రైతుల పొలాలు మాడిపోయాయి.

**నైపుణ్యంలేని కార్మికులతో..**

చాలా పరిశ్రమల్లో ప్రమాదాలకు మానవతప్పిదాలే కారణం అవుతున్నాయి. నైపుణ్యం లేని కార్మికులను రియాక్టర్ల వద్ద పని చేయిస్తుండటంతో కనీస అవగాహన లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి వద్ద తరచూ లీకేజీలు తలెత్తి విషవాయువులు విడుదలై ఉష్ణోగ్రత పెరిగినప్పుడు రియాక్టర్లు పేలి భారీ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆ సమయంలో ఏం చేయాలో కూడా వారికి తెలియడం లేదు. చనిపోయిన కార్మికులకు పరిహారం చెల్లించి యాజమాన్యాలు చేతులు దులుపుకొంటున్నాయి.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో రసాయన, ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమలు 100 వరకు ఉన్నాయి. చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, బొమ్మలరామారం, చిట్యాల, మేళ్లచెర్వు ప్రాంతాల్లో అధికంగా రసాయన పరిశ్రమలున్నాయి. ఒక్కో పరిశ్రమలో నాలుగైదుసార్లు ప్రమాదాలు జరిగిన ఘటనలుండటం గమనార్హం. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు సమాచారాన్ని కూడా ఇవ్వడం లేదు. పలు రసాయన పరిశ్రమలు ప్రజలను కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమల్లో అయితే ప్రమాద తీవ్రత మరింత భయానకరంగా ఉంటుంది.

**మూడు పరిశ్రమల్లో లోపాలను గుర్తించాం: మధుసూదన్‌రావు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి**

కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశ్రమశాఖ అధికారులతో కలిసి చౌటుప్పల్ మండలంలోని ఏడు పరిశ్రమలను తనిఖీలు చేశాం. నాలుగింట్లో అగ్నిమాపక నివారణ చర్యలున్నాయి. మూడింటిలో పూర్తి స్థాయిలో లేకపోవటంతో నోటీసులు అందజేశాం. ప్రతి పరిశ్రమ తప్పకుండా నిబంధనలను, భద్రతా చర్యలను పాటించాలి.

# రూ.15కోట్లు వెచ్చించినా నిరుపయోగమే!



సిరిసిల్ల : జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం రూ. 15 కోట్ల వ్యయంతో సుందరీకరణ పనులు చేపట్టిన కొత్త చెరువు కట్ట (మినీ ట్యాంక్‌బండ్) ప్రస్తుతం సమస్యలకు నిలయంగా మారింది. నిర్వహణ కొరవడి క్షేత్ర స్థాయి పరిస్థితి అధ్వానంగా మారడంతో సందర్శకులు అటువైపు వెళ్లాంటేనే భయపడుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

గతంలో ఈ ప్రాంతం విద్యుత్తు దీపాల వెలుగుల్లో జిగేల్‌మనగా.. పట్టణ ప్రజలు పిల్లాపాపలతో సేదతీరేందుకు వచ్చేవారు. వేసవికాలంలో చెరువు కట్టపై ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని విద్యుత్తు తీగలు కాలిపోయాయి. కొంతవరకు మరమ్మతులు చేసినా రాత్రి సమయాల్లో పలుచోట్ల అంధకారం నెలకొంటోంది. కట్టపై చూపరులను ఆకట్టుకునేలా సిరిసిల్ల – కరీంనగర్ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న కట్టపై వివిధ ఆకృతులను ఏర్పాటు చేశారు. నిర్వహణ లేక పిచ్చిమొక్కల మధ్య అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పాదచారులు వెళ్లేవైపు పాముల పుట్టలు ఏర్పడ్డాయని సందర్శకులు చెబుతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన కొత్త చెరువు ట్యాంక్‌బండ్ ముఖద్వారం ఈదురుగాలులకు కిందపడిపోయింది. రెండో గేటు ఇటీవల ఊడి కిందపడినా సరి చేయలేదు. గతంలో చెరువులో గుర్రపుడెక్క పెరిగితే నెలపాటు కృషి చేసి యంత్రం సాయంతో తొలగించారు. మళ్లీ ఇప్పుడు గుర్రపుడెక్క పెరగడంతో నీటి శాతం తగ్గుతుందని స్థానికులు చెబుతున్నారు.

చెరువులో సందర్శకుల షికారు కోసం రెండు పడవలు ఏర్పాటు చేశారు. పడవలను నడిపించేందుకు ఇద్దరు పురపాలిక సిబ్బందిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శిక్షణ నిమిత్తం పంపించారు. వారు శిక్షణ పూర్తి చేసుకొని వచ్చినా పడవలను చెరువులోనే వదిలేయడంతో మరమ్మతులకు గురయ్యాయి. చెరువు కట్టపై పచ్చదనం చూపించేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ రైలు ఏర్పాటు చేసి కొంతకాలం నడిపించారు. పిల్లలకు రూ. 10, పెద్దలకు రూ. 20 చొప్పున టికెట్ ధర నిర్ణయించి వారానికి మూడు రోజులు నడిపించారు. నిర్వహణ కొరవడటంతో ఆ రైలు ప్రస్తుతం మూలకు చేరింది. మరమ్మతుకు రూ. 1.50 లక్షలు అవుతుందని చెబుతున్నారు. మినీ ట్యాంక్‌బండ్‌పై నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకొని అందుబాటులోకి తేవాలని సందర్శకులు కోరుతున్నారు.

# ఎన్నాళ్లకెన్నేళ్లకు..!



వేములవాడ: వేములవాడ పట్టణ శివారులో మల్లారం రోడ్డులోని లోలెవల్ వంతెనతో అష్టకష్టాలు పడిన ప్రజలకు హైలెవల్ వంతెన నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. ఈ వంతెన స్థానికుల ఏళ్లనాటి కల కావడంతో మూడేళ్ల క్రితం ప్రభుత్వం రూ. 2.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులకు భూమి పూజ చేసినప్పటికీ గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పనులు భూమిపూజకే పరిమితమయ్యాయి. సమస్యపై వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. సమస్యను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి పనులు మొదలు కావడానికి చొరవ చూపారు. దీంతో అయిదు నెలల క్రితం వంతెన నిర్మాణ పనులను అర్‌అండ్అబీ అధికారులు చేపట్టగా నిర్మాణం పూర్తయింది. వంతెనకు ఇరువైపులా మట్టితో అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేసి వాహనాల రాకపోకలకు అనుమతించారు.

**ఈ వానాకాలం సజావుగా రాకపోకలు**

పట్టణ శివారులోని మల్లారం రోడ్డులోని కట్టుకాలువ చూడటానికి చిన్నదిగానే ఉన్నప్పటికి వర్షాకాలంలో భారీ ఎత్తున వరద పారుతుంది. ఇలాంటి సందర్భంలో వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి. కల్వర్టు అవతలి వైపు ఉన్న జయవరం, రాజ్‌నగర్, మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి, గ్రామాలతోపాటు కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి, నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు వెళ్లే గ్రామాల ప్రజలతోపాటు చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి వైపు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల మీదుగా వేములవాడ, సిరిసిల్ల పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఎట్టకేలకు వంతెన పూర్తవడం, ఈ వర్షాకాలంలో వాగు పారినప్పటికీ రాకపోకలు సజావుగా సాగడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

**చివరి దశలో సైడ్‌వాల్ పనులు..**

వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ ఇంకా వంతెన సైడ్‌వాల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో వాహనాల రాకపోకలకు అనుమతించారు. వంతెనకు సైడ్ వాల్ నిర్మాణం పూర్తయితే అప్రోచ్ రోడ్డుపై తారు పనులు చేపట్టనున్నారు. దీంతో ప్రజల రాకపోకల కష్టాలు పూర్తిగా తొలిగిపోనున్నాయి.

# ఉన్నత విద్యపై నిశిత దృష్టి

మెట్‌పల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారుగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3 వేలమంది, రెండో సంవత్సరం 2500 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఉత్తమ విద్యనందించేందుకు ప్రతి కళాశాలకు 13 సీసీ కెమెరాలతోపాటు ఒక కంప్యూటర్‌ను ఏర్పాటు చేశారు. తరగతి గదులతోపాటు ప్రిన్సిపల్ కార్యాలయంలో, కళాశాల ఆవరణలో తదితర చోట్ల వాటిని బిగించారు. ప్రిన్సిపల్ గదిలో ఏర్పాటుచేసిన కంప్యూటర్‌కు సీసీ కెమెరాలను అనుసంధానం చేశారు. ఎప్పటికప్పుడు వీటి పర్యవేక్షణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించారు.

**మెట్‌పల్లిలో 16 కెమెరాల పర్యవేక్షణలో**

మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి సుమారు 563 మంది విద్యార్థులున్నారు. వీరికి సీసీ కెమెరాల నడుమ ఉత్తమ బోధన అందిస్తున్నారు. 13



కొత్తవి కాగా పాతవి మూడింటితో మొత్తం 16 కెమెరాలను బిగించారు.

**ప్రతి కళాశాలపై ప్రత్యేక దృష్టి**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధనపై ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు సీసీ కెమెరాలను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చూసేలా ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గదిలో విద్యార్థుల సంఖ్య తక్కువ లేకుండా చూడటం.. బోధన, అధ్యాపకుల పనితీరు తదితర అంశాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉండనుంది. ఏడాదిపాటు ఓ సంస్థకు సీసీ కెమెరాల బాధ్యతలను అప్పగించారు.

**ఉత్తమ ఫలితాల కోసమే..**విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసింది. గత 20 రోజుల క్రితం జిల్లాలోని 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమెరాలను బిగించి ప్రస్తుతం వాటి పర్యవేక్షణలోనే కళాశాలలు కొనసాగుతున్నాయి. విద్యార్థులతోపాటు అధ్యాపకులపై హైదరాబాద్‌లోని ఉన్నతాధికారుల ప్రత్యేక పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉంటుంది. – నారాయణ, ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి

# ఆకట్టుకునే రంగు.. శుభ్రత కరవు

వేములవాడ: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి కాలంలో హోటళ్లు, రెస్టారెంట్లు, తినుబండారాల తయారీలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి వాటిని ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందేలా చూడాల్సిన అధికార యంత్రాంగం నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేములవాడ పట్టణంలో మున్సిపల్ రికార్డుల ప్రకారం 4 బార్ అండ్ రెస్టారెంట్లు, 7 హోటళ్లు, 31 టిఫిన్ సెంటర్లున్నట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ అనధికారికంగా అనేకం కొనసాగుతున్నాయి. తినుబండారాల దుకాణాలూ ఎక్కువగానే ఉన్నాయి. వీటిలో ఆహార భద్రత నియమ, నిబంధనలు గాలికొదిలేసి పదార్థాలను తయారు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పట్టణంలోని ఓ హోటల్‌లో ఇటీవల ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలో పెద్దఎత్తున కుళ్లిన మాంసం, ఆహార పదార్థాలు, బిర్యానీ వంటి వెలుగు చూడటం కలకలం రేపింది. ఈ సంఘటన పట్టణంలోని హోటళ్లలోని పరిస్థితికి అద్దం పట్టింది.

**అపరిశుభ్ర వాతావరణంలో..**

వేములవాడ ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో ఇక్కడికి రాష్ట్రంలోని భక్తులు, ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు



వస్తుంటారు. ఇలాంటి వారు భోజనాలను, టిఫిన్స్‌ను పట్టణంలోని వివిధ రెస్టారెంట్లు, హోటళ్లలో, టిఫిన్ సెంటర్లలో ఆహార పదార్థాలను వినియోగిస్తుంటారు. ఇలాంటి పట్టణంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను ప్రజలకు, భక్తులకు అందించే విధంగా చర్యలు చేపట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఆకర్షణీయ రంగులతో, శుచి శుభ్రత లేని ఆహార పదార్థాలను ప్రజలకు అంటగట్టి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలున్నాయి.

రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో వంటకాలు అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్నారు. వంట గదులు దుర్వాసన, కుళ్లిన వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉన్నప్పటికీ అందులోనే ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. శుభ్రమైన నీటితో, ఏ రోజుకు సరిపడా ఆరోజు మాంసం వండాల్సి ఉండగా చాలా హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో వాటిని రిఫ్రిజిరేటర్లలో నిల్వ చేస్తూ చాలా రోజుల తరబడి వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడో ఓసారి తనిఖీలు చేసి నామమాత్రం జరిమానాలు వేసి వదిలేయడంతో తిరిగి యథావిధిగా కొనసాగుతున్నాయి.

‘వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించని హోటళ్లను తనిఖీ చేసి దాదాపు పది కేసుల వరకు నమోదు చేశామ’ని ఆహార భద్రత తనిఖీ జిల్లా అధికారిణి అనూష పేర్కొన్నారు.

## మిల్లర్ల మాయ.. అక్రమాల తోవ

సుల్తానాబాద్ : సుల్తానాబాద్‌లోని ఓ బాయిల్డ్ మిల్లు రెండు సీజన్‌లకు సంబంధించి రూ.11 కోట్ల ధాన్యం బకాయి పడింది. కానీ గత యాసంగిలో రాజకీయ ఒత్తిళ్లతో సదరు మిల్లులకు వంద లారీల ధాన్యం ఇచ్చారనే ఆరోపణలున్నాయి. మంథనిలో ఒక మిల్లులో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు జరిగి రూ.5 కోట్ల విలువైన ధాన్యం లేదని గుర్తించారు. అయినా గత యాసంగిలో ధాన్యం కేటాయింపులు జరిగాయి. సకాలంలో లెవీ బియ్యం ఇవ్వడానికి తంటాలు పడే మిల్లర్లు పౌరసరఫరాలశాఖ ఇచ్చిన ధాన్యం నిల్వలను మాత్రం పక్కదారి పట్టిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లాలో పాత బకాయిలు పూర్తి చేయకుండానే ప్రతి సీజన్‌లో ధాన్యం కోటా దక్కించుకోవడంలో మిల్లర్లు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

**చర్యలు లేకపోవడంతో..**

ప్రతి సీజన్‌లో మిల్లులకు కేటాయించే ధాన్యం నిల్వలపై పౌరసరఫరాల అధికారుల నిఘా లేకపోవడం, లెవీ సేకరణలో తరచూ కాలయాపన జరుగుతుండటం, మిల్లులకే కేటాయించే ధాన్యం నిల్వ సామర్థ్యానికి మించిపోవడం వెరసి మిల్లర్లు ధాన్యం నిల్వలను బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవడం కొన్నేళ్లుగా సాగుతోంది.

**లోపభూయిష్టమైన విధానాలు**



జిల్లాలో ధాన్యం దిగుబడి, ఇతర జిల్లాల నుంచి ఏ మేరకు వచ్చే అవకాశం ఉంటుందనే అంశాలపై అవగాహన ఉన్నప్పటికీ వివిధ మిల్లుకు జరిగే ధాన్యం కేటాయింపులకు ఉద్దేశించిన ఆర్వో(రిలీజింగ్ ఆర్డర్) లోపభూయిష్టంగా తయారు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గడిచిన యాసంగిలో జిల్లాలో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనాలు వేయగా పౌరసరఫరాల అధికారులు మాత్రం 6.08 లక్షల మెట్రిక్ టన్నులకు ఆర్వో తయారు చేశారు. అధికారులు తయారు చేసిన ఆర్వోకి వాస్తవ ఉత్పత్తికి దాదాపు రెట్టింపు వ్యత్యాసం ఉంది. ఎవరికీ నూరు శాతం కోటా ఇవ్వలేదని చెప్పేందుకు ఈ ఆర్వో చక్కగా ఉపయోగపడుతుంది. నచ్చినవారికి 60 శాతం, నచ్చని వారికి 20 శాతం వరకు ఇచ్చినా ఇబ్బంది ఉండదనే భరోసాతో ఈ విధంగా ఆర్వోల తయారీ జరుగుతుందనే ప్రచారం ఉంది.

**నిరంతర తనిఖీలు** మిల్లులో జరుగుతున్న అక్రమాల నియంత్రణకు నిరంతరం తనిఖీలు చేసేందుకు ప్రయత్నిస్తాం. తేడాలున్న మిల్లర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.శ్రీనాథ్, డీఎస్‌వో

## పేరులో ప్రగతి.. అభివృద్ధి అధోగతి

గోదావరిఖని : నగరపాలిక 23వ డివిజన్‌లో ఆరు కాలనీలు ఉండగా ఒకటి రెండు మినహా మిగతా కాలనీల్లో రహదారులు, భూగర్భ, ఉపరితల మురుగు కాలువల సమస్య తీవ్రంగా ఉంది. 24వ డివిజన్‌లో రామగుండం ఎన్టీపీసీకి చెందిన పర్మినెంట్, టెంపరరీ టౌన్‌షిప్‌లు ఉన్నాయి. నిర్వహణ బాధ్యతలను ఎన్టీపీసీ యాజమాన్యం చేపట్టడంతో డివిజన్‌లో అంతగా సమస్యలు ఉండకపోగా 23వ డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి నగరపాలక అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. డివిజన్‌లో అత్యంత పేదలు నివసించే ప్రగతినగర్ కాలనీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులతో సుమారు 8 సంవత్సరాల కిందట దాదాపు రూ.కోటి వ్యయంతో వార్డుల్లో సీసీరహదారులు నిర్మించారు. భూగర్భ, ఉపరితల మురుగు కాలువలు నిర్మించకపోవడంతో స్థానికులు దుర్గంధంతో సహవాసం చేయాల్సి వస్తోంది.

డివిజన్ల పునర్విభజన అనంతరం ఏర్పడ్డ రామగుండం నగరపాలిక 23వ డివిజన్‌లో గౌతమినగర్, ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ, ప్రగతినగర్, మాతంగి కాలనీ, శాంతినగర్, కాజీపల్లి ఉండగా 24వ డివిజన్‌లో కేవలం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లు మాత్రమే ఉన్నాయి. ఎఫ్.సి.ఐ. ఉద్యోగుల గృహనిర్మాణ సహకార సంస్థ ఆధ్వర్యంలో గౌతమినగర్ కాలనీ, మాజీ సైనికుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ ఏర్పడ్డాయి. నగరపాలక ప్రాంతంలో గౌతమినగర్ లేఔట్ అనుమతి పొందిన మొట్టమొదటి కాలనీ.

ప్రగతినగర్ కాలనీ దుర్గంధమయంగా ఉంది. కాలనీలో అంతర్గత రహదారుల నిర్మాణం చేసినప్పటికీ ఉపరితల, భూగర్భ మురుగు కాలువలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. వ్యర్థజలాలు రోడ్డుపైనుంచే ప్రవహించాల్సి రావడంతో కాలనీలో గొడవలు జరుగుతున్నాయి. కాలనీలోని వ్యర్థజలాలన్నీ ఓ కూడలిలో నిలుస్తుండడంతో జలాశయంగా మారింది. తాగునీరు సన్నగా, కొద్దిసేపు మాత్రమే



వస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు.

శాంతినగర్‌లో రహదారులు, భూగర్భ, అంతర్గత మురుగు కాలువల సమస్య ఉంది. కాలనీ శివారు అత్యంత వేగవంతంగా విస్తరిస్తుండగా ఆయా ప్రాంతాల్లోకి వెళ్లేందుకు బురద రోడ్లతో ఇబ్బంది పడుతున్నారు. మూడేళ్ల కిందట వర్షాకాలంలో సమీపంలోని రామగుండం ఎరువుల కర్మాగారం బూడిద చెరువు కట్టతెగిపోవడంతో కాలనీ జలమయమైంది. తాగునీటి సదుపాయాన్ని మెరుగు పరచాల్సి ఉంది. హనుమాన్‌నగర్‌లోని ప్రధాన రహదారిలో భూగర్భ మురుగు కాలువ నిర్మించినా దానిపైన రోడ్డు వేయాల్సి ఉంది.ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో ఆక్రమణలు పెరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్రమవుతున్నాయి. గతంలో వేసిన రోడ్లు చెడిపోవడంతో కొత్తగా రహదారుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కాలనీలో పట్టణ క్రీడా మైదానా న్ని వినియోగంలోకి తెచ్చేలా నగరపాలిక చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## చేయి తడ‘పని’దే కాదు



హైదరాబాద్ : రెండు రోజుల కింద వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్ రూ.70 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. తాజాగా కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ అశోక్ నిషేధిత జాబితాలోని భూమిని రిజిస్ట్రేషన్ చేసినందుకు సస్పెండ్ అయ్యారు.అంతకుముందు దూద్‌బౌలి ఇన్‌ఛార్జి సబ్‌రిజిస్ట్రార్ రూ.2 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారుగతంలో రాజేంద్రనగర్ సబ్‌రిజిస్ట్రార్ రూ.5 లక్షలు డిమాండ్ చేసి చిక్కారు.. ఇదే సబ్‌రిజిస్ట్రార్ అంతకుముందు అటవీ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసి సస్పెండ్ అయ్యారు స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతికి ఇవి మచ్చు తునకలు. చాలామంది డాక్యుమెంట్ రైటర్లే ఏజెంట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం. రూ.కోట్ల ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు రూ.లక్షల్లో.. రూ.లక్షల ఆస్తులకు రూ.వేలల్లో లంచాలు సాధారణంగా మారింది. గ్రేటర్ చుట్టుపక్కల అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు 39 ఉండగా.. నిత్యం కోట్లాది రూపాయల విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా మాముళ్ల మొత్తం నిర్ణయమవుతోంది.

**వివాదాస్పద ఆస్తులైతే పంట పండినట్లే**

రిజిస్ట్రేషన్ చేయాల్సిన ఆస్తుల్లో చిన్నచిన్న సమస్యలు.. వివాదాస్పదం.. విక్రయదారుల మధ్య గొడవలు ఉంటే సబ్‌రిజిస్ట్రార్ల పంట పండినట్లే. కొందరు సమస్య తీవ్రతను బట్టి రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నారు. కొందరు ఎలాంటి రిజిస్ట్రేషన్లనైనా చేయడంలో వారు దిట్టలు. గుర్తిస్తే తర్వాత చూసుకుందాములే అనే ధీమాతో తమకున్న విచక్షణాధికారాలతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ అయితే తర్వాత న్యాయ పోరాటం చేయడానికి మార్గం సుగమం అవుతుందని భావిస్తుండటంతో భారీ మొత్తాలు ముట్టజెప్పి పని చేయించుకుంటున్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల పలు భూములు వివాదాస్పదంగా మారాయి. పలు ప్రభుత్వ భూములను నిషేధిత జాబితాలో చేర్చారు. కొందరు సబ్‌రిజిస్ట్రార్లు నిషేధిత జాబితాలోని భూములను యథేచ్ఛగా రిజిస్ట్రేషన్ చేస్తుండటం గమనార్హం. రెండు రోజులు క్రితం సర్వే నంబర్ 83లో 2.39 ఎకరాల నిషేధిత భూమిని కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. సుమారు రూ.15 కోట్ల విలువైన నిషేధిత జాబితాలోని భూమిని రిజిస్ట్రేషన్ చేయడం చర్చనీయాంశంగా మారింది. సబ్‌రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు ఆ శాఖ చర్యలు తీసుకుంటున్నా దందా కొనసాగుతూనే ఉంది.

## దొడ్డుబియ్యం పురుగులపాలు!



సూర్యాపేట : తుట్టెలు కట్టి పురుగుపట్టిన ఈ బియ్యం బస్తాలు గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామపంచాయతీలోని ఓ రేషన్‌షాపులోనివి. ఇక్కడ 913 కార్డుల్లోని లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి మార్చి నెల కోటాగా వచ్చిన 150 క్వింటాళ్ల దొడ్డురకం బియ్యంలో సరఫరా చేయగా 33 క్వింటాళ్లు మిగిలాయి. అధికారులు వెనక్కి తీసుకెళ్లకపోవడంతో ఇలా జరిగింది. వాటిని కాపాడటం ఇబ్బందిగా మారిందని సదరు డీలరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనకల్ మండల కేంద్రంలోని రేషన్ దుకాణంలో మార్చి నెల కోటా 140 క్వింటాళ్లలో కార్డుదారులకు సరఫరా చేయగా ఏడు క్వింటాళ్లు మిగిలాయి. ఇక్కడా అదే పరిస్థితి.రేషన్‌దుకాణాల్లో మిగిలిపోయిన దొడ్డు బియ్యం భద్రపరచడం డీలర్లకు తలకుమించిన భారంగా మారింది. ఆ విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాల్సిన పౌరసరఫరాలశాఖ అలసత్వంతో సర్కారుకు నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించటంతో అంతకు ముందు సరఫరా చేసిన దొడ్డు బియ్యం చాలా దుకాణాల్లో మిగిలిపోయాయి. ఆరు నెలల నుంచి వాటిని భద్రపర్చడం డీలర్లకు సమస్యగా మారింది. వాటిలో పోర్టుఫైడ్ రైస్ కలిపిన కారణంగా పురుగులు పట్టి తుట్టెలు కడుతున్నాయి. కొన్నిషాపుల్లోనివి ఎలుకలు బుక్కేస్తున్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్లల్లో నిల్వ ఉన్న వాటి పరిస్థితి దాదాపు అలాగే ఉంది.

**రూ.13.51 కోట్ల విలువైన నిల్వలు:**

ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 2,116 రేషన్ దుకాణాలున్నాయి. అంతకుముందు సరఫరా చేసిన దొడ్డు బియ్యం కోటాలో రూ.13.54 కోట్లు విలువ చేసే 37,624.63 క్వింటాళ్ల బియ్యం నిల్వలు మిగిలిపోయాయి. వాటి తరలింపులో సంబంధితశాఖ నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. దాంతో పురుగులు పట్టే పరిస్థితికి చేరాయి. కొన్నిచోట్ల సన్నబియ్యానికి పురుగులు వ్యాపించాయి. అధికారులు తగిన నిర్ణయం తీసుకుని త్వరగా తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. **ఆదేశాలు రావాల్సి ఉంది..: ప్రసాద్, సివిల్ సప్లై డీఎం, సూర్యాపేట** డీలర్ల వద్ద దొడ్డు బియ్యం తరలింపుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. రేషన్ దుకాణాల్లో, గోడౌన్లలో నిల్వ ఉన్న బియ్యానికి పురుగులు పడుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే తరలిస్తాం. అప్పటి వరకు డీలర్లు జాగ్రత్తగా చూసుకోవాలి.

## ఇదీ నా స్టేటస్..!




నాంపల్లి : స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ వాట్సాప్ ఉపయోగిస్తున్నారు. యాప్‌లోని ‘స్టేటస్’ ఫీచర్‌ను వినియోగిస్తున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఆధునిక టెక్నాలజీకి అలవాటు పడ్డ చాలామంది ఆ ఫీచర్‌లో పోస్ట్ పెట్టడం ఒక ‘స్టేటస్’గా భావిస్తున్నారు. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ తదితర మాధ్యమాలు ఉన్నప్పటికీ ఎక్కువగా ఈ మాధ్యమాన్నే వాడుకుంటున్నారు. తామేంటో తెలిపేందుకు.. ఇతరుల విషయాలు తెలుసుకునేందుకు.. రోజువారీ జీవితంలో చేసే పనులను, వెళ్లిన ప్రదేశాలను, అభిరుచులను పోస్టు చేస్తూ ఎప్పటికప్పుడు తాము ఉన్న స్థితిని తెలియపరుస్తున్నారు. దాన్ని ఎందరు వీక్షించారో తెలుసుకునేందుకూ ఆరాట పడుతున్నారు.

**ప్రతి క్షణం.. ఎడతెగని ఆరాటం..**

స్టేటస్‌లో పెట్టిన ప్రతిఒక్కరూ ఎంత మంది చూశారు? ఎవరైనా స్పందించారా.. అనే ఆతృతతో క్షణక్షణం ఫోన్ తెర వీక్షిస్తూ అర్ధరాత్రి వరకు నిద్రపోవడం లేదని నివేదికలు చెబుతున్నాయి. పెట్టిన పోస్టుకు ఎవరూ స్పందించకపోతే అసంతృప్తికి గురయ్యే వారూ ఉన్నారు. అందులో వ్యక్తిగత విషయాలను పంచుకోవడంతో తమ భద్రతతోపాటు గోప్యతకు భంగం కలుగుతుందన్న విషయాన్ని కూడా గుర్తించాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ప్రతిభ కనబర్చినా.. ప్రచారానికైనా..**

ఎక్కువగా తమ వ్యక్తిగత ప్రతిభ చాటడానికి వినియోగిస్తున్నారు. కొందరు మనోభావాలను తెలియజేసే విషయాలను, మరికొందరు విద్య, ఉద్యోగం, క్రీడలు ఇలా ఎందులోనైనా ప్రతిభ సాధిస్తే అప్పటికప్పుడు పోస్ట్ చేస్తున్నారు. వ్యాపార అభివృద్ధికి స్టేటస్‌ను చాలామంది వ్యాపారులు ప్రచారాస్త్రంగానూ ఉపయోగిస్తున్నారు. విద్యా, వ్యాపార సంస్థల బ్రోచర్లు, ప్రైవేటు ఆసుపత్రులు, హోటళ్లు, దుకాణాలు, మాల్స్, ఇలా తమ ఆఫర్లు, సేవలను పెడుతూ వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకొందరైతే రోజూ ఉదయమే వారానికి తగ్గట్టు దేవుళ్ల ఫొటోలు, పాటలతో పెడుతుంటారు. ప్రత్యేక రోజులు, పండుగల్లోనూ శుభాకాంక్షలు తెలిపేవారు ఒక ఎత్తైతే.. రోజూ 10–20 ఫొటోలు పోస్టు చేసేవారూ ఉన్నారు. **అతిగా వాడటం అనర్థమే: డా.ఉస్మాన్, మానసిక వైద్యనిపుణులు, సిటీ నర్సింగ్ హోం, హైదరాబాద్**

సామాజిక మాధ్యమం ఏదైనా అతిగా వినియోగించడం మంచిది కాదు. వ్యసనంగా మారితే మానసిక సమస్యలు వచ్చే అవకాశముంది. కొందరు ఫోన్ లేనిదే ఉండటం లేదు. ఫోన్ తెరకు అంకితం కావడంతో కంటిచూపు దెబ్బతిని, అనారోగ్య సమస్యలొచ్చే అవకాశాలు ఎక్కువ.

## నెరవేరిన ఎస్జీటీల కల

కరీంనగర్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ) కల నెరవేరింది. కొంత కాలంగా స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న వారు శుభవార్త విన్నారు. జిల్లాలోని వంద మంది ఎస్జీటీలు విద్యాశాఖ నుంచి పదోన్నతులు పొందారు. మంగళవారం సంబంధిత ఉత్తర్వులు అందడంతో వారికి కేటాయించిన పాఠశాలల్లో వెంటనే విధుల్లో చేరారు. వాస్తవానికి ఈనెల మొదటి వారంలోనే ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా, స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు కల్పించే విషయంలో నెలకొన్న సమస్యలతో తాత్కాలికంగా ఆలస్యమైంది. ఆటంకాలను తొలగింపుతో విద్యాశాఖ ముందుకు వచ్చింది. సోమవారం సీనియారిటీ జాబితా ప్రకారం అర్హులైన ఎస్జీటీలు పదోన్నతులు, పోస్టింగ్‌ల కోసం వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. 57 పోస్టులు బ్యాక్‌లాగ్‌జిల్లాలో ఎస్జీటీలకు పదోన్నతుల కల్పించే విషయంలో 57 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రోస్టర్ పాయింట్ ప్రకారం అర్హులు లేకపోవడంతో బ్యాక్‌లాగ్‌గా నిలిచాయి. 157 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించాల్సి ఉంది. ప్రభుత్వ యాజమాన్యంలో 41 పోస్టులకు 13 మందికి, స్థానిక సంస్థల యాజమాన్యం బడుల్లో 116 పోస్టులకు 87 మందికి పదోన్నతులు కల్పించారు. మిగిలిన వాటిని వచ్చే పదోన్నతుల ప్రక్రియలో ఖాళీలుగా చూపించి భర్తీ చేయనున్నారు. తమ వంతు ఎప్పుడు వస్తుందా? అని మిగిలిన వారు ఎదురుచూస్తున్నారు.

## ఉపాధి తోడుగా.. కష్టాలు తీరగా

సారంగాపూర్: జిల్లాలో ఉపాధిహామీ ద్వారా పశువుల పాక, కోళ్ల షెడ్లు, గొర్రెలపాకలు, వర్మీ కంపోస్టు, నీటి నిల్వ గుంతలు, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు, పొలం బాటలు తదితర అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. జిల్లాలో పశువుల పాకలు 769, కోళ్ల షెడ్లు 386 ఏర్పాటుకు లక్ష్యం నిర్దేశించారు. వర్మీ కంపోస్టు నిర్మాణాలు 193, అజోలా ఎరువు తయారీ గుంతలు 193, ఫారంపాండ్‌లు 386 లక్ష్యాన్ని నిర్దేశించగా పనులు కొనసాగుతున్నాయి.పాకల నిర్మాణాలపై అవగాహన

జిల్లాలో వివిధ రకాల పశువులు, గొర్రెలు, కోళ్ల పాకల నిర్మాణాలపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పశువుల పాకకు రూ.85,000 చెల్లిస్తుండగా 18ఐ16 ఫీట్ల పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. గొర్రెల పాకకు రూ.లక్ష చెల్లిస్తుండగా 21ఐ16తో, కోళ్ల షెడ్డుకు రూ.3 లక్షలుకాగా 50ఐ16 పొడవు, వెడల్పుతో నిర్మించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పశువుల పాకలు 769 లక్ష్యంకాగా 726 మంజూరు చేయగా 43 నిర్మాణాలు సాగుతున్నాయి. కోళ్ల షెడ్ల నిర్మాణాల కోసం 386 లక్ష్యాన్ని నిర్దేశించగా 363 మంజూరు చేయగా 19 నిర్మాణాలు, గొర్రెల షెడ్లు 91 మంజూరుకాగా 68 నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 193 మంది రైతులకు వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ గుంతలు నిర్మించాలని భావించగా 167 నిర్మాణాలు మంజూరు చేశారు. ఒక్కో నిర్మాణానికి రూ.12,500, అజోలా తయారు చేసే గుంత నిర్మాణానికి రూ.6 వేలు చెల్లించనున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆయా నిర్మాణాలు చేపట్టేలా ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

**భూగర్భ జలాల పెంపుపై దృష్టి**

భూగర్భ జలాల పెంపునకు ఉపాధిహామీ పనుల ద్వారా పలు



నిర్మాణాలు చేపడుతున్నారు. రూ.4.50 లక్షలతో పర్క్‌లేషన్ ట్యాంకు నిర్మాణాలను పూర్తిగా కూలీల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో 96 నిర్మాణాలు లక్ష్యంకాగా 88 నిర్మాణాలు మంజూరు చేయగా పనులు కొనసాగిస్తున్నారు. 1,922 ఇంకుడు గుంతల నిర్మాణాలు లక్ష్యంకాగా 410 ప్రగతిలో ఉన్నాయి. రైతుల పంట పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణాలు చేపడుతుండగా ప్రతీ మండలానికి 10 కిలోమీటర్ల చొప్పున నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించగా ప్రస్తుతం 764 కి.మీ. మేర రహదారులు పూర్తి చేశారు.

**కూలీలకు ఉపాధి..**

ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు అవసరమైన కోళ్లు, పశువులు, గొర్రెల షెడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. భూగర్భ జలాల పెంపునకు చేపట్టిన పనులు కొనసాగిస్తుండగా దీని ద్వారా కూలీలకు ఉపాధి లభిస్తుంది. రైతుల పంట పొలాలకు రహదారుల నిర్మాణాలు చేపడుతున్నారు.శివప్రసాద్, సాంకేతిక సహాయకుడు

## ఆహారశుద్ధి.. అతివల ఆర్థిక వృద్ధి

సంగారెడ్డి టౌన్: పొదుపులు.. బ్యాంకు రుణాలు.. వాయిదాల చెల్లింపులు.. మహిళా సంఘాలు అంటే గుర్తుకు వచ్చేవి ఇవే. ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కాలన్న లక్ష్యంతో మహిళలు పొదుపు సంఘాల్లో చేరుతున్నా ఆశించిన స్థాయిలో స్థితిగతుల మారడం లేదు. బ్యాంకు రుణాలు అంతంతమాత్రంగా ఉండటంతో స్వయం ఉపాధికి బాటలు వేసుకోలేకపోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు దిశగా వారిని అడుగులు వేయించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) నిర్ణయించింది. ఇందుకోసం రాయితీ రుణాలు మంజూరు చేస్తున్నారు.

**లక్ష్యం 100 యూనిట్లు**

జిల్లాలో మిరప, పసుపు, పప్పు మిల్లులు, పాలపదార్థాల ఉత్పత్తి, చిరుధాన్యాలు, నూనె, చిన్న రైస్‌మిల్లులు, పాపడాలు, పచ్చళ్లు తదితర యూనిట్లతో మహిళలు ఇప్పటికే ఉపాధి పొందుతున్నారు. పీఎం ఫార్మలేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రెన్యూర్ స్కీమ్(పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నారు. దీనివల్ల యూనిట్ల విస్తరణకు మార్గం సుగమం అవుతోంది. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 100 యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. ఎంపికైన యూనిట్లకు 35 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయనున్నారు.

**నాణ్యమైన ఉత్పత్తుల కోసం..**

మహిళా సంఘాలకు చెందిన సభ్యుల్లో కొందరు ఇప్పటికే ఆహార సంబంధిత రంగంలో ఉపాధి పొందుతుండగా ఆహారశుద్ధి యూనిట్ల విస్తరణకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది. తద్వారా మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించనున్నారు. నాణ్యతకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. యూనిట్ల విస్తరణకు అవసరమైన సాంకేతిక, ఆర్థికపరంగా సాయం అందించనున్నారు. శిక్షణ ఇవ్వడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు మహిళా సంఘాల ద్వారా వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి.

**సద్వినియోగంతో సత్ఫలితాలు**

జంగారెడ్డి, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి

ఆహారశుద్ధి యూనిట్లతో మహిళా సంఘాల సభ్యులకు ప్రయోజనం ఉంటుంది. యూనిట్ల విస్తరణతో మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుంటుంది. వినియోగదారులకు కల్తీలేని ఆహార ఉత్పత్తులు అందించినట్లు అవుతుంది. మహిళా సంఘాల సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎంపిక చేసిన మహిళా సంఘాల సభ్యులకు రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేయించడం తోపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695

మహిళా సంఘాలు: 18,213

ఆయా సంఘాల్లో సభ్యులు: 1.90లక్షల మంది

## వ్యవసాయ యాంత్రీకరణ.. అమలుకు ప్రణాళిక

ఆలేరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలులో ఉన్న వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు రూపొందించింది. ఇందుకు సంబంధించి ఇటీవలే జీవో నెం.234 విడుదల చేసింది. దీనికి అనుగుణంగా ఉమ్మడి జిల్లాలో వ్యవసాయాధికారులు వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు సన్నాహాలు మొదలుపెట్టారు.

**ఉమ్మడి జిల్లాకు రూ.6.22 కోట్లు**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2025–26 సంవత్సరానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు రూ.6.22 కోట్ల నిధులను కేటాయించారు. నల్లగొండ జిల్లాకు రూ.3.14 కోట్లు, సూర్యాపేటకు రూ.1.84 కోట్లు, యాదాద్రి జిల్లాకు రూ.1.24 కోట్లు కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50 శాతం రాయితీ, జనరల్ కేటగిరీ రైతులకు 40 శాతం రాయితీ వర్తిస్తుంది. ప్రస్తుత



వానాకాలం సీజన్ నుంచి యాసంగి సీజన్ వరకు పూర్తి స్థాయిలో అమలు చేస్తారు. ఈసారి 15 రకాల యంత్ర పరికరాలతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు చేస్తున్నారు.

**మరోదఫా దరఖాస్తుల స్వీకరణ...**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకు సంబంధించి ఆగస్టు 5 నుంచి 15వ తేదీవరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. గతంలో చేసిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటారు. అందిన దరఖాస్తులను వ్యవసాయాధికారులు 16వ తేదీన జిల్లా కలెక్టర్లకు అందజేస్తారు. 20వ తేదీ వరకు వాటిని పరిశీలిస్తారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే అందుకు కారణాలను తెలియజేస్తారు. ఎంపికైన రైతులకు ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 5 వరకు మంజూరు పత్రాలు, సెప్టెంబరు 7 నుంచి 17 వరకు పరికరాలు పంపిణీ చేస్తారు.

## అక్షరాలు కదిలించాయి.. యంత్రాలు తెప్పించాయి..!

నల్గొండ : మూత్రపిండాల బాధితులకు ఎదురుచూపులేనా.. అంటూ ఇటీవల వచ్చిన వరుస కథనాలకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. కథనాలను జత చేస్తూ రాష్ట్ర స్థాయి అధికారులకు లేఖలు రాశారు. దీంతో ఆరోగ్యశ్రీ ట్రస్టు అధికారులతో పాటు సాప్ సంస్థ (పీపీపీ) ఒప్పందంతో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ వార్డులో నూతనంగా ఐదు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం ఉదయం 11:30 గంటలకు యంత్రాలను ప్రారంభించనున్నారు. జిల్లాలోనే అత్యధికంగా మూత్ర పిండాల వ్యాధిగ్రస్తులు నల్గొండ డివిజన్ పరిధిలో ఉన్నట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన బాధితులు సైతం జిల్లా కేంద్రంలో గదులు అద్దెకు తీసుకొని ఉంటూ చికిత్సలు పొందుతున్నారు. బాధితులకు తగిన



యంత్రాలు లేని కారణంగా పగలు రాత్రి తేడా లేకుండా రక్తశుద్ధి కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

**నాలుగు గంటలకు పైగా: బి.నర్సయ్య, నకిరేకల్**

మూత్రపిండాల రక్తశుద్ధి సమస్య పగవారికి రాకూడదు. చికిత్సకు వచ్చిన ప్రతిసారి నాలుగు గంటలు మంచం పైనే ఉండాలి. బాధితులకు తగినన్ని యంత్రాలు లేని కారణంగా రాత్రి సమయంలో కూడా రావాల్సి వస్తోంది. ‘ చొరవతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆసుపత్రి ఉన్నతాధికారుల సహకారంతో ఐదు యంత్రాలు అందుబాటులోకి రావడం సంతోషంగా ఉంది.

**ఇబ్బంది లేకుండా చూస్తాం**

డా.అరుణకుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్

మూత్రపిండాల బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనే ప్రయత్నాలు చేస్తున్నాం. నూతనంగా వచ్చిన ఐదు యంత్రాలతో బాధితులకు సకాలంలో రక్తశుద్ధి జరుగుతుంది. దీనికి కావాల్సిన మౌలిక వసతులకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశాం.

## లెక్క తప్పొద్దు.. నాణ్యత మరవొద్దు!

కొత్తగూడెం: చేపపిల్లల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మత్స్యకారుల సంఘాలకు ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను అందజేస్తోంది. గతేడాది టెండర్లలో జాప్యం, చేపపిల్లల్లో నాణ్యత లోపాలు, బిల్లుల కోసం కమీషన్ల వసూళ్లపై ఫిర్యాదులు రావటంతో ఈసారి ఉచిత చేపపిల్లల పథకం అమలుపై సందేహాలు వ్యక్తమయ్యాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలోనూ ఈ పథకాన్ని కొనసాగించేందుకు రాష్ట్ర ఆర్థికశాఖ ఇటీవల ఆమోదం తెలిపింది. రూ.123 కోట్లతో 90కోట్ల చేపపిల్లలను కొనుగోలు చేసేందుకు అనుమతించింది. **కావాల్సింది 5కోట్లు.. ఉత్పత్తి 19లక్షలే**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని చెరువుల్లో ఏటా 5కోట్లకు పైగా చేపపిల్లలను వదులుతున్నారు. కేవలం 19 (ఖమ్మం జిల్లా మైలారంలో 14, భద్రాద్రి జిల్లా కిన్నెరసానిలో 5) లక్షల చేపపిల్లలు మాత్రమే ఉత్పత్తి అవుతుండటం గమనార్హం. మిగతా వాటిని ప్రభుత్వం టెండర్ ప్రక్రియ ద్వారా గుత్తేదారుల నుంచి కొనుగోలు చేసి మత్స్యకారులకు అందిస్తోంది. ప్రైవేట్ ఉత్పత్తిదారులకు చెల్లిస్తున్న మొత్తాలను మహిళా సంఘాలకు మళ్లించి.. అతివలతోనే చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయించాలని సర్కారు భావిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయితే ఉభయ జిల్లాలకు అవసరమైన చేపపిల్లలను స్థానికంగానే ఉత్పత్తి చేసుకునేందుకు వీలుంటుంది.

**పారదర్శకతకు పెద్దపీట**చేపపిల్లల పంపిణీలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో ఉభయ జిల్లాల మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. చేపపిల్లలను చెరువుల్లో వదిలినప్పటి నుంచి వాటిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి చెరువు గట్టుపై ప్రభుత్వం ఉచితంగా అందించిన చేపపిల్లల వివరాలను పొందుపరచాలన్నారు. చెరువు సామర్థ్యం, ఎన్ని చేపపిల్లలు వదిలారు, ఏఏ రకాలు, వాటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, వాటి ఖర్చు, ఎంత సైజు వంటి అంశాలను తప్పనిసరిగా బోర్డులపై ప్రదర్శించాలని స్పష్టం చేశారు. కచ్చితమైన లెక్కల ప్రకారం చేపపిల్లల పంపిణీ జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చేపపిల్లల పంపిణీకి టెండర్ ప్రక్రియ పూర్తికావాల్సి ఉంది. ప్రభుత్వం టెండర్లు ఖరారు చేయగానే జిల్లాలో చేపపిల్లలను అందజేస్తాం. ఈ ఏడాది 1.50కోట్ల చేపపిల్లలను చెరువుల్లోకి చేర్చాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఇంతియాజ్, జిల్లా మత్స్యశాఖ అధికారి, భద్రాద్రి

# అర్ధాకలి చదువులు



కరీంనగర్ : చదువుపై ఆసక్తితో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరుతున్న గ్రామీణ విద్యార్థులు ఆకలి బాధను ఎదుర్కొంటున్నారు.. గురుకులాలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి ఉండగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే ఈ పరిస్థితి లేదు. దీంతో విద్యార్థులు చదువులపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు.

**పేద కుటుంబాలవారే అధికం..**

ఉమ్మడి జిల్లాలోని 52 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 16,715 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఎక్కువ మంది గ్రామీణ పేద కుటుంబాలకు చెందినవారు ఉన్నారు. ఉదయం 8 గంటలకే ఇంటి నుంచి తినీతినక బయలుదేరుతున్న వారే ఎక్కువ. వీరిలో చాలా తక్కువ మంది రోజూ మధ్యాహ్నం భోజనం తెచ్చుకుంటుండగా మిగతావారు ఏమీ తినకుండా ఉండటమో.. బిస్కెట్లు, స్నాక్స్‌తో ఆకలి తీర్చుకోవడమో చేస్తున్నారు. కొన్నిసార్లు స్నేహితులు తెచ్చిన టిఫిన్ బాక్స్‌లోని భోజనం పంచుకుంటున్నారు. ఈ పరిస్థితులు వారి చదువులు, ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతున్నాయి.

ఆకలి బాధతో కొందరు విద్యార్థులు మధ్యాహ్నమే ఇంటికి వెళ్లిపోతున్నారని అధ్యాపకులు చెబుతున్నారు. సాయంత్రం వరకు ఉన్నవారు ఏకాగ్రత చూపలేకపోతున్నారని పేర్కొంటున్నారు. తినకుండా ఉంటున్నవారు, స్నాక్స్‌తో కడుపు నింపుకొంటున్నవారు సాయంత్రం వరకు నీరసపడుతున్నారు. అర్ధాకలి చదువులు ఫలితాలపైనా ప్రభావం చూపుతున్నాయని అధ్యాపకులు పేర్కొంటున్నారు.

పరీక్షల సమయంలో అధ్యాపకులు, దాతలు, ప్రజాప్రతినిధులు స్పందించి భోజనం ఏర్పాటు చేస్తుండటం కొంత ఊరటగా ఉంటోంది. నీరసం, రక్తహీనత, ఆసిడిటీ సమస్యలతో విద్యార్థులు చికిత్సకు వస్తున్నారని, మధ్యాహ్న భోజనం చేయకుండా ఉంటున్న విద్యార్థులే వీరిలో అధికమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఈ ఇబ్బందులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

కరీంనగర్ జిల్లా ఇంటర్ విద్యాధికారి గంగాధర్‌తో మాట్లాడగా ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. అమలు చేస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని, హాజరు శాతం, ఫలితాలు మెరుగయ్యే అవకాశముందన్నారు.

**టిఫిన్ బాక్స్ తేనప్పుడు బిస్కెట్లు తింటున్నా**

ఉదయాన్నే కళాశాలకు వస్తుండటంతో మధ్యాహ్నం బాగా ఆకలి అవుతుంది. ఒక్కోసారి టిఫిన్ బాక్స్ తెచ్చుకుంటా. బయలుదేరే సమయానికి వంట కాకపోతే మిత్రుల టిఫిన్ బాక్స్ పంచుకోవడమో కళాశాల పక్కనే ఉన్న కిరాణంలో బిస్కెట్లు, ఇతర తినుబండారాలు కొనుగోలు చేసి తినడమో చేస్తున్నా. ఇబ్బంది ఎక్కువగా ఉన్నప్పుడు మధ్యాహ్నమే ఇంటికి వెళ్తున్నా.

ఎం.భార్గవ్, భూపాలపట్నం,చొప్పదండి కళాశాల

**నీరసపడతారు** ఇంటర్ విద్యార్థులది ఎదిగే వయసు. మూడు పూటలా ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారు. లేదంటే రక్తంలో గ్లూకోజ్ తగ్గి నీరసపడటం, చెమటలు పట్టడం తదితర సమస్యలతో పడిపోతుంటారు. తరగతుల్లో చెప్పే పాఠాలు కూడా వారు అర్థం చేసుకోలేరు.డాక్టర్ డి.రఘురామన్, సీనియర్ ఫిజీషియన్, కరీంనగర్

# విష కీటకం.. అప్రమత్తతే శరణ్యం



సిరిసిల్ల : వర్షాకాలం మొదలైందటే విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే అన్నదాతలు ఎక్కువగా పాముకాటుకు గురవుతుంటారు. గ్రామాలకు, పట్టణాలకు దూరంగా ఉండే వసతి గృహాల్లోని నివాసితులకు, ఆయా విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు పాము కాటు ప్రమాదం పొంచి ఉంది. బాధితులకు సకాలంలో చికిత్స అందకపోతే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది.

**కనిపించే లక్షణాలు ఇవీ..**

విష కీటకాలు కాటు వేస్తే కోరల గాయం కనిపిస్తుంది. కొన్నిసార్లు నొప్పి తీవ్రంగా ఉంటుంది. విషం క్రమంగా శరీరమంతా వ్యాపిస్తుంది. నాలుక మందం అవుతుంది. గొంతు కండరాలు బిగుసుకుంటాయి. చొంగ కారడంతోపాటు కళ్లు కన్పించకపోవడం, శరీరం మొద్దుబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎవరైనా పాము కాటుకు గురైతే వారికి ధైర్యం చెప్పాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలి.

**ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు**

అన్నదాతలు పంట చేలకు వెళ్తున్నప్పుడు పాదరక్షలు వేసుకోవాలి. రాత్రి సమయంలో, తెల్లవారు జామున పొలాలకు వెళ్లివచ్చేటప్పుడు టార్చిలైట్లను తీసుకెళ్లాలి. పశుగ్రాసం దుంగలు, రాళ్లకుప్పలు, పంట చేల గట్ల వెంట కీటకాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. చేతిలో కర్ర పట్టుకొని శబ్దం చేసుకుంటూ ముందుకెళ్లాలి. పొలం వద్ద స్టార్టర్ల డబ్బాల్లో సేద తీరుతుంటాయి. ఇంటి ఆవరణలో ముళ్ల పొదలు, గడ్డి, పిచ్చిమొక్కలు లేకుండా చూడాలి. చెత్తాచెదారం పోగు చేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

**మచ్చుకు కొన్ని ఘటనలు**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులో ఇటీవల సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెలవు దినంలో ఇంటికి వచ్చారు. తేలు కాటు వేయగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన చిన్నారికి పత్తి చేను వద్ద తేలు కాటు వేసింది. ఆర్ఎంపీ వద్ద చికిత్స అందించారు. చివరకు చిన్నారి ప్రాణాలు గాలిలో కలిసిపోగా బాధిత బంధువుల రోదనలు మిన్నంటాయి. పెద్దూర్‌లో ఒక రైతుల పొలం నుంచి పశువులను ఇంటికి తోలుకొస్తున్నారు. మార్గమధ్యంలో పాము కాటు వేయగా ఆసుపత్రికి వెళ్లారు. సరైన చికిత్స అందడంతో ప్రాణాపాయం తప్పింది. ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి ప్రభుత్వ వసతి గృహంలో చదువుతున్న బాలుడిని ఇటీవల పాము కాటు వేసింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది.

సకాలంలో వైద్యమందించాలి

వర్షాకాలం మొదలైందంటే విష కీటకాలు సంచరిస్తూ ఉంటాయి. కాటుకు గురైన వ్యక్తిని జాప్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యమందించాలి. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా అపాయం తప్పదు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి.

రజిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి

# ‘లక్ష’ణంగా.. కల నేరవేరగా

పెద్దపల్లి : ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. నిర్మాణ వ్యయం సరిపోకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో పనులు మొదలు పెట్టడంలో వెనకాడుతున్నారు. ఫలితంగా ఆశించిన స్థాయిలో ప్రగతి కనిపించడంలేదు. ఇలాంటి పరిస్థితులు అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంటి నిర్మాణంలో లబ్ధిదారులు అప్పులు చేయకుండా.. స్వశక్తి సంఘాల నుంచి రూ.లక్ష రుణ సదుపాయాన్ని కల్పించింది. నిర్ణీత గడువులోపు పనులు ప్రారంభించని వాటిపై క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి తెలుసుకొనేందుకు జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఆర్థిక భారం తప్పించేందుకు రుణ మంజూరు వివరాలు సేకరిస్తున్నారు.

**క్షేత్ర స్థాయిలో అధికారులు**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచేందుకు గృహ నిర్మాణ సిబ్బంది, కార్యదర్శులు లబ్ధిదారుల ఇళ్ల బాట పట్టారు. వాస్తవంగా మంజూరు పత్రం ఇచ్చిన 45 రోజుల్లో పనులు మొదలు పెట్టాలి. ఈ లెక్కన జిల్లాలో 6,018 ఇళ్లకు అనుమతి ఇవ్వగా.. 3,477 వాటికి సంబంధించిన పనులు మాత్రమే ప్రారంభించారు. మిగిలిన 2,541 ఇళ్ల లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి కారణాలు తెలుసుకుంటున్నారు. నిర్మించుకోమని అవగాహన కల్పిస్తున్నారు. ఇళ్లు ప్రారంభించని జాబితా రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

**రూ.లక్ష రుణం**

పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల్లో మొత్తం 9421 ఇళ్లకు తొలి విడతగా 1962.. రెండో విడతలో 7459 ఇళ్లు మంజూరయ్యాయి.



ఇంకా 3,403 వాటికి మంజూరు పత్రాలు ఇవ్వాల్సి ఉంది. వీటిలో 362 గోడల వరకు, 102 నిర్మాణాలకు సంబంధించి పైకప్పు పూర్తి చేశారు. 3 ఇళ్లు పూర్తయ్యాయి. స్వశక్తి సంఘాల్లో ఉన్న లబ్ధిదారులకు రూ.లక్ష రుణం ఇప్పించేందుకు జాబితా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ముత్తారం మండలం మచ్చుపేటలో 5, పాలకుర్తి మండలం రామారావుపల్లిలో 15 ఇళ్లకు సంబంధించి రుణం ఇవ్వడంతో పనులు చేసుకుంటున్నారు. అవసరమైన లబ్ధిదారులకు ఇప్పించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జిల్లాలో ప్రగతి ఇలా..

మంజూరు చేసినవి: 6,018

పనులు ప్రారంభించింది: 3,477

గోడలు నిర్మించినవి: 362

స్లాబ్: 102

నిర్మాణాలు పూర్తయినవి: 3

## సంప్రదాయాల మేళవింపు.. వంటకాల గుబాళింపు

జూలూరుపాడు : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా గతంలో అధికారులు గుర్తించి పంపిన పలు ప్రాంతాలను పునఃపరిశీలన చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కేంద్ర పర్యాటక శాఖ, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) అధికారులకు సూచించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదు, ఖమ్మం జిల్లాలోని రెండు ప్రాంతాలను అధికారులు పరిశీలించనున్నారు.

**పరిశీలనకు కమిటీ..**

పర్యాటక ప్రాంతాలను గుర్తించి వాటి గురించి నివేదికను పంపేందుకు ఐదుగురు సభ్యులతో ఓ కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఎంపీడీఓ, అటవీ అధికారి, ఐటీడీఏ నుంచి ఇద్దరు, పంచాయతీ కార్యదర్శి సభ్యులుగా ఉండనున్నారు. వీరు ప్రతిపాదిత ప్రాంతంలో పర్యటించి పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయడానికి సానుకూల, ప్రతికూల పరిస్థితులను పరిశీలించి ఆ నివేదికను ఐటీడీఏకు పంపాల్సి ఉంది. ఇప్పటికే ఆ సంస్థ ప్రాజెక్టు అధికారి నుంచి సంబంధిత అధికారులకు ఆదేశాలు అందాయి. టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేసే ఏరియాలో



పర్యాటకులకు అనువైన వసతులు కల్పించనున్నారు. హోం స్టే చేసేందుకు గృహాలు, ఆహారం, వినోదం కోసం(నృత్యాలు, ఫైర్ క్యాంపేన్‌కు) వసతులు, గుట్టలు ఉన్న ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేస్తారు. ఇవన్నీ స్థానిక సంప్రదాయాల మేళవింపుగా నిర్వహించాలని యోచిస్తోంది. గిరిజనులు ఉన్న ప్రాంతాల్లో వారి ఆహారపు రుచులనే పర్యాటకులకు అందిస్తారు. ఉదాహరణకు బంజారాలు నివసించే ప్రాంతంలో ఎక్కువగా వీరు జొన్న రొట్టెను ఇష్టపడతారు. ఇట్లాంటి ఆహారాన్ని ప్రధానంగా అందుబాటులోకి తేవడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. టూరిజం హబ్‌కు కేటాయించిన ప్రాంతాల్లో ప్రభుత్వ భూమి ఉండాలి, మరో వైపు అటవీ ప్రాంతాల్లో ఉండటంతో ఆ శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇవి కొంత ప్రతికూలంగా మారనున్నాయి.

**ప్రతిపాదిత ప్రాంతాలివే.. భద్రాద్రి జిల్లాలో:**ట్రైబల్ మ్యూజియం (భద్రాచలం) పగిడేరు(మణుగూరు),గోగులపూడి (అశ్వారావుపేట), చింతలతండా (జూలూరుపాడు),పూబెల్లి(ఇల్లెందు) ఖమ్మం జిల్లాలో.. గార్లఒడ్డు (ఏన్కూరు) పులిగుండాల (పెనుబల్లి)

## ఆరేళ్లుగా.. అక్కరకు రాలేదుగా..

కొత్తగూడెం : ఆళ్లపల్లి మండలం లక్ష్మీపురం, చింతోళ్లగుంపు, అనంతోగు, తీర్లాపురం, ఆళ్లపల్లి గ్రామాల్లోని 1,000 ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరందించేందుకు నిర్మించిన ఆళ్లపల్లి ఎత్తిపోతల పథకానికి డిజైన్ లోపం శాపంగా మారింది. 2016లో అప్పటి ప్రభుత్వం నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో కిన్నెరసాని నదిపై రూ.10.92కోట్లతో పనులు ప్రారంభించింది. 2019లో పనులు పూర్తయ్యాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంప్‌హౌస్‌లోకి వరదనీరు చేరుతోంది. ముంపు ప్రాంతంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించటంతో కిన్నెరసానికి వచ్చే వరదల ధాటికి మోటార్లు మరమ్మతులకు గురవుతున్నాయి.

**ఏటా ముంపు ముప్పు**

రూ.10కోట్లకు పైగా ప్రజాధనంతో నిర్మించిన ఆళ్లపల్లి ఎత్తిపోతల పథకం ఆరేళ్లుగా ఒక్క ఎకరాకు సైతం సాగునీరందించకపోవటం గమనార్హం. ఏటా వచ్చే వరదలకు పంప్‌హౌస్ ముంపునకు గురవటంతో మోటార్లు దెబ్బతింటున్నాయి. ట్రయల్‌రన్‌లో భాగంగా మొదటిసారి 2022లో పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసినప్పటికీ.. 2023లో వచ్చిన వరదలకు పంపులు మరమ్మతులకు గురయ్యాయి. అప్పటి నుంచి ఈ పథకం నిరుపయోగంగానే మారింది. పాలకులు స్పందించి సాగునీరందించేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని అన్నదాతలు కోరుతున్నారు.

**వర్షాధార పంటలకే పరిమితం**

ఆళ్లపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని ఎత్తిపోయకపోవటంతో ఆయకట్టు రైతులు వర్షాధార పంటలకే పరిమితమవుతున్నారు. మండలంలోని ప్రధాన నీటి వనరులైన ఎర్ర చెరువు, మొద్దుల చెరువులోకి వర్షం నీరు చేరితేనే వాటి కింద వరి, ఇతర పంటలను సాగుచేస్తున్నారు. యాసంగికి నీటిఎద్దడి సమస్య ఉత్పన్నమవుతోంది. అందుకే ఆయకట్టు రైతులు అనేకమంది వర్షాకాలంలో మాత్రమే పంటలు పండిస్తున్నారు. ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వస్తే స్థానికంగా ఉన్న ప్రధాన నీటి వనరులతో పాటు చిన్నచిన్న చెరువులు, కుంటలను నింపుకొని రెండు పంటలు సాగుచేయవచ్చునని ఆశిస్తున్నారు. సమస్య పరిష్కారానికి రూ.26లక్షలతో కరకట్ట నిర్మించాలని సర్కారు నిర్ణయించింది. పంపుల వద్ద నీరు నిల్వ ఉండేలా రూ.9కోట్లతో చెక్‌డ్యాం మంజూరు చేసింది. వచ్చే ఏడాది నాటికి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం. నాగమల్లేశ్వరరావు, డీఈ, నీటిపారుదలశాఖ, కొత్తగూడెం


## ముచ్చటగా మూడు.. మన్యం ప్రగతి చూడు

భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ ఏడాదిగా మూడు కీలక విభాగాల్లో ప్రతిభ కనబర్చడంతో దీన్ని నివేదిక రూపంలో సిద్ధం చేస్తున్నారు. నిపుణుల పర్యవేక్షణలో మూడు అంశాల సమగ్ర సమాచారాన్ని పుస్తకంగా ముద్రించేందుకు ప్రణాళిక రూపొందించారు. తొలి విడతగా 120 పుస్తకాలు ముద్రించాలని నిర్ణయించగా ఒక్కోటి 125 పేజీలు ఉంటుంది. ఇందులో ఆయా విభాగాల సమాచారం, సంబంధింత చిత్రాలను పొందుపర్చనున్నారు. మ్యూజియం అభివృద్ధి, ఉద్దీపకం, కేరీర్ గైడెన్స్ అంశాలపై రూపొందించే పుస్తకాలను 33 జిల్లాల కలెక్టర్లు, గిరిజన సంక్షేమశాఖలోని కీలక అధికారులు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అధికారులకు త్వరలోనే అందించనున్నారు.

1. మ్యూజియం అభివృద్ధి ఐటీడీఏది 50ఏళ్ల చరిత్ర. ఆదివాసీల జీవన విధానంపై గిరిజన సాంస్కృతిక శిక్షణ సంస్థ పరిశోధనలు చేస్తోంది. మ్యూజియం ద్వారా వీరి చరిత్రను చాటడం దీనిపని. కొంతకాలంగా ఈ వ్యవస్థ నామమాత్రంగా మారింది. దీనిపై పీఓ రాహుల్ ప్రత్యేక దృష్టి సారించి రూ.50 లక్షలతో సదుపాయాలు కల్పించారు. చిన్నారులు, యువత, మహిళలు ప్రశాంతంగా గడిపే వాతావరణం కల్పించారు. క్రీడాకారులు ఆటలాడే సౌకర్యం ఉంది. తృణధాన్యాలతో పాటు నాటు కోడికూర, కాల్చిన ఎండు చేపల పులుసు, ఆకుకూరల రుచి చూడవచ్చు. పర్యాటకుల సంఖ్య పెరగటంతో కేంద్రం రూ.కోటి మంజూరు చేసింది.2. ఉత్సాహం ఉద్దీపకం విద్యార్థులకు ఇంగ్లిష్ పదాలు పలకాలంటేనే జంకు. గణితం అంటే బెరుకు. తెలుగు చదవడం, చూసి రాయటం అంటే బెంబేలెత్తేవారు. ఈ సమస్యకు విరుగుడుగా ఉద్దీపకం వర్క్ పుస్తకాలను తయారు చేయించారు. వీటి సాధనతో ప్రాథమిక స్థాయిలో చదువుకు పటిష్ఠ పునాది పడుతోంది. గత విద్యాసంవత్సరం 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు వారి సామర్థ్యం మేరకు ఇంగ్లిష్, గణితం పుస్తకాలు అందించారు.

# నిర్వహణ నీరు గారింది!

ఒంగోలు : జిల్లా వరప్రదాయినిగా ఉన్న గుండ్లకమ్మ జలాశయం పరిస్థితి అధ్వానంగా మారింది. గత వైకాపా అయిదేళ్ల పాలనలో ఇక్కడి రెండు గేట్లు కొట్టుకుపోగా, కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తవి ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటికీ శిథిల రక్షణ గోడలు..అసౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండ్లకమ్మ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 3.859 టీఎంసీలు. 2008 రూ.165 కోట్లతో జలాశయం, రూ.100 కోట్లతో కాలువల నిర్మాణం చేపట్టారు. జిల్లాలోని 80,060 ఎకరాల ఆయకట్టు గుండ్లకమ్మ పరిధిలో ఉంది. ఇందులో కుడి కాలువ 28,000 ఎకరాల



కు, ఎడమ కాలువ 52,060 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది.

**కూలిపోయిన రక్షణ గోడ :** జలాశయం ప్రారంభంలో ఒంపు మార్గంలో ఉన్న రక్షణ గోడ రెయిలింగ్ కొంతమేర శిథిలమై కూలిపోయింది. కొన్నిచోట్ల ఇనుపచువ్వలు బయటికొచ్చి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు..సందర్శకులు అప్రమత్తంగా లేకుంటే అదుపుతప్పి పడిపోయే ప్రమాదముంది. దీనికి మరమ్మతులు చేపట్టే విషయాన్ని యంత్రాంగం విస్మరించింది. పార్కులో పర్యాటకులు కూర్చునే బెంచీలు కూడా ఎక్కడికక్కడే విరిగిపోయాయి. విద్యుత్తు స్తంభాలకు లైట్లు అమర్చే క్లాంపులు లేవు. జలాశయంలో మోడుబారిన చెట్లను తొలగించకపోవడంతో వీక్షకులకు ఇబ్బందికరంగా మారింది.

**నత్తనడకన పనులు:** గుండ్లకమ్మ జలాశయం చెంతనున్న కాటేజీలు శిథిలమయ్యాయి. పచ్చదనం కరవైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కాటేజీల పనులు చేపట్టారు. అయితే ఇవి నత్తనడకన సాగుతుండటం ఆవేదన కలిగిస్తోంది. త్వరలో పూర్తిచేసి వీటిని అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

# ఆక్రమణల తొలగింపు

శ్రీకాళహస్తి : పట్టణానికి సమీపంలోని రాజీవ్‌నగర్‌లో మలివిడత ఆక్రమణల తొలగింపును అధికారులు చేపట్టారు. పకడ్బందీ ప్రణాళికతో వేకువజామున రెవెన్యూ, పోలీసు, పురపాలక శాఖ అధికారులు పురపాలక సంఘ కార్యాలయం వద్ద సమావేశం అయ్యారు. ఒక్కసారిగా రాజీవ్‌నగర్‌కు వెళ్లి ముందస్తు అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లను కూలదోశారు. వేకువజామున కట్టడాలు కూల్చివేత సందర్భంగా పలువురు లబ్ధిదారులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. వైకాపా హయాంలో ఇక్కడున్న ప్రభుత్వ స్థలాలను యధేచ్ఛగా ఆక్రమించారు. దీనిపై అప్పట్లో సర్వత్రా విమర్శలు వెలువడ్డాయి. దీనిపై విజిలెన్స్ విచారణ జరపాలంటూ పలువురు నేతలు ప్రభుత్వానికి విన్నవించారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలో ఉన్న అనధికారిక కట్టడాలను కూలదోశారు. తాజాగా రాజీవ్‌నగర్‌లో ఆక్రమణలు గుర్తించి వాటిని తొలగించారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాలకు సంబంధించి పునాదుల వరకు నిర్మించిన 35 కట్టడాలను కూల్చివేశారు. మూడు షెడ్లు, నాలుగు ఇళ్లను కూల్చారు. వైకాపాకు చెందిన మైనార్టీ నేతకు సంబంధించిన రెండు ఇళ్లను కూల్చివేశారు. కట్టడాలు చేపట్టే సమయంలో అభ్యంతరం వ్యక్తం చేసి ఉంటే రూ.లక్షలు వ్యయం చేసి నిర్మాణాలు కట్టుకునే వారం కాదని, తీరా అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నాక కూలదోయడం సరికాదంటూ అధికారుల పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. అమ్మినోళ్లు, ప్రేక్షక పాత్ర చూసిన అధికారులు బాగున్నారని, తమ బతుకులు వీధిపాలు చేశారంటూ పలువురు బాధితులు ఆవేదనకు గురయ్యారు.

# మూడేళ్లు.. ఇంకెన్నాళ్లు!

ఏలూరు: ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటై మూడేళ్లయినా ఇంకా బాలారిష్టాలు వీడలేదు. కళాశాలకు శాశ్వత భవనాలు ఒనగూరలేదు. తాత్కాలిక భవనాల్లోనే నడుస్తోంది. ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు ప్రవేశాలు కల్పించగా.. తాజాగా మూడో బ్యాచ్ ప్రవేశాలు జరుగుతున్నాయి. ఇంకా తరగతి గదులు, వసతిగృహాలు, రవాణా సౌకర్యం లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో 300 మందికి బోధన చేయడానికి రెండు గ్యాలరీలు ఉన్నాయి. ఎంబీబీఎస్ రెండు, మూడో సంవత్సరం చదివే విద్యార్థులు ఆసుపత్రిలోనే ఉండి క్లినికల్ సేవల్లో పనిచేస్తారు.వారికి థియరీ, ప్రాక్టికల్ క్లాసులు నిర్వహించడానికి ఆసుపత్రిలో గ్యాలరీ నిర్మించి ఇవ్వాలని కోరినా ఏడాదిగా ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. ఈ విషయం డీఎంఈ దృష్టికి కళాశాల వర్గాలు తీసుకెళ్లాయి. సెప్టెంబరు 10 నాటికి పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు చెప్పినా ఆ లోపు కాకపోవచ్చని అంటున్నారు.

**రెండు, మూడు నెలలు..**

ప్రస్తుతం ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న శాశ్వత భవనాల్లో ఒక దానిలో గ్యాలరీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. లోపల బల్లలు, బెంచీలు, ఆడియో, వీడియో సిస్టమ్, ప్రొజెక్టర్లు, ఏసీ ఇలా మిగిలినవి పూర్తికి రెండు, మూడు మాసాలు పడుతుంది. ఇంటీరియర్ చేయాల్సి ఉంది.

**ఎన్ఎంసీ తనిఖీలకు వస్తే**

పీజీ సీట్లు కోరడంతో ఎన్ఎంసీ బృందాలు తనిఖీలకు వస్తే అసంపూర్తి నిర్మాణాలు, అధ్యాపకుల కొరత వారి కంట పడతాయోనని కళాశాల నిర్వాహకులు భయపడుతున్నారు. మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం గ్యాలరీ లేకుండా బోధన చేయకూడదు. వసతిగృహాల్లో సరిపడా బెడ్లు లేవు. సెప్టెంబరు 5 నుంచి మూడో సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానున్నాయి.

# కూ.. చకచకా.. డబ్లింగ్



తిరుపతి: తిరుపతి- పాకాల- కాట్పాడి రైల్వేలైన్‌ను డబ్లింగ్ చేయాలన్నది దశాబ్దాలుగా ఉమ్మడి చిత్తూరు జిల్లావాసుల డిమాండ్. ఏప్రిల్‌లో కేంద్ర క్యాబినెట్ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినా భూసేకరణపై రైల్వేశాఖ నుంచి స్పష్టత లేదు. ప్రాథమికంగా తిరుపతి- పాకాల వరకు సర్వే చేసినా.. పాకాల- కాట్పాడి లైన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తాజాగా జిల్లాతోపాటు తమిళనాడులోని వేలూరు జిల్లాలోనూ భూసేకరణ దిశగా కదలాలని రైల్వేశాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. రెవెన్యూ శాఖ అధికారులు ఈ అంశంపై దృష్టి సారించనున్నారు.తిరుపతి- పాకాల- కాట్పాడి రైలు మార్గంలో రోజూ 40కిపైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఒకే లైన్ ఉండటంతో చిత్తూరులో ముఖ్యమైన రైళ్లు ఆగడం లేదు. ప్రయాణికులు తిరుపతి లేదా కాట్పాడిలో దిగాల్సిందే. ఎక్స్‌ప్రెస్ రైళ్లు వస్తే ప్యాసింజర్లు ఆగాల్సిందే. ఈ ఇబ్బందులు తీర్చేందుకు డబ్లింగ్ చేయాలన్న ప్రతిపాదనలకు కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగింది.

**పలు రంగాలకు ఊతం**

డబ్లింగ్ పూర్తయితే చిత్తూరు, తిరుపతి జిల్లాలు పర్యాటకం, పారిశ్రామికంగా పురోగమిస్తాయి. శ్రీసిటీ, రేణిగుంట, ఏర్పేడు ఈఎంసీలు, గూడూరు, సూళ్లూరుపేటలోని పారిశ్రామికవాడలతోపాటు చిత్తూరు జిల్లా నుంచి గ్రానైట్, మామిడి ఉత్పత్తుల రవాణా సులభతరమవుతుంది. రెండు మూడు రోజులు యాత్రికులు ఉండేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయొచ్చు.

**మార్చి నాటికి సర్వే**

తిరుపతి- పాకాల కాట్పాడి రైల్వే లైన్‌ను రెండు వరుసలుగా విస్తరించేందుకు ఆరు- ఎనిమిది నెలల్లో అవసరమైన స్థలాన్ని రైల్వేశాఖకు అప్పగించనున్నారు. పాకాల- కాట్పాడి మధ్య ఉన్న లైన్ చిత్తూరు జిల్లా పరిధిలోకి వస్తుంది. జిల్లాలో వచ్చే ఏడాది మార్చి నాటికి సర్వే ప్రక్రియను కొలిక్కి తీసుకురావాలని భావిస్తున్నారు. ఈలోగా డబ్లింగ్ పనులకు టెండర్లు ఖరారయ్యే అవకాశం ఉందని అధికారులు అనుకుంటున్నారు.

**త్వరగా భూసేకరణ చేస్తాం**

సీఎం చంద్రబాబు ఆదేశాలతో తిరుపతి- పాకాల డబ్లింగ్‌కు ప్రాథమికంగా సర్వే నిర్వహించాం. త్వరగా భూసేకరణ చేసి రైల్వేశాఖకు అప్పగిస్తాం. వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

శుభం భన్సల్, తిరుపతి జేసీ

విషయం: తిరుపతి- కాట్పాడి రైల్వేలైన్ డబ్లింగ్

పూర్తయితే ఏటా పెరిగే ఆదాయం: రూ.120.85 కోట్లు

పొడవు: 104.39 కి.మీ.

వ్యయం: రూ.1,331.89 కోట్లు

ఆదా కానున్న సమయం: 24 నిమిషాలు

# టీడీఆర్‌ల కోసమే మాస్టర్ ప్లాన్



తిరుపతి : తిరుపతిలో ఐదు వేల ఇంటి నంబర్లను నివాస స్థితి నుంచి వాణిజ్య స్థితికి మార్చాలని వైకాపా హయాంలో నగరపాలక సంస్థ అధికారులు ప్రతిపాదించగా మీద రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువ పెంచింది. ఆ స్థలాల్లో చిన్నచిన్న షెడ్లు నిర్మించి టీడీఆర్‌లు అందజేశారు.అప్పట్లో మార్కెట్ విలువ నాలుగు రెట్లు పెంచి టీడీఆర్ బాండ్లు వైకాపా నేతల స్థలాలకు జారీ చేశారని తెలుస్తోంది.

కొందరు సామాన్యులకు సమాచారం చెప్పకుండా, నోటీసులు ఇవ్వకుండా, పరిహారం ఊసెత్తకుండా దౌర్జన్యంగా భూముల్లోకి చొరబడి అక్రమంగా రోడ్లు వేశారు. .. ఇటీవల జరిగిన టీడీఆర్ మేళాలో బాధితుల గోడు వింటే మాస్టర్‌ప్లాన్ రోడ్ల పేరుతో వైకాపా సాగించిన అరాచకాలు ఎన్నెన్నో.

తిరుపతి నగరంలో తానే అభివృద్ధి చేశానంటూ ఇన్నాళ్లూ గొప్పలు చెప్పుకొన్న మాజీ ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి.. ఆ పనుల్లో అవినీతికి కారణం మాత్రం అధికారులేనంటూ ప్లేటు ఫిరాయించడంపై నగరపాలక సంస్థ యంత్రాంగం తీవ్రంగా మండిపడుతోంది.

**నాటి అధికారి వెలిబుచ్చారిలా..**

వైకాపా నేతల సూచనలతో నిబంధనలు ఉల్లంఘించి మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మాణం చేపట్టాల్సి వచ్చిందని ఏడాది కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో నాటి పట్టణ ప్రణాళికాధికారి బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మరుసటి రోజే ఆయన తెదేపా అధికారి అంటూ వైకాపా పెద్దలు ప్రకటించడం, తాజాగా శ్రీలక్ష్మి అవినీతి అధికారిణి అని పేర్కొనడం చర్చనీయాంశమైంది.

**నిధులు లేకపోయినా తీర్మానాలు**

టీడీఆర్‌ల కోసం రోడ్లు నిర్మించారా అనే సందేహం మొదటి నుంచి కలిగించేలా వైకాపా నేతలు వ్యవహరించారు. 2022 జులై 15న జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.37.12 కోట్లతో 12 మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించేందుకు తీర్మానించారు. ప్రభుత్వం నుంచి పైసా నిధులు రావని తెలిసినా, నగరపాలిక ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా.. వాటిని 22కు పెంచారు. నిర్మాణ వ్యయం రూ.60 కోట్లకు చేరింది. ఈ క్రమంలో నగరపాలిక అత్యవసరాల కోసం బ్యాంకుల్లో ఉంచిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను సైతం రోడ్ల బిల్లులకు చెల్లించడం గమనార్హం.

మొత్తం మాస్టర్ ప్లాన్ రోడ్లు: 22

ప్రభావితమైన భూములు: 1,121

వైకాపా హయాంలో జారీ చేసిన టీడీఆర్‌లు: 442

కూటమి ప్రభుత్వం వచ్చాక: 267

ఇంకా పెండింగ్‌లో ఉన్నవి: 368

# వణుకుతున్న 'పశ్చిమం'



ఆదోని : పశ్చిమ ప్రాంతంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ పల్లె చూసినా.. ఏ ఇల్లు చూసిన వయస్సుతో నిమిత్తం లేకుండా జ్వర బాధితులు ఉంటున్నారు. ఇందులో చాలా మంది మలేరియా, డెంగీ, టైఫాయిడ్ బాధితులే. కొందరు దూర ప్రాంతాలకు వెళ్లలేక గ్రామంలోనే చికిత్స పొందుతుండగా.. మరికొందరు ఆదోని, బళ్లారి, శిరుగుప్ప, రాయచూర్ వంటి ప్రాంతాలకు వెళుతున్నారు. ఆదోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రోగులతో కిటకిటలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కొత్త నీరు రావడం, గ్రామాల్లో స్వచ్ఛత లోపించి, వీధులన్నీ మురికివాడలుగా మారాయి. ఇక దోమలు జనం మీద దండయాత్రలు చేస్తుండటంతో జనం జ్వరాలతో అల్లాడుతున్నారు. కోసిగి, కౌతాళం మండలాల్లోని బాధితులు అధికంగా ఉన్నారు. నదీతీర గ్రామాల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది.

**దండుకుంటున్న ప్రైవేట్ క్లినిక్‌లు**

విష జ్వరాలు ప్రబలడంతో ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ఆర్ఎంపీలకు గిరాకీ పెరిగింది. ఇళ్ల వద్దనే వైద్య సేవలందించి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఇటు పట్టణాల్లో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తే.. ఐదారు రోజులు చికిత్స చేసి.. రూ.20-30 వేలు బిల్లు వేస్తున్నారు. వైద్య సేవలు, ఔషధ గిరాకీ రూ.లక్షల్లో ఉంటోంది. పట్టణంలో ఓ పేరు మోసిన చిన్న పిల్లల ఆస్పత్రిలో రోజు వారి ఓపీ 200 దాటుతోంది. ఓపీ ధర రూ.200. ఒక్కో రోగికి కనీసం రూ.500 తగ్గకుండా మందులు రాస్తున్నారు. ఎస్కేడీ కాలనీలో ఏ ఆస్పత్రిలో చూసిన రోగులతో నిండి ఉంటున్నాయి. గ్రామాల వైపు అధికార యంత్రాంగం కన్నెత్తి చూడటం లేదని ప్రజలు వాపోతున్నారు.

**అటు రోగుల బారులు.. ఇటు సిబ్బంది కొరత**ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గత రెండు వారాలుగా రోజు వారీ ఓపీ 800 దాటుతోంది. ఇక రక్తపరీక్షల విభాగంలో 200 ఓపీ నమోదవుతోంది. వీటిలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి అనుమానిత కేసుల సంఖ్య 80 దాకా ఉంటోంది. సీబీపీ పరీక్షల కోసం అధికంగానే వస్తున్నారు. ఇంతటి ఆస్పత్రిలో 70 మంది వైద్యులుండాల్సిన చోట.. ఉన్నది కేవలం 17 మంది మాత్రమే. ఆరు అర్బన్ కేంద్రాల్లో కేవలం ముగ్గురు వైద్యులు మాత్రమే ఉన్నారు. ఆదోని డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీల్లోనూ అయిదుగురు వైద్యుల కొరత ఉంది. మంత్రాలయంలోని కల్లుదేవకుంట పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులూ ప్రసూతి సెలవులో ఉన్నారు. పెద్దకడబూరు మండలంలో ఒక వైద్యుడి పోస్టు ఖాళీ ఉంది. ప్రతి పీహెచ్‌సీకి ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉండాల్సి ఉండగా పది మంది దాకా కొరత ఉంది. పత్తికొండ, ఆలూరు పరిధిలో సైతం వైద్యులతో పాటు స్టాఫ్ నర్సుల కొరత వేధిస్తోంది.

# గోదావరిపై పెట్రోలింగ్

పోలవరం : పోలవరం ప్రాజెక్టు వెనుక భాగంలోని గోదావరిలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలకు అడ్డు కట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీని కోసం ప్రత్యేకంగా బోటు తయారవుతోంది. గోదావరిపై పెట్రోలింగ్ చేసేందుకు, పర్యాటకుల రాకపోకలకు ఉపయోగించేలా దీనిని తయారు చేస్తున్నారు. గోదావరిలో నిషేధిత వలలతో పెద్ద ఎత్తున చేపలు పట్టుకుని తరలిస్తున్న మత్స్యకారులు, పశువులను నది దాటించి అమ్మి సొమ్ము చేసుకుంటున్న ముఠాల ఆగడాలకు అడ్డుకట్ట పడనుంది.పోలవరం మండలం కొరుటూరు వద్ద అటవీశాఖ పర్యాటకుల బస కోసం కాటేజీలు నిర్మించింది. పర్యాటకులు ప్రైవేటు లేదా పర్యాటక శాఖ బోట్లపై అక్కడికి వచ్చి కాటేజీల్లో ఉండాల్సి రావడం తప్ప మరో మార్గం లేదు. తిరిగి మరుసటి రోజు బోట్లు వచ్చి తీసుకువెళ్లే వరకు అక్కడ ఉండాల్సిందే. ఫలితంగా పాపికొండల్లో బస చేయాలంటే పర్యాటకులు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర అటవీ శాఖాధికారులు కాంపా నిధులు రూ.20 లక్షలు మంజూరు చేశారు. వాటితో బోటు సమకూర్చుకుని.. గోదావరిలో పెట్రోలింగ్‌తో పాటు పర్యాటకుల రాకపోకలకూ దానిని ఉపయోగించనున్నారు. ప్రస్తుతం అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధి తాళ్లరేవులో బోటు ముస్తాబవుతోంది. త్వరలో పోలవరం తీసుకురానున్నారు.

# పేద పిల్లలకు పెద్ద ఊరట!

ఒంగోలు : రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు సాంఘిక సంక్షేమ వసతి గృహాలు కొండంత అండగా నిలుస్తున్నాయి. అత్యంత వెనుకబడిన జిల్లాలో 20 వేల మందికిపైగా విద్యార్థులు వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్నారు. పలుచోట్ల ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరడంతో తలదాచుకునే అవకాశం ఉండటం లేదు. సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం వీటి నిర్మాణానికి చర్యలు చేపట్టింది. జిల్లా ఖనిజ నిధి( డీఎంఎఫ్) నుంచి రూ.కోట్ల నిధులు కేటాయించి నిర్మాణం చేపడుతున్నారు.ఒంగోలు నగరంలోని సంతపేటలో బడికి వెళ్లే పిల్లల కోసం మూడు వసతి గృహాలు కలిపి ఒకే ప్రాంగణంలో భారీ భవన నిర్మాణాన్ని రూ.6.50 కోట్లతో చేపడుతున్నారు. ఇది పూర్తయితే మూడంతస్తుల్లో 500 మంది వరకు ఆశ్రయం పొందవచ్చు.ఒంగోలు నగరంలోని సక్కుబాయమ్మ కళాశాలలో బాలికల కోసం రెండు, మూడు వసతి గృహాల్లో అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నారు. ఈ రెండింటికి పైఅంతస్థుల నిర్మాణానికి రూ.5.50 కోట్లు కేటాయించారు. ఇవి పూర్తయితే 450 మంది వరకు కళాశాల విద్యార్థినులు చదువుకునే అవకాశం ఉంటుంది.

ఒంగోలు నగరంలోని పీవీఆర్ పాఠశాల ప్రాంగణంలో బాలుర కోసం రూ.3 కోట్లతో భారీ భవనాన్ని నిర్మిస్తున్నారు. తూర్పుపాలెంలోని స్థలాన్ని కార్పొరేషన్‌కు అప్పగించి, తీసుకున్న ఈ స్థలంలో వసతి గృహం నిర్మిస్తున్నారు.

చీమకుర్తిలోని బాలికల వసతి గృహానికి రూ.2 కోట్లు, సంతనూతలపాడులో బాలుర వసతి గృహానికి రూ.2 కోట్ల నిధులు



కేటాయించారు.జిల్లాలోని 38 వసతి గృహాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ఫ్లోరింగ్, తాగునీటి సౌకర్యం.. తదితర మరమ్మతు పనులు రూ.13 కోట్లతో చేపట్టారు. ఈ పనులు దాదాపు పూర్తికావొచ్చాయి.

కేంద్ర ప్రభుత్వం సాయమందించే 'పీఎం అజయ్' కార్యక్రమం ద్వారా ఒంగోలులో పాలిటెక్నిక్ కళాశాలలో వసతి గృహాలకు రూ.6 కోట్లు, యర్రగొండపాలెం, గిద్దలూరులో బాలబాలికలకు రూ.ఆరేసి కోట్లతో వసతి గృహాల నిర్మాణానికి ప్రతిపాదించారు.

**ఒంగోలులో స్టడీ సర్కిల్**

పోటీ పరీక్షలకు హాజరయ్యే జిల్లా అభ్యర్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం భవనాల కోసం అన్వేషణ చేపట్టారు. జేడీ శీలం భవనం పరిశీలించినా ప్రస్తుతం కళాశాల విద్యార్థులు ఉంటున్నారు. వారికి నూతనంగా నిర్మించే భవనం పూర్తయిన తరువాత అక్కడ పెట్టే యోచనలో ఉన్నారు. పేద విద్యార్థులకు మేలు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిధులు అందుబాటులో ఉన్నందున భవన నిర్మాణాలు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కూడా సాధ్యమైనంత తొందరలోనే ప్రారంభిస్తామన్నారు.

# పట్టాలు సృష్టించి.. నట్టేట ముంచి

కర్నూలు : ఓర్వకల్లులో రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి కొందరు దొంగ పట్టాలు సృష్టించి విక్రయించారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరగ్గా తాజాగా వెలుగులోకి వచ్చాయి.

ఓర్వకల్లు పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయ సమీపంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమికి కొందరు అక్రమంగా పట్టాలు పుట్టించి అమ్మేశారు. సర్వే నంబరు 471/సిలో రెండెకరాలు, 614లో మూడెకరాలు, ఆదర్శ పాఠశాల సమీపంలో రెండెకరాలు, తహసీల్దారు కార్యాలయం ఎదురుగా సర్వే నంబరు 532/సిలో రెండెకరాల భూమికి పట్టాలు సృష్టించారు.

**సీల్, స్టాంపులు తయారుచేసి..** తహసీల్దారు కార్యాలయ సీల్, స్టాంపును తయారుచేసి పట్టాలపై ముద్రలు వేశారు. తహసీల్దారుగా గతంలో పనిచేసిన కృష్ణవేణి సంతకా న్ని ఫోర్జరీ చేశారు. ప్రభుత్వ స్థలంలో అనధికారిక లేఅవుట్ వేశారు. సెంటు రూ.2.50 లక్షలు, మరికొన్ని రూ.1.50 లక్షల చొప్పున అమ్మేశారు.

**ఒప్పందాలు చేసుకుని..**

కొన్ని ప్లాట్లు విక్రయించేందుకుగాను 2019 నుంచి ఒప్పందాలు కుదుర్చుకోవడం ప్రారంభించారు. ఎంత భూమిని.. ఎంత మొత్తానికి విక్రయిస్తున్నామన్న విషయాన్ని ఒప్పంద పత్రాల్లో రాసుకున్నారు. వీటికి 2019, 2020, 2021, 2022లో కుదుర్చుకున్నారు. 2006, 2011లో పట్టాలను జారీ చేసినట్లు చూపడం గమనార్హం.

ఓర్వకల్లు మండలంలో 2011లో పేదలకు పట్టాలిచ్చారు. ఆ



సంవత్సరంలో పట్టాలిచ్చినట్లు చూపితే ఎవరికీ అనుమానం రాదన్న ఉద్దేశంతో 2011లోనే పట్టాలిచ్చినట్లు చూపారు. వాస్తవానికి ఆ సంవత్సరంలో సర్వే నంబరు 532/సిలో పట్టాలు పంపిణీ చేశారు. నకిలీ పట్టాల్లో మాత్రం ఆ సర్వే నంబరు వేయలేదు.

**బాధితులకు మళ్లీ దొంగ పట్టాలు**

ఓర్వకల్లులో సర్వే నంబరు 614లోని ప్రభుత్వ భూమిని జూనియర్ కళాశాలకు ప్రభుత్వం కేటాయించింది. దీనిని ఆ కళాశాల ప్రిన్సిపల్ స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిలో స్థలాలు కొన్నవారు తాము మోసపోయినట్లు గుర్తించారు. స్థలాలు అమ్మినవారిని నిలదీశారు. దీంతో మరోచోట స్థలాలిస్తామని నచ్చజెప్పారు. వేరేచోట ఉన్న ప్రభుత్వ స్థలానికి తాజాగా మళ్లీ దొంగ పట్టాలు పుట్టించి బాధితుల చేతిలో పెట్టారు. నకిలీ పట్టాల వ్యవహారం వివాదాస్పదం కావడంతో కొందరు కొనుగోలుదారులు అక్రమార్కులను నిలదీశారు. దీంతో సుమారు 15 మందికి డబ్బులు వెనక్కి ఇచ్చేశారు.

## నీటి ట్యాంకర్లు.. కాకి లెక్కలు

గుత్తి : గుంతకల్లు, తాడిపత్రి, గుత్తి పురపాలికల్లో నీటి ట్యాంకుల నిర్వహణ గాడి తప్పింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు దప్పిక పాట్లు తీర్చడానికి ఏర్పాటు చేసిన ట్యాంకర్లతో సత్ఫలితాలు రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గుత్తిలోని కురుబగేరి, దళితవాడ, కుమ్మరులేరికు పైపులైన్లు ఉన్నా కుళాయిలకు రావడం లేదు. పురపాలిక పరిధిలో ఒకరికి రోజుకు 70లీటర్లు తాగునీరు ఇవ్వాల్సి ఉండగా అమలు కావడం లేదు. పామిడి పెన్నా నుంచి వచ్చేనీరు గుత్తి ప్రజలకు చాలడంలేదు. వైటీచెరువు పథకం రెండు నెలలుగా పని చేయడం లేదు. మంగళవారం నుంచి నీరు ఇస్తున్నారు. సత్యసాయి పథకం కింద రోజుకు 10-15లక్షల లీటర్ల



నీరు సరఫరా అవుతోంది. కొన్ని కాలనీలకు మాత్రమే అందిస్తున్నారు. తాడిపత్రి పురపాలికలో రోజుమార్చి రోజు తాగునీరు ఇస్తున్నారు. గండికోట, పెన్నాలోని బోరుబావుల నుంచి సరఫరా అవుతున్నాయి. అక్కడి ప్రజలకు రోజుకు 91 లక్షల లీటర్లు నీరు అవసరం. అధికారులు మూడు ట్యాంకర్లతో పలు వార్డులకు సరఫరా చేస్తున్నారు.

గుంతకల్లు పురపాలికలో ఏడు ప్రైవేట్, రెండు పురపాలిక ట్యాంకర్లతో సీబీటీయా, కల్వగడ్డ, దోనిముక్కలరోడ్డు కాలనీలకు సరఫరా చేస్తున్నారు. మూడురోజులకోసారి నీరిస్తున్నారు. ఇక్కడి జనాభాకు రోజూ 1.26 కోట్ల లీటర్ల తాగునీరు అవసరం. ట్యాంకర్లకు అద్దెలు సక్రమంగా చెల్లించలేని పరిస్థితి నెలకొంది.

**ఇబ్బంది లేకుండా చూస్తున్నాం**

-హేమచంద్ర, డీఈఈ, గుత్తి

ట్యాంకర్లను సక్రమంగా నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం 8 ట్యాంకర్లు ఉన్నాయి. వాటితోనే శివారు కాలనీలకు నీరు ఇస్తున్నాం. ట్యాంకర్ ట్రిప్పునకు రూ.350 చెల్లిస్తున్నాం. సమస్య తీవ్రతను బట్టి ట్యాంకర్ల సంఖ్య పెంచుతాం.

## పట్టుదలే నడిపిస్తోంది!

గుంతకల్లు : పేద కుటుంబానికి చెందిన యువతి పట్టుదలతో పురుషులతో సమానంగా పోటీపడుతూ సత్తా చాటుకుంటున్నారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో మొట్టమొదటి మహిళా లోకో పైలెట్‌గా ప్రత్యేకత చాటారు అమలకుమారి. సహాయ పైలెట్‌గా ఉన్న ఆమె ఇటీవల పైలెట్‌గా పదోన్నతి పొంది ఆదర్శబాటలో పయనిస్తున్నారు. స్ఫూర్తిదాయక ప్రస్థానం ఆమె మాటల్లోనే విందాం..!

మాది చాలా పేద కుటుంబం. తండ్రి సైకిళ్లను మరమ్మతు చేస్తూ నన్ను, మా అక్కను చదివించారు. ఇందుకు ఎంతో కష్టపడ్డారు. ఇద్దరం బీటెక్ చేశాం. సోదరి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడింది. రైళ్లలో పని చేయడం కష్టమని చాలా మంది చెప్పారు. అయినా ఎన్నడూ అధైర్య పడలేదు. పురుషులతో పోటీపడి పనిచేసి.. పేరు సంపాదించుకోవాలన్న పట్టుదలే నన్ను ఈ స్థాయికి చేర్చింది. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సమావేశాల్లో చెబుతుంటారు. అందుకే డ్రైవర్ కావాలని నిర్ణయించుకున్నా. రైల్వేలో 2019లో లోకో సహాయ పైలెట్‌గా



బాధ్యతలు చేపట్టాను. ఇంతవరకు విధుల్లో భాగంగా 98,903 కి.మీ. ప్రయాణించాను.

**అప్రమత్తంగా ఉంటేనే..**

ఉద్యోగం చిన్నదైనా.. బాధ్యత చాలా పెద్దది. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా భారీ నష్టం జరుగుతుంది. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి. అధికారులు పూర్తి సహకారం అందజేస్తున్నారు. ఒక్కోసారి జంతువులు రైల్వేలైన్లపై వస్తుంటాయి. వాటి ప్రాణాలను కాపాడడానికి శాయశక్తులా కృషి చేస్తుంటా. ఇప్పటివరకూ చిన్న ప్రమాదం కూడా జరగలేదు. ఇకముందు అంతకుమించి అప్రమత్తంగా ఉంటా. గమ్యానికి సాఫీగా.. సురక్షితంగా చేర్చడమే నా కర్తవ్యం. ఏ రంగంలోనైనా పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ముందుకెళితే విజయం సొంతమవుతుంది.

## రోడ్లపై నీళ్లు.. జనానికి అవస్థలు

విశాఖపట్నం: అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ముసురు పట్టింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దట్టమైన మబ్బులు కమ్ముకున్నాయి. భారీ వర్షం కురవడంతో కార్యాలయాలు, వ్యాపారాలు, పాఠశాలలకు, వివిధ పనులపై బయటకు వెళ్లేవారు అవస్థలు పడ్డారు. అక్కయ్యపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆర్కే బీచ్‌లో తీరం కోతకు గురైంది. ఎంవీపీ సెక్టార్-3లో రహదారిపై భారీ వృక్షం కూలిపోయింది. భీమునిపట్నంలో 64 మిల్లీమీటర్లు, పరదేశిపాలెంలో 56, ఆనందపురం, పెందుర్తిలో 54, మహారాణిపేటలో 53, కాపులుప్పాడలో 51, గంభీరంలో 49 మి.మీ. వర్షపాతం నమోదైంది.

**కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు**

రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ కేంద్రం హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో, ఆర్డీఓ, మండల కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశామని డీఆర్వో భవానీశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని కేంద్రాల్లో 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కలెక్టరేట్‌కు సంబంధించి 0891-2590100, 0891-2590102 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

# పల్లెవించి 'నిధి'



కర్నూలు : పల్లెల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తోంది. గ్రామాల్లో వివిధ పనులకు వీటిని ఖర్చు చేయాల్సి ఉంది. ఈ నిధులను గత వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టించింది. విద్యుత్తు బకాయిల పేరుతో మళ్లించింది. ఫలితంగా పల్లెల్లో కనీస వసతులు కరవయ్యాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆర్థిక సంఘం నిధులకు ఉపాధి హామీ సొమ్ము జతచేసి 'పల్లె పండగ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పెద్దఎత్తున రహదారులు నిర్మించి జనం కష్టాలు తీర్చింది. ప్రస్తుతం ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై)ను పకడ్బందీగా అమలుచేసేలా చర్యలు చేపట్టింది.

**రూ.20 లక్షల చొప్పున..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై)లో భాగంగా రెండో విడతలో 28 గ్రామాలు ఎంపికయ్యాయి. ఒక్కో గ్రామానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.5.60 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. 50 శాతానికిపైగా ఎస్సీలు ఉన్న గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుతం కేంద్రం నేరుగా ఎంపిక చేసిన ఆదర్శ గ్రామాల్లో పనులు వేగంగా సాగుతున్నాయి.

పీఎంఏజీవై కింద తొలి దశలో 10 మండలాల పరిధిలో 11 ఆదర్శ గ్రామాలను ఎంపిక చేశారు. వీటికి రూ.2.20 కోట్లు కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయి.

**కేంద్రమే ఎంపిక చేసి..**

కర్నూలు జిల్లాలో హొళగుంద మండలం మార్లమడికి, గూడూరు మండలం గుడిపాడు, కె.నాగలాపురం, ఆస్పరి మండలం నగరూరు, నందవరం మండలం మాచాపురం, పెద్దకడబూరు మండలం మేకడోణ, కర్నూలు గ్రామీణ మండలం పసుపల, మంత్రాలయం మండలం బూదూరు, ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామాలను కేంద్రం ఎంపిక చేసింది. 8 మండలాల పరిధిలోని 9 గ్రామాలకు రూ.1.80 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 46 పనులు చేపట్టనున్నారు.

నంద్యాల జిల్లాలో 14 మండలాల పరిధిలో 19 గ్రామాలను ఎంపిక చేశారు. ఒక్కో గ్రామానికి రూ.20 లక్షల ప్రకారం రూ.3.80 కోట్లు విడుదలయ్యాయి. ఈ జిల్లాలో 85 పనులు చేపట్టనున్నారు.

**ఏఏ పనులు చేపడతారంటే..**

గ్రామాల్లో ప్రజలకు శుద్ధ జలం అందించడం.. పారిశుద్ధ్య మెరుగు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శౌచాలయాలు నిర్మించడం.. అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం.. రహదారి పనులు.. సౌర విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసుకునేందుకుగాను నిధులు ఖర్చు చేస్తారు. ఎంపికైన ఆదర్శ గ్రామాలకు కేంద్రమిచ్చే రూ.20 లక్షలతోపాటు ఉపాధి, ఎంపీ ల్యాడ్స్ నిధులు విడుదల చేయడం ద్వారా గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశముంటుంది.

# కట్టలు తెగిన నిర్లక్ష్యం



నంద్యాల : సాగు, తాగునీటికి ఆధారమైన చిన్ననీటిపారుదల చెరువులకు కూటమి ప్రభుత్వం 'రూపు' తీసుకొస్తోంది. వీటి అభివృద్ధికి నిధులు కేటాయించింది. గత వైకాపా ప్రభుత్వ పాలనలో చెరువులను పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం తట్టెడు పూడిక తీయలేదు. ఫలితంగా చాలా ప్రాంతాల్లో ఆనవాళ్లు కోల్పోయాయి. చెరువు కట్టలు బలహీనపడ్డాయి. వర్షాలు పడి వీటిల్లో నీరు చేరిన సమయంలో కట్టలు తెగిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. చిన్న నీటిపారుదల శాఖ కింద కర్నూలు జిల్లాలో 310 చెరువుల పరిధిలో 33,313 ఎకరాల ఆయకట్టు ఉంది. నంద్యాల జిల్లాలో 116 చెరువుల కింద 48,515 ఎకరాల ఆయకట్టు ఉంది. చాలా ప్రాంతాల్లో చెరువులు అధ్వానంగా ఉండటంతో పొలాలు బీళ్లుగా మారాయి.

**రూ.5.50 కోట్లతో ఓఅండ్ఎం పనులు**

ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల పరిధిలో రూ.5.50 కోట్లతో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నాయి. నంద్యాల జిల్లాకు రూ.2.68 కోట్లు, కర్నూలు జిల్లాకు రూ.2.82 కోట్లు విడుదలయ్యాయి. ప్రతి నియోజకవర్గానికి సగటున రూ.45 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో చెరువుల స్లూయిస్‌లు, గేట్లు, షట్టర్ల మరమ్మతులతోపాటు కొత్తవి అమర్చడం తదితర పనులు జరుగుతున్నాయి.

**పథకాలను నిర్వీర్యం చేసి...**

గత వైకాపా ప్రభుత్వం వివిధ పథకాలను నిర్వీర్యం చేసింది. తన వాటా నిధులు విడుదల చేయకపోవడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు పథకాల కింద చెరువులను అభివృద్ధి చేయలేని పరిస్థితి ఏర్పడింది. కర్నూలు జిల్లాలో ఎస్‌డీఎంఎఫ్ కింద 27 పనులకు నిధులు మంజూరవగా 11 మాత్రమే పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో ఏపీఐఐఏటీపీ కింద 46 చెరువులకు రూ.66.91 కోట్లు మంజూరవగా 31 ప్రాంతాల్లో పనులు ప్రారంభించారు. ఎనిమిది మాత్రమే అభివృద్ధి చేయగా చిన్న నీటిపారుదల చెరువులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఆర్‌ఆర్ (రిపేర్స్, రెన్నోవేషన్, రెస్టోరేషన్) పథకం కింద నిధులు విడుదల చేస్తుంది. ఈ నిధుల కోసం ఉమ్మడి జిల్లాలో ముందుగా పనులు చేపట్టాల్సిన చెరువులను చిన్న నీటిపారుదల శాఖ అధికారులు గుర్తించి ప్రతిపాదించారు. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఖర్చు చేస్తే 60 శాతం నిధులు కేంద్రం నుంచి విడుదలవుతాయి.

# నదిలో గట్లు.. కబ్జాకు ఆనవాళ్లు



తాడిపత్రి : పెన్నానది పరివాహక ప్రాంతంలో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. అక్రమార్కులు మరో అడుగు ముందుకేసి నది మధ్యలోనే గట్లు, కంచె ఏర్పాటు చేసుకున్నారు. ఇదంతా గత వైకాపా ప్రభుత్వం నుంచే జరుగుతోంది. ప్రభుత్వం మారినా నాయకుల తీరులో మార్పు కనిపించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో పెన్నానది సుమారు 64 కి.మీ మేర ప్రవహిస్తుంది. నదిని యథేచ్ఛగా ఆక్రమించి పంటల సాగు చేపట్టారు. కిలోమీటర్ వెడల్పుతో ప్రవహించే పెన్నా ప్రస్తుతం వంద మీటర్లకు కూడా లేని దుస్థితి నెలకొంది.

**హద్దులు వేసి.. విక్రయాలు**

నాపరాళ్ల వ్యర్థాలతో గట్లు, ఇనుప కంచెలు వేసి ఆక్రమిస్తున్నారు. ఒక్కొక్కరు 5 నుంచి 10 ఎకరాల మేరకు కబ్జా చేయడం గమనార్హం. ఆ భూమిని పంట సాగుకు అనుకూలంగా మార్చుకున్నారు. మరికొందరు వాటిని విక్రయిస్తున్నారు. ఆలూరు, సజ్జలదిన్నె, తాడిపత్రి పరిసరాలు, ఇగుడూరు, చుక్కలూరు గ్రామాల పరిధిలోని వందల ఎకరాల్లో నదిని ఆక్రమించారు.

కొంతకాలం పంటలు సాగు చేసుకుని తర్వాత అక్కడున్న ఇసుకను యథేచ్ఛగా తవ్వి.. తరలించి రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. నందలపాడు, అక్కన్నపల్లి, హుస్సేనాపురం, చుక్కలూరు పలు గ్రామాల పరిధిలో ఇలాంటి పరిస్థితి కొనసాగుతున్నా అధికారులకు పట్టడం లేదు.

**ముంచుతున్న వరద**

ఆక్రమణలు కొనసాగుతుండటంతో వర్షాకాలంలో నది ప్రవాహం సమీపంలోని కస్తూర్బా, సమీకృత వసతిగృహంపై పడుతోంది. వరద ఆయా ప్రాంతాలను ముంచెత్తుతోంది. ఆ సందర్భాల్లో సెలవులు ప్రకటించాల్సి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

**తగిన చర్యలు తీసుకుంటాం -సోమశేఖర్, తహసీల్దార్**

పెన్నానదిలో ఆక్రమణలు జరిగిన మాట వాస్తవమే. ప్రత్యేక బృందంతో విచారణ జరిపి.. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తాం. వారి ఆదేశాలతో తగు చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణాను కట్టడి వేస్తాం.

## తేలని కేసులు.. రాలని కాసులు..!

విశాఖపట్నం: నగర ప్రజలంతా సకాలంలో పన్నులు చెల్లించి, విశాఖ అభివృద్ధికి సహకరించాలని జీవీఎంసీ రెవెన్యూ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిత్యం ప్రచారం చేస్తున్నారు. కానీ, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్లపై దృష్టి సారించడం లేదని, జీవీఎంసీ ఆస్తులకు సంబంధించి న్యాయస్థానాల్లో ఉన్న కేసుల్ని త్వరితగతిన పరిష్కరించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆర్‌ఐఎన్‌ఎల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్- విశాఖ ఉక్కు) జీవీఎంసీకి రూ.150 కోట్లకుపైగా ఆస్తి, ఖాళీ స్థల పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. గతంలో జీవీఎంసీ విధించిన ఆస్తి పన్నుపై విశాఖ ఉక్కు న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసులో తుది తీర్పు వచ్చేంత వరకు 50 శాతం మాత్రమే పన్ను చెల్లించాలన్న కోర్టు ఆదేశాలతో ఇప్పటికీ ఏటా సగం మాత్రమే ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. రూ.30 కోట్లకు, ఏటా రూ.15 కోట్లు మాత్రమే చెల్లిస్తుండటంతో దాదాపు రూ.150 కోట్లు వరకు బకాయిలు ఉన్నాయి. బీచ్‌రోడ్డులో మత్స్యదర్శిని నుంచి రూ.6 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి. జ్ఞానాపురం పెట్రోల్‌బంకు



నుంచి రూ.3 కోట్లు వసూలు కావాల్సి ఉంది. జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో, ఇప్పటికీ తక్కువ అద్దెలు వసూలు చేయాల్సి వస్తుంది.

నగరంలో జీవీఎంసీకి చెందిన ఆస్తుల్ని లీజులకు తీసుకున్న వారు సకాలంలో అద్దె బకాయిలు చెల్లించకపోగా, ప్రజాప్రతినిధులను అడ్డుపెట్టుకుని పైరవీలకు పాల్పడుతున్నారు. నగర నడిబొడ్డున జీవీఎంసీకి చెందిన వేమన మందిరం గడువు ముగిసినా, ఇంకా లీజుదారుల చేతిలో ఉండటం గమనార్హం. ఇప్పటికీ నెలకు రూ.4 వేలు అద్దె ప్రాతిపదికన భవనాన్ని వినియోగించుకుంటున్నారు. దాన్ని స్వాధీనం చేసుకుని, తిరిగి లీజుకు ఇస్తే ఏడాదికి రూ.60 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ఇలా ప్రభుత్వ ఆస్తులపై బకాయిల వసూలు చేయడంలో, న్యాయస్థానాల్లో కేసులు పరిష్కరించడంలో అధికారులు వెనుకబడి పోవడంతో... జీవీఎంసీ ఆర్థికంగా నష్టపోతుంది.

## అక్రమార్కుల వేషాలు.. కనిపెట్టేందుకు మీనమేషాలు!!


మధురవాడ : జీవీఎంసీ 8వ వార్డు ఐటీహిల్స్ రోడ్డులోని వికలాంగుల కాలనీలో నకిలీ పట్టాల వెలికితీత వ్యవహారంలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. తూతూమంత్రంగా పరిశీలన చేయడంతో అది ఆక్రమణదారులకు వరంలా మారింది. ప్రభుత్వ జీవోలను అడ్డం పెట్టుకుని పలువురు చాపకిందనీరులా భూములను క్రమబద్ధీకరించుకుంటున్నారు. దీంతో కోట్లాది రూపాయల విలువ చేసే సర్కారు స్థలాలు అన్యాక్రాంత మవుతున్నాయి.

కాలనీలో వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక రోడ్డు కోసం కేటాయించిన భూమిని ఇళ్ల స్థలాలుగా మార్చి పట్టాల కోసం దరఖాస్తులు సమర్పించినట్లు తెలుస్తోంది. వీటిని అరికట్టాల్సిన అధికారులు... పట్టాలు అందించేందుకు దస్త్రాలు కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

పట్టాల అక్రమ క్రమబద్ధీకరణ పూర్తయిన తర్వాత నివాసాలు నిర్మించుకునేందుకు ఇప్పటి నుంచే ఆయా స్థలాల్లో మట్టి గుట్టలు వేసి చదును పనులు చేసేందుకు ప్రణాళిక రచించారు.

**నకిలీలకు వారే అండ..!**

ఓ మంత్రి పేరు వాడుతున్న జోన్-2లోని ఓ రెవెన్యూ అధికారిణి అండదండలు కబ్జాదారులకు పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాలనీలో ఇచ్చిన పట్టాలకు ఆధార్ తనిఖీ చేయకుండా క్షేత్రస్థాయి ఉద్యోగులకు వీరే అడ్డు పడుతున్నట్లు తెలుస్తోంది. కాలనీలో అడుగు పెట్టకుండా ఎప్పటికప్పుడు సర్వే చేశామని ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు సమర్పిస్తున్నట్లు సమాచారం.




**జీవోలను అడ్డుపెట్టుకుని..**

వికలాంగుల కాలనీలో 296, 338 ప్రభుత్వ జీవోల ప్రకారంక్రమబద్ధీకరణ జరిగిన జాబితాను అధికారులు పరిశీలించాల్సి ఉంది. వీటికి సంబంధించిన లబ్ధిదారుల ఆధార్‌లు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఒక్కొక్కరి పేరున రెండు, మూడు పట్టాలు ఉన్న విషయం వెలుగులోకి వస్తుంది. కాలనీలో పలువురికి భార్య, భర్తల పేరున వేర్వేరుగా మంజూరైన పట్టాలు ఉన్నాయి. కొన్ని నివాసాలకు ఇంటి పన్ను, విద్యుత్తు కనెక్షన్ లేకుండానే జీవీఎంసీ అధికారుల అండతో క్రమబద్ధీకరణ పేరిట రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. కొందరు ఆక్రమణదారుల పేరుమీద అయిదు, ఆరు స్థలాలకు విద్యుత్తు కనెక్షన్లు సైతం ఉన్నాయి. ఇప్పుడు మరోమారు అధికారుల అండతో జీఓ 30లో క్రమబద్ధీకరణకు ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఆధార్ నెంబరు జత చేసి చూస్తే వారి కుటుంబ సభ్యుల వివరాలన్నీ తెలుస్తాయని అధికారులు పైకి చెబుతున్నా... పట్టాల విషయంలో మాత్రం తెలియని మాయాజాలం నడుస్తోందని పలువురు అనుమానిస్తున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు. ప్రత్యేక అధికారితో ఆధార్ పరిశీలన చేయించి నకిలీ పట్టాలను రద్దు చేయించాలని కోరుతున్నారు.

# ఆశల 'ధర'హాసం

కలిదిండి : రొయ్యల ధరలు క్రమంగా పెరుగుతుండటంతో సాగుదారుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ తొలివారం నుంచి జూన్ నెలాఖరు వరకు 100 కౌంటు కిలో ధర కేవలం రూ.210–230 మధ్యలోనే ఉండటంతో రైతులు భారీగా నష్టపోయారు. దీంతో ఆగస్టు పంటపై సందిగ్ధంలో పడ్డారు. 15 రోజులుగా 100 కౌంటు కిలో ధర రూ.255పై నిలకడగా ఉండటంతో ఖాళీ అయిన చెరువులను సాగుకు సిద్ధం చేస్తున్నారు.

పదిహేను ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నా.. ధరల పతనం, అకాల వర్షాలు, వ్యాధులు కారణంగా రూ.18 లక్షలు నష్ట పోయా. ఈసారి పంట వేయకూడదని నిర్ణయించుకున్నా. 15 రోజులుగా ధరలు



నిలకడగా ఉండటంతో సాగుకు సన్నద్ధమవుతున్నా' అని చెబుతున్నారు కలిదిండికి చెందిన రొయ్యల రైతు రాజా.

**నిలకడగా ధర..** ఆక్వాలో ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా 'ధర' ఆశాజనంగా ఉంటే.. సాగు చేయడంలో రైతులు ఏమాత్రం సంకోచించరు. ఎప్పుడైతే ధరల పతనం వెంటాడుతుందో.. పెట్టుబడులు మట్టిలో కలిసి పోయినట్లే. నాలుగు నెలల తర్వాత 100 కౌంటు కిలో ధర రొయ్యలు రూ.255కి చేరడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

**సాగుకు సన్నద్ధం..** ఉమ్మడి జిల్లాలోని 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దీనిలో 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యలు పండిస్తున్నారు. ప్రస్తుతం 90 వేల ఎకరాలు ఖాళీ అయిపోయాయి. ఆగస్టు నుంచి పంట కాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో సాగుకు అవసరమైన ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ ధరలు నిలకడగా కొనసాగితే గతం తాలూకు నష్టాలు పూడ్చుకోవచ్చని రైతులు భావిస్తున్నారు.

# దుకాణం తెరిచారు.. అద్దె మరిచారు

జంగారెడ్డిగూడెం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాల అద్దె బకాయిలు అక్షరాలా రూ.95 లక్షలు. ఈ భవనాల నిర్వహణతోపాటు, అద్దెల వసూళ్లను కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో పలు చోట్ల దుకాణాలు పొందిన వారిలో కొందరు అద్దెలు ఎగవేయడం, సబ్‌లీజులకు ఇవ్వడం వంటివి పరిపాటిగా మారింది. అనర్హులు దుకాణ సముదాయాల్లో తిష్ట వేసి ఏళ్ల తరబడి వ్యాపారాలు చేస్తున్నా..పట్టించుకొనే నాథుడు లేకపోయాడని అర్హులైన నిరుద్యోగ యువత వాపోతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి 37 చోట్ల 218 దుకాణాలు ఉన్నాయి. నిర్వహణ సరిగా లేకపోవడంతో వీటిలో ప్రస్తుతం 130 మాత్రమే వినియోగంలో ఉన్నాయి.

**బకాయిలు అక్షరాలా రూ.95 లక్షలు**

ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.1.20 కోట్ల వరకు బకాయిలు ఉండగా.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వసూళ్లపై ఎస్సీ కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించారు. ఆయన దుకాణదారుల వద్దకు వెళ్లి అతిక్రమణలు, సబ్‌లీజుల విషయంపై పరిశీలన చేశారు. దీంతో సుమారు రూ.25 లక్షల వరకు వసూళ్లు జరిగాయి. మిగిలిన రూ.95 లక్షల బకాయిలపైనా దృష్టి పెట్టామని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి తెలిపారు. బకాయిదారులు, నిబంధనలు పాటించని వారిని ఖాళీ చేయించి కొత్తవారికి కేటాయిస్తామన్నారు. దీనిపై జేసీకి నివేదిక అందించనున్నట్లు చెప్పారు.

**అయిదేళ్లుగా వదిలేశారు**

గత ప్రభుత్వంలో వీటి నిర్వహణ పూర్తిగా విస్మరించడంతో కొన్ని చోట్ల శ్లాబ్‌లు పాడవగా, మరి కొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఏలూరు జిల్లా భీమడోలులో ఆరు దుకాణాలు పూర్తిగా శిథిలమవడంతో కలెక్టర్ ఆదేశాలతో కూల్చేశారు. బొమ్మిడి, బుట్టాయగూడెం, చింతలపూడి, కామవరపుకోట, నిడమర్రు, పరింపూడిలలో మరమ్మతులకు వచ్చాయి. పశ్చిమగోదావరిలోని తాడేపల్లిగూడెం, శృంగవృక్షం, వీరవాసరం, కోపల్లె, ఉండి ఎన్‌ఆర్‌పి అగ్రహారం, ఆచంటలో దుకాణాలు బాగా దెబ్బతిన్నాయి. కరుగోరుమిల్లి, అత్తిలి, కాల్దరి, యలమంచిలి, చించినాడలో శ్లాబ్‌లు పాడవగా దొడ్డిపట్ల, కాళ్ల, పెంటపాడు, పండితవల్లూరు, గణపవరంలో పాక్షిక మరమ్మతులకు గురయ్యాయి. భీమవరం రాయలంలోని 4 దుకాణాలు పూర్తిగా శిథిలమయ్యాయి. పాడైన భవనాలు మరమ్మతులు చేసేందుకు ఎస్సీ కార్పొరేషన్ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఏలూరు జిల్లాలోని 29 దుకాణాల మరమ్మతులకు రూ.44.50 లక్షలతో ప్రతిపాదించినట్లు ఈడీ తెలిపారు.

# దశాబ్దాల కల నెరవేరనుందా?

మార్కాపురం : తమ చెరువు కట్టను ట్యాంక్‌బండ్‌గా చూడాలన్న మార్కాపురం వాసుల దశాబ్దాల కల కలగానే మిగిలిపోతోంది. గతంలో రూ.10 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినా..ఆ తరువాత కాలంలో ఆ దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు. త్వరలో జిల్లాగా మారనున్న మార్కాపురానికి ట్యాంక్ బండ్ పర్యాటకంగా కూడా ఉపయోగపడుతుందని ఇప్పటికైనా ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**రూపుదాల్చని ప్రతిపాదనలు** 2016 తెదేపా ప్రభుత్వ హయాంలో మార్కాపురం వచ్చిన సందర్భంగా అప్పటి రోడ్ల–భవనాల శాఖ మంత్రి శిద్దారాఘవరావు చెరువుకట్టకు నిధులు కేటాయించి ట్యాంక్‌బండ్ చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు చెరువు కట్టను అభివృద్ధి చేసి మధ్యలో డివైండర్లు, లైటింగ్, బెంచీలు, చెట్లతో సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.10 కోట్ల నిధుల విడుదలకు ప్రతిపాదనలు పంపారు. తరువాత ప్రభుత్వం మారడంతో దీని ఊసే మరచిపోయారు. గత అయిదు సంవత్సరాల వైకాపా ప్రభుత్వంలో చెరువుకట్ట అభివృద్ధికి ఒక్క రూపాయి నిధులు కేటాయించకపోవడంతో ట్యాంక్‌బండ్ నిర్మాణం ఒక కలగానే మిగిలిపోయింది. **కేటాయించిన నిధులను రోడ్లకు...**


2004వ సంవత్సరంలో చెరువుకట్ట విస్తరణకు అప్పటి ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. అప్పుడు రేడియోస్టేషన్ నుంచి గడియారస్తంభం వరకు రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఆ నిధులను సీసీ రోడ్డుకు కేటాయించి పనులు పూర్తి చేశారు. దీంతో చెరువుకట్ట విస్తరణ ఆగిపోయింది. ఆ తరువాత ఇప్పటి వరకు రోడ్డు విస్తరణకు గానీ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి గాని ఒక్క రూపాయ నిధులు రాకపోవడం గమనార్హం.

రూ.44 కోట్లతో ప్రతిపాదనలు

– ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మార్కాపురం

మార్కాపురం చెరువు కట్టను ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు రూ.44కోట్లతో ప్రతిపాదనలు పంపాం. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో మాట్లాడాను. ఆయన ఆమోదం తెలియజేశారు. ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని నిధులు మంజూరు చేస్తే త్వరలో టెండర్లు పిలిచి ప్రక్రియను మొదలు పెడతాం

# తలూపారు.. తాఖీదులు అందుకున్నారు!



చిత్తూరు : వైకాపా హయాంలో నిబంధనలకు పాతరేసి అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పించిన తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందిలో వణుకు మొదలైంది. నాడు పేదలకు ప్రయోజనం కలిగించేందుకు ఉత్తర్వులు ఇచ్చామని జగన్ సర్కార్ గొప్పలు చెప్పుకోగా.. ఆ పార్టీలోని పెత్తందారులు అర్హత లేకున్నా పట్టా భూములుగా చేసుకుని తమ అధికారాన్ని ప్రదర్శించారు. ఇందుకు కొందరు అధికారులను పావులుగా వాడుకున్నారు. నాటి అక్రమాలపై కూటమి ప్రభుత్వం ఏడాదిపాటు పునఃపరిశీలన చేసి చర్యలకు ఉపక్రమించింది. బాధ్యులైన తహసీల్దార్లు, డీటీలు, వీఆర్వోలకు సీసీఎల్‌ఏ నుంచి తాఖీదులు రావడంతో ఆందోళన చెందుతున్నారు.

ఇరవై ఏళ్లకుపైగా పేదల అనుభవంలో ఉన్న అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తున్నట్లు 2023 డిసెంబరులో నాటి జగన్ ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు.. 2003 సంవత్సరానికి ముందు జారీ చేసిన అసైన్‌మెంట్ భూములను మాత్రమే ఫ్రీ హోల్డ్ జాబితాలో చేర్చాలి. దీనికి భిన్నంగా వైకాపా నేతలు చెప్పారని.. జలవనరులు, పశువుల మేత, కుంట పొరంబోకు, ప్రభుత్వ భూములకు, 2003 తర్వాత కేటాయించిన భూములకూ ఫ్రీ హోల్డ్ హక్కులు కట్టబెట్టారు. మేమే జాబితాలు పంపిస్తామని.. మీరు సంతకాలు చేస్తే చాలని వైకాపా నేతలు హుకుం జారీ చేయడంతో కొందరు వ్యతిరేకించగా.. మరికొందరు గుడ్డిగా తలూపారు.

**ఏమని సమాధానమిస్తారో?**

ప్రస్తుతానికి చిత్తూరు జిల్లాలో వెదురుకుప్పం, కుప్పం, వి.కోట, బంగారుపాళ్యం తహసీల్దార్లకు రెండు రోజుల క్రితం సీసీఎల్‌ఏ నుంచి షోకాజ్ నోటీసులు అందాయి. నిబంధనలకు విరుద్ధంగా యాజమాన్య హక్కులు కల్పించిన వ్యవహారంపై సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు ఏమని సమాధానమిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. వైకాపా నేతలు ఒత్తిడి చేశారని జవాబిస్తారా? లేదంటే ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించామని చెబుతారా? అన్నది తెలియాలి. తిరుపతి జిల్లాకు సంబంధించి కూడా మరికొన్ని రోజుల్లో తాఖీదులు జారీ కానున్నాయి.

**చిత్తూరులో 74 శాతం.. తిరుపతిలో 58 శాతం**

ఫ్రీ హోల్డ్ అక్రమాలు చిత్తూరు జిల్లాలోనే ఎక్కువగా జరిగాయి. 1.59 లక్షల ఎకరాలకు యాజమాన్య హక్కులు కల్పించగా ఇందులో నిబంధనలు అతిక్రమించి చేసినవి 1.18 లక్షల ఎకరాలు(74.21 శాతం). ప్రధానంగా వి.కోట, బంగారుపాళ్యం, వెదురుకుప్పం, కుప్పం మండలాల్లోనే ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయి. తిరుపతి జిల్లాలో 79,169.42 ఎకరాలకు యాజమాన్య హక్కులు ఇవ్వగా నిబంధనలకు విరుద్ధంగా జరిగినవి 45,918 ఎకరాలు(58 శాతం). ఇందులో అసైన్డ్ భూములే దాదాపు 40 వేల ఎకరాలున్నాయి. గూడూరు, శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్లలో అత్యధికంగా అక్రమాలు జరిగాయి. రేణిగుంట, ఏర్పేడు, వాకాడు మండలాల్లోనే ఎక్కువగా అవకతవకలు ఉన్నట్లు పునః పరిశీలనలో తేలింది. ఇప్పటికే జిల్లాల కలెక్టర్లు వీటిపై గతంలో పనిచేసిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వీఆర్వోలకు నోటీసులు ఇచ్చారు. ఫ్రీ హోల్డ్‌పై.. జేసీ, కలెక్టర్లు మరోసారి క్షుణ్నంగా విచారణ జరిపి సీసీఎల్‌ఏకు నివేదిక పంపారు.

తిరుపతి జిల్లాలో ఫ్రీ హోల్డ్ చేసిన భూములు: 79,169.42 ఎకరాలు

నిబంధనలకు విరుద్ధంగా జరిగినవి: 45,918 ఎకరాలు

# తీరంలో కాసుల వేట



అల్లవరం : గోదావరి నది.. సముద్ర తీరం.. పట్టా భూములు.. ప్రాంతం ఏదైనా లెక్కలేదు. ఇసుక తరలింపునకు అడ్డూఅదుపూ లేదు. ఇదీ అల్లవరం మండలం తీర ప్రాంత గ్రామాల్లో అక్రమార్కుల తీరు. ఓడలరేవు, కొమరగిరిపట్నం, నక్కారమేశ్వరం పరిధిలో డి.పట్టా భూములు, సీఆర్‌జడ్ పరిధి నుంచి తువ్వ ఇసుకను యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**డి.పట్టా భూములపై కన్నేసి..**

ఓడలరేవు, కొమరగిరిపట్నం పరిధిలో సముద్ర తీరానికి ఆనుకుని గతంలో కుల వృత్తుల వారి కుటుంబ పోషణకు ప్రభుత్వ భూముల్లో డి.పట్టాలు అందించారు. వాటిలో సరుగుడు, ఇతర పంటలను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం వీటిపై ఇసుకాసురుల కన్ను పడటంతో పట్టాదారులకు కొంత ఇచ్చి భూములను స్వాధీనం చేసుకుని తవ్వేస్తున్నారు.

**కొరతే ఆసరాగా..**

ప్రస్తుతం భవన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. గోదావరిలో వరద ప్రవాహం ఉండటంతో పునాదులను నింపేందుకు తువ్వ ఇసుకకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో కొమరగిరిపట్నం, అరగట్లపాలెం, ఓడలరేవు గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు రోజుకు 30 నుంచి 40 ట్రిప్పుల ఇసుక తరలిస్తున్నారు. ఒక్కో లోడు రూ.2వేల నుంచి రూ.2,500 ధరకు విక్రయిస్తున్నారు. నిత్యం రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు అక్రమార్జన చేస్తున్నారు. ఇక్కడి నుంచి బెండమూర్లంక, తుమ్మలపల్లి, మొగళ్లమూరు, దేవగుప్తం, గోపాయిలంక తదితర ప్రాంతాలకు తరలుతోంది. సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక దిబ్బలు తీర ప్రాంతానికి రక్షణగా నిలుస్తాయి. అక్రమార్కులు తొలగించేస్తుండటంతో తమ గ్రామాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

**చర్యలు తప్పవు**

అల్లంవరం తహసీల్దార్ నరసింహారావు స్పందిస్తూ తీర ప్రాంతం నుంచి ఇసుక తరలించినా, తవ్వినా కఠిన చర్యలు తప్పవన్నారు. స్థానిక వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో నిరంతరం గస్తీ ఏర్పాటు చేశామని.. ఇసుక తవ్వితే సంబంధిత భూముల డి.పట్టాలను రద్దు చేస్తామన్నారు.

**రాత్రి సమయాల్లోనే..**

ఈ రెండు ప్రాంతాలో అక్రమార్కులు ఇసుకను కేవలం రాత్రి సమయాల్లో మాత్రమే ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఇసుక ట్రాక్టర్లు వరుస కట్టి హోరెత్తిస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఉదయం 5 గంటల తర్వాత ఎక్కడి వారు అక్కడే గప్‌చుప్.. అన్న చందంగా ఉంటుంది పరిస్థితి. అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన స్థానిక అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

# బాలల ఆరోగ్యం భద్రమేనా?

రాజమహేంద్రవరం: బుడిబుడి అడుగులు వేసి అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారుల నుంచి పాఠశాలకు వెళ్లే విద్యార్థుల వరకు ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది. పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఆర్‌బీఎస్‌కే సర్వేలో 2675 మంది చిన్నారులు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది. ఎక్కువశాతం మందిలో పౌష్టికాహారం, విటమిన్ల లోపం ఉంది. తద్వారా వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోవడం..చర్మ, దంత, చూపు సంబంధిత సమస్యలు తలెత్తాయి.

**జిల్లాలో ఇలా..:** తూర్పుగోదావరి జిల్లాలో గత విద్యా సంవత్సరంలో 2,12,270 మందికి గాను 1,91,006 మందిని సర్వే చేశారు. వీరిలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 2675 మందిని గుర్తించారు. 2029 మందికి స్థానికంగా వైద్య సేవలందించినట్లు ఆర్బీఎస్‌కే సమన్వయకర్త హరిప్రసాద్ తెలిపారు. ప్రధానంగా మేనరిక వివాహాలు చేసుకున్నవారికి జన్మించిన పిల్లల్లో కొన్ని సమస్యలు కనిపించాయి. జన్యుపర లోపాలు..తల్లి గర్భిణిగా ఉన్నప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రభావం చూపుతున్నట్లు నిర్ధారించారు. దీర్ఘకాలిక సమస్యలున్నవారిని జిల్లా ఆసుపత్రులకు పంపించారు. ఇతర చిన్న ఇబ్బందులుంటే అక్కడే మందులివ్వడం లేకపోతే స్థానిక పీహెచ్‌సీల్లో చికిత్స అందిస్తున్నారు.

**ఏయే సమస్యలంటే..**

38 మంది: గ్రహణమొర్రి, వంకరపాదాలు, గుండెలో రంధ్రం, వెన్నుపూసలో సమస్య వంటివాటితో బాధపడుతున్నారు.

355 మంది: వయసుకు తగ్గ పురోగతి లేదు. సరిగా మాట్లాడలేకపోవడం, పనులు చేయకపోవడం, అల్లరి, చదువుపై శ్రద్ధ చూపకపోవడం, వినికిడి, దృష్టి సమస్యలు.

422 మంది: చిన్నవయసులోనే అనారోగ్య సమస్యలున్నాయి. మరో 37 మందికి కౌమార దశలోనూ కనిపించాయి. కొన్ని జన్యుపరంగా



సంక్రమించగా.. మరికొన్నేమో తల్లిదండ్రులు పూర్తి దృష్టిసారించకపోవడం, పుట్టుక తరువాత నిర్దేశిత సమయంలో వ్యాక్సినేషన్ చేయించకపోవడం, పౌష్టికాహారం అందకపోవడం వల్ల తలెత్తాయి.

1046 మంది: దంత, చర్మ సమస్యలు, జ్వరం, గాయాలతో ఇబ్బందులు.

వసతిగృహాల్లో ఉంటున్నవారిలో చర్మ సంబంధిత ఇబ్బందులు ఎక్కువగా కనిపించాయి.

అవగాహన కల్పిస్తున్నాం..

విద్యార్థుల్లో గుర్తించిన సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది స్థానికంగా అవగాహన కల్పిస్తున్నారు. పదిరోజులుగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆబీఎస్‌కే 4.0 సర్వే చేపడుతున్నాం.

డా.హరిప్రసాద్, సమన్వయకర్త, ఆర్‌బీఎస్‌కే

# హైస్కూల్ ప్లస్.. అన్నీ మైనస్

చీపురుపల్లి : గుర్ల మండలం తెట్టంగి పాఠశాలలో గతేడాది హైస్కూల్ ప్లస్‌లో 30 మంది విద్యార్థులు ఉండేవారు. అధ్యాపకులు, సదుపాయాల్లేక వీరంతా ఇంటర్ రెండో ఏడాదిలో వేర్వేరు కళాశాలలకు ఆన్ టీసీలపై వెళ్లిపోయారు. ప్రస్తుతం 70 మంది పదోతరగతి విద్యార్థులున్నారు. వీరంతా ఇంటర్ విద్య కోసం గుర్ల, నెల్లిమర్ల, చీపురుపల్లి, గరివిడి వెళ్లాల్సిన పరిస్థితి.

గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో నేటికీ అవస్థలు తప్పడంలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ విద్యకు అవకాశం కల్పిస్తే డ్రాపౌట్‌లు తగ్గుతాయని, బాలికా విద్యకు ప్రోత్సాహం ఉంటుందని ఎంతో మంది విద్యావేత్తలు, తల్లిదండ్రులు గొంతు చించుకున్న తర్వాత 2021లో హైస్కూల్ ప్లస్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో 8 పాఠశాలల్లో ఇంటర్మీడియట్‌కు అవకాశం కల్పించారు. ఎలాంటి సదుపాయాలు



కల్పించకపోవడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బోధకుల్లేక విద్యార్థులు వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ ఏడాది దాదాపు అన్ని పాఠశాలల్లోనూ పూర్తిగా ప్రవేశాలు లేవు.

**బలోపేతం చేస్తే మేలు..**

ప్రస్తుతం దూరంగా ఉన్న పట్టణాలకు వెళ్లేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గుర్ల మండలం కొండగండ్రేడులోని విద్యార్థులు 15 కి.మీ. దూరంలోని గుర్ల జూనియర్ కళాశాలకు వెళ్లాల్సివస్తోంది. అదే తెట్టంగిలో హైస్కూల్ ప్లస్ అన్ని సదుపాయాలతో అందుబాటులో ఉంటే ఈ ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వం వీటిలో సౌకర్యాలు కల్పిస్తే గ్రామీణ విద్యార్థులు, బాలికలు చదువుకు దూరమయ్యే పరిస్థితులు తగ్గుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు.. అన్ని సదుపాయాలతో హైస్కూల్ ప్లస్‌ల నిర్వహణ, ప్రయోగశాలల ఏర్పాటు, పీజీటీల నియామకంపై డీఈవో మాణిక్యంనాయుడు వద్ద ప్రస్తావించగా.. ఈ ఏడాది ప్రవేశాలు లేకపోవడం వాస్తవమేనన్నారు. పీజీటీలుగా ఉన్నవారంతా ఇటీవల బదిలీల్లో వెళ్లిపోయారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

# మస్తర్లలో మస్కాకు చెక్!

ఒంగోలు : ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి కొలతలు తగ్గించి నమోదు చేయడం...పనికి రాకున్నా వారి పేర్లపై మస్తర్లు వేసి, ఆ తర్వాత వారి నుంచి నగదు తీసుకోవడం తదితర అక్రమాలు జిల్లాలో చేపట్టిన సామాజిక తనిఖీల్లో వెలుగు చూశాయి. వివిధ ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో బోగస్ మస్తర్లు నమోదు ఎక్కువగా జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పథకం పనుల్లో మరింత పారదర్శకతకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా కూలీల మస్తర్లలో నమోదులో మార్పులు చేసింది. పనుల్లో అక్రమాలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఎన్ఎంఎంఎస్ యాప్‌తో పనులకు వచ్చే వారందరికీ ఇప్పటికే ముఖ హాజరు నమోదు చేస్తున్నారు. కూలీలకు ప్రస్తుతం ఒకపూట హాజరు వేస్తుండగాబీ బోగస్ మస్తర్లను నివారించేందుకు ఉదయం, సాయంత్రం రెండు సార్లు మస్తరు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

**నిబంధనలివీ..:** ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మొదటిసారి హాజరు నమోదు చేసి ఫొటో అప్‌లోడ్ చేసిన 4 గంటల తర్వాత రెండో సారి మస్తరు వేయాలి. సాంకేతిక సమస్య ఎదురైతే అదేరోజు రాత్రి 12 గంటల్లోపు అప్‌లోడ్ చేయాలి. రెండో సారి హాజరు పంపని క్షేత్ర సహాయకుడు, సీనియర్ మేట్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. క్షేత్రసహాయకులు తీసే చిత్రాలను ఎంపీడీవోలు తప్పనిసరిగా పరిశీలించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ స్పష్టం చేసింది.

**అక్రమాలకు అడ్డుకట్ట**– జోషఫ్‌కుమార్, పీడీ

ప్రభుత్వ ఆదేశాల మేరకు పని ప్రదేశంలో హాజరైన కూలీలకు తప్పనిసరిగా రెండుసార్లు చిత్రాలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ మేరకు క్షేత్రస్థాయిలో జరిగే మస్తర్లలో అక్రమాలను నియంత్రించవచ్చు. తాజాగా ఉదయం, సాయంత్రం కూలీల కంటి పాప ద్వారా హాజరు వేసే విధానాన్ని అమలు చేయనున్నాం.

2025–26 సంవత్సరానికి సంబంధించి వివరాలు

ఉపాధిహామీ పథకం కార్డులు: 4.50 లక్షలు

మొత్తం కూలీల సంఖ్య : 8.35 లక్షల మంది


పనికి వస్తున్న కుటుంబాల సంఖ్య: 3.80 లక్షలు

అందులోని కూలీలు : 6.77 లక్షల మంది

కూలీలకు ఖర్చు చేసిన నిధులు : రూ.248 కోట్లు

కూలీకి సరాసరి వేతనం (రోజుకు) : రూ.252

# ధరల పట్టికలేవీ?



ఒంగోలు : జిల్లా కేంద్రమైన ఒంగోలు ఆర్టీసీ బస్టాండులోని దుకాణదారులు ధరల పట్టికలు అందుబాటులో ఉంచకపోవడంపై జేసీ రోణంకి గోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒంగోలు నగరంలోని పెట్రోలు బంకులు, గ్యాస్ గోదాంలు, వాటర్ ప్లాంట్లను ఆయన డీఎస్వో పద్మశ్రీతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉచిత గాలిపంపుతోపాటు ప్రథమ చికిత్స పెట్టెల నిర్వహణ, ఇంధనం పరిమాణం, నాణ్యతపై ఆరా తీశారు. ఆర్టీసీ బస్టాండులో ఆహార నాణ్యతపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా మరుగుదొడ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డేలో భాగంగా జిల్లా వ్యాప్తంగా సినిమా థియేటర్లు, పెట్రోలు బంకులు, గ్యాస్ గోదాంలు, ఎం.ఎల్.ఎస్.పాయింట్లు, రేషన్ దుకాణాలు, బియ్యం మిల్లులు, ఆర్వో ప్లాంట్లు, ఆర్టీసీ బస్టాండ్లు, బాణ సంచా పరిశ్రమల్లో తహసీల్దార్ల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. మొత్తం 150 చోట్ల సోదాలు చేశారు. రెవెన్యూ, పౌరసరఫరాల, తూనికలు కొలతలు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, అగ్నిమాపకశాఖల అధికారులు సంయుక్తంగా చేపట్టిన ఈ తనిఖీల్లో పలు లోపాలను గుర్తించి నిర్వాహకులకు సూచనలిచ్చారు.

# నిషిద్ధ భూములకు ఎట్టకేలకు మోక్షం

కాకినాడ : నిషిద్ధ జాబితాలోకి నెట్టేసిన ప్రైవేటు భూములకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. వీటిపై దాఖలైన ఫిర్యాదుల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గత వైకాపా పాలనలో కాకినాడ జిల్లాలో నిర్వహించిన భూముల రీ-సర్వేలో ప్రైవేటు భూములు కొన్నింటిని నిషిద్ధ జాబితా(22ఏ)లో నమోదు చేసేశారు. ఈ క్రమంలో చాలా మంది భూములు, స్థలాలను విక్రయించుకోలేక గత అయిదేళ్లుగా కష్టాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 22ఏ నుంచి ప్రైవేటు భూములను తప్పించాలని పెద్ద సంఖ్యలో అర్జీలు దాఖలయ్యాయి. దీంతో 2024, జూన్ నుంచి ఇప్పటి వరకు వచ్చిన వాటిని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటిని వెబ్‌ల్యాండ్‌లో



నమోదు చేసే అధికారం కలెక్టర్లకు ఇవ్వడంతో పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి.

**దరఖాస్తులపై విచారణ**

నిషిద్ధ జాబితాలో నమోదైన కొన్ని ప్రైవేటు భూముల విషయంలో వివాదాలు, కోర్టు కేసులు వంటివి ఉన్నాయి. వీటిపై ప్రతి బుధవారం కలెక్టరేట్‌లో జేసీ అధ్యక్షతన డీఆర్వో ఆధ్వర్యంలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న ఆయా తహసీల్దారు కార్యాలయాల సూపరింటెండెంట్లతో విచారణ చేయాలని నిర్ణయించారు. అనంతరం కలెక్టర్‌తో చర్చించి, వీటిని పరిష్కరించనున్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

జిల్లాలో 2024, జూన్ నుంచి 2025, జులై 28 వరకు పీజీఆర్ఎస్ ద్వారా 283 దరఖాస్తులొచ్చాయి. వీటిలో 249 పరిష్కరించారు. 22 దరఖాస్తులు రీ-ఓపెన్ కాగా వాటిలో 20, మీ-సేవ కేంద్రాల ద్వారా 28 రాగా, ఆరు పరిష్కారమయ్యాయి. కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్లలో మొత్తం 37 పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్వో వెంకటరావు తెలిపారు.

# గంగ కాలువలో జలకళ

గూడూరు : వరుణ దేవుడు కరుణ తక్కువగా ఉన్నా.. కండలేరు జలాశయం నుంచి ఈ ఏడాది ముందస్తుగా తెలుగు గంగ పరిధిలో కాలువలకు నీరు విడుదల చేయడంతో ఉమ్మడి గూడూరు డివిజన్ పరిధిలోని గ్రామాల్లో వేసవితో తాగు, సాగు నీటి ఎద్దడి అధిగమించే అవకాశం కలిగింది. రబీలో పంటలు కూడా ముందస్తుగా సాగు చేసుకునే వెసులుబాటు కలిగింది. నైరుతి రుతు పవనాలు వల్ల వర్షపాతం తక్కువైనప్పటికీ.. ఎగువ భాగంలో కురిసిన వర్షాలకు సోమశిల జలాశయానికి భారీగా నీరు చేరడం.. అక్కడ నుంచి కండలేరు ద్వారా తెలుగు గంగ పరిధిలోని ప్రధాన కాలువ, బ్రాంచి కాలువలకు నీరు విడుదల చేశారు. ఇవి కాకుండా స్వర్ణముఖి, కాళంగి, కండలేరు నదులు, వీటి పరిధిలోని చెరువులకు నీరు విడుదల చేయడంతో గతంలో ఎప్పుడు లేని విధంగా జలకళతో దర్శనమిస్తున్నాయి.

**1.42 లక్షల ఎకరాలకు సాగునీరు**

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి సత్యవేదు నియోజకవర్గాల్లో



5, 7 బ్రాంచి కాలువల పరిధిలోని మైనర్, కాలువలు కింద ఉన్న 1.42 లక్షల ఎకరాలు రబీలో సాగుకు సరిపడ నీరు చేరడంతో రైతులు ఆగస్టు నుంచి వరినూళ్లు పోసుకునే అవకాశం కలిగింది. ఇప్పటికే ఎడారు సాగు కింద 45 ఎకరాలు వరి పైర్లు సాగు చేశారు. దీంతో విరామం లేకుండా పంటలు సాగు చేసుకునే అవకాశం కలిగింది. స్వర్ణముఖి, కాళంగి కండలేరు మామిడి కాలువ, నెర్రి కాలువలకు నీరు చేరడంతో వేసవి తాగునీటి ఎద్దడి కూడా లేకుండా ఉంది. జలవనరుల శాఖ కాలువలకు చేరిన నీరు వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకుంటే రబీ పోను అదనంగా కూడా మరో పంట సాగు చేసుకునే అవకాశం ఉంది. చిట్టమూరు, ఓజిలి బాలాయపల్లి మండలాల్లో మెట్ట భూములకు ఈసారి నీరు అందుతుండడంతో ఈప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# కన్నేసి.. బండరాళ్లతో కప్పేసి

కదిరి : బాహ్యావలయ రహదారి విస్తరణ కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని, దేవరచెరువు కాలువను తమ భూమిలోకి కలుపుకొనేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారు. కదిరి పట్టణం బేరిపల్లి సమీపంలోని సర్వేనంబరు 274లో 21 ఎకరాల భూమి ఉంది. అందులో ఎక్కువ భాగం బాహ్యావలయ రహదారి కోసం ప్రభుత్వం రైతుల నుంచి సేకరించింది. తొలి దశలో కొంతభాగం రోడ్డు వేయగా భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రోడ్డుకు ఇరువైపులా కొంత భూమిని వదిలారు. ఇక్కడ ఎకరాల రూ.కోట్లు పలుకుతుంది. ఈ భూమిపై సమీపంలోని రైతులు కన్నేశారు. ఎవరూ చూడరనే ధీమాతో దగ్గర్లోని కొండల్లో నుంచి బండరాళ్లను, ఎర్రమట్టిని తవ్వి, తరలించి తమ భూమికి సమాంతరంగా ప్రభుత్వ భూమిని పూడ్చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 20 సెంట్లను పూడ్చేశారు. చెరువుకు సంబంధించిన కాలువను సైతం వదల్లేదు. దాన్ని మట్టితో పూడ్చి తమ పొలంలోకి కలుపుకొనేందుకు యత్నిస్తున్నారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. రహదారికి సేకరించిన భూమిలోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఆర్డీఓ వీవీఎస్ శర్మ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ భూమిలోకి ప్రవేశించినట్లు సమాచారం అందగానే చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారిని ఆదేశించాను. అనుమతి లేకుండా మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# పునరావాసంలో తొలి అడుగు



నక్కపల్లి: నక్కపల్లి మండలంలో పారిశ్రామికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం నిర్వాసితులకు సంబంధించిన పునరావాసంపై కీలక అడుగు వేసింది. కాలనీ ఏర్పాటుకు తయారు చేస్తున్న లే అవుట్‌లో ఇళ్ల స్థలాలను కేటాయించడానికి సిద్ధమైంది. రాజయ్యపేట, వేంపాడు, చందనాడ, డి.ఎల్.పురం, బుచ్చిరాజుపేట రెవెన్యూ పరిధిలో సుమారు 4300 ఎకరాల భూమిని తెదేపా ప్రభుత్వం సేకరించి గతంలోనే పరిహారం చెల్లించింది. కొన్నిచోట్ల ఇళ్లను తొలగించాల్సి రావడంతో.. వీటికి సంబంధించి పరిహారం ఇవ్వడంతో పాటు, వారికి పునరావాసం కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే పెదబోదు గల్లం వద్ద భూములు కొనుగోలు చేసి ఏపీఐఐసీ ఇందులో వీఎంఆర్‌డీఏ ద్వారా 151 ఎకరాల్లో లే అవుట్లు నిర్మిస్తున్నారు. దీన్ని వేగంగా తయారు చేసేలా మంత్రి అనిత, పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ విజయకృష్ణన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. పలుమార్లు అధికారులు వీటిని పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సూచనలు చేశారు. ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన రోడ్లు వేస్తున్నారు. దీంతోపాటు మిగిలిన సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందులో 1200 పైగా స్థలాలు తయారు చేస్తున్నారు. సేకరణలో భాగంగా అయిదు రెవెన్యూ గ్రామాల పరిధిలో 745 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. ప్రతి ఒక్కరికి అయిదు సెంట్ల స్థలం చొప్పున ఇవ్వనున్నారు.

ఇందుకోసం వీరి మధ్య ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు వీలుగా లక్కీ డ్రా తీస్తున్నారు. ఆ మేరకు పాటిమీద సమీపంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ, వర్షం ఇబ్బందులు లేకుండా భారీ టెంట్లు, ప్రత్యేక గ్యాలరీలు, తాగునీరు తదితర వాటిని సిద్ధం చేస్తున్నారు. లబ్ధిదారులను ఇక్కడకు రప్పించి వారి సమక్షంలోనే అధికారులు బహిరంగంగా డ్రా తీయనున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**పోలీసు బందోబస్తు నడుమ..** ఇళ్లను కోల్పోయిన నిర్వాసితుల్లో అర్హులకు అయిదు సెంట్ల ఇంటి స్థలంతోపాటు సుమారు రూ.తొమ్మిది లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నారు. మరోవైపు పరిహారం రూ. 25 లక్షలు పెంచాలంటూ లబ్ధిదారులతో కలిసి సీపీఎం నాయకులు కొద్దిరోజులుగా పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రా తీసే ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నక్కపల్లి, ఎస్.రాయవరం సీఐలు కె.కుమార స్వామి, ఎల్.రామకృష్ణ పర్యవేక్షణ చేశారు. ఆర్డీఓ వి.వి.రమణ అధికారులతో సమీక్షించి, వేదిక ఏర్పాట్ల ప్రాంతాన్ని పరిశీలించారు.

# ప్రోత్సాహకం కొట్టేసేందుకు పన్నాగం



పలమనేరు : కూటమి ప్రభుత్వం మామిడి రైతుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని తోతాపురికి గిట్టుబాటు ధర నిర్ణయించడానికి నడుం బిగించింది. జిల్లాలో ఈ రకం మామిడికి కిలో రూ.12 ధర నిర్ణయించగా... పరిశ్రమలు రూ.8 ఇస్తే.. ప్రభుత్వం రూ.4 ప్రోత్సాహక నగదు ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని దండుకోవడానికి పన్నాగాలు పన్నారు. నకిలీ ఆధార్, వాహనాల నంబర్లు నమోదు చేశారు.

జిల్లా వ్యాప్తంగా తోతాపురి 40 వేల హెక్టార్లలో సాగైంది. ఈ రకం మామిడి పండించే రైతుల సంఖ్య 20-25 వేల వరకు ఉంటారని అంచనా. ప్రస్తుతం కాయలు పూర్తి గా ఖాళీ అయిన దశకు చేరుకుంది. ఎక్కడో ఓ చోట ఆటోల్లో కాయలు తెచ్చి ర్యాంపుల వద్ద దించుతున్నారు. అక్కడ హార్టికల్చర్ సిబ్బంది రైతుల పూర్తి వివరాలు నమోదు చేస్తారు. అయితే ఒకే ట్రాక్టరు ఒక రోజులో 5 నుంచి 15 లోడ్లు ర్యాంపులకు తెచ్చినట్లు వివరాలు నమోదు కావడంతో అధికారులు విస్తుబోయారు. అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించి వారిని వడ కట్టే పనిలో ఉన్నారు.

**ఈ ప్రాంతాల్లోనే..**

పలమనేరు, వి.కోట, కుప్పం, సోమల, బంగారుపాళ్యం ప్రాంతాల్లో ఈ వ్యవహారం చోటుచేసుకుంది. జిల్లాలోని వ్యవసాయ గణాంకాల ప్రకారం 2.26 లక్షల టన్నుల మామిడి కాయలు పరిశ్రమలకు, ర్యాంపుల ద్వారా లక్ష టన్నుల కాయలు విక్రయించారని అంచనా.

25 వేల మందికి 45 వేల పేర్ల నమోదు..

జిల్లాలో 25 వేల మంది రైతులు ఉంటే ర్యాంపుల వద్ద సుమారు 45 వేల మంది పేర్లు, వాహనాల నంబర్లు నమోదు కావడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో అర్థమవుతుంది. దీంతో అధికారులు ఆధార్, ట్రాక్టర్ నంబరు, ఈ క్రాప్ వివరాలు పరిశీలిస్తున్నారు. **అర్హులకే అందేలా చూస్తాం..**

మా వద్ద ఉన్న వివరాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నాం. డబుల్ ఎంట్రీలను గుర్తించి తొలగిస్తున్నాం. ఆధార్ నంబర్లను కచ్చితంగా పరిశీలించి రెండుసార్లు నమోదై ఉంటే తీసేస్తున్నాం. అసలైన రైతులకు రాయితీ అందేలా కృషి చేస్తాం. త్వరలో ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. కోటేశ్వరరావు, జిల్లా హార్టికల్చర్ అధికారి, చిత్తూరు

# నిర్లక్ష్యం 'గడ్డ'కట్టేసింది!



అనంతపురం : పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సరఫరా చేసిన వేలాది సిమెంట్ బస్తాలు పనికిరాకుండా పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంపిణీలో జాప్యం జరిగి గోదాముల్లో దాచిన బస్తాలు ఎక్కడికెక్కడ గడ్డకట్టాయి. అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో పేదల ఇళ్లకు కేటాయించిన ఇనుము గోదాముల్లోనే మగ్గిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అమ్మేసుకున్నారు...

ప్రభుత్వం సరఫరా చేసిన ఇనుమును అనంతపురం గ్రామీణం పరిధిలో పనిచేస్తున్న ఓ అధికారి పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ప్రధాన గోదాము వద్ద పనిచేస్తున్న ఓ వ్యక్తి ద్వారా కడ్డీలను ఒక్కొక్కటిగా విక్రయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. టన్ను ధర మార్కెట్‌లో రూ.80 వేలు ఉండగా.. తుక్కు వ్యాపారులకు రూ.30 వేల చొప్పున విక్రయించినట్లు సమాచారం. గతంలో రాక్రీట్ సంస్థ కోసం కేటాయించిన ఇనుమును సైతం అనంతపురం గ్రామీణంలో పనిచేస్తున్న అధికారి అమ్మేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2వేల బస్తాలు వృథా

అనంతపురం అర్బన్, గ్రామీణ పరిధిలో నిర్మించే ఇళ్ల కోసం కేటాయించిన సిమెంట్ బస్తాలను పంగల్‌రోడ్డులోని హౌసింగ్ శాఖ ప్రధాన గోదాములో ఉంచారు. ఏడాది కిందట అనంతపురం గ్రామీణం పరిధిలో విధులు చేపట్టిన అధికారి సిమెంటు పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తూ వచ్చారు. నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు ఎట్టి పరిస్థితుల్లో సిమెంటు ఆపకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ పెడచెవిన పెట్టారు. గోదాములోని సిమెంటుతోనే అనంతపురం, గార్లదిన్నె, రాప్తాడు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాలకు అవసరమైన ఇటుకలు, దిమ్మెలు తయారుచేయాల్సి ఉండగా అందులోనూ అలసత్వం వహించారు. ఫలితంగా గోదాములో సుమారు 2 వేల బస్తాల సిమెంటు గడ్డకట్టాయి. కళ్యాణదుర్గంలోనూ వెయ్యి బస్తాలు కేటాయించగా.. 200 వరకు పనికి రాకుండా పోయాయి.

# 'విష'మించిన నదీ జలం

నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో నదులు, చెరువులు కలుషితమవుతున్నాయి. మురుగు నీటితోపాటు రసాయన వ్యర్థాలు నేరుగా కలుస్తూ విషతుల్యమవుతున్నాయి. ఫలితంగా నీటిలో ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోతోంది. చెరువులు, ఇతర జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. పరిస్థితి తీవ్రతపై కాలుష్య నియంత్రణ మండలి గతంలోనే హెచ్చరికలు జారీ చేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నంద్యాల పట్టణ శివారు, మద్దూరు, కోవెలకుంట్ల ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణ మండలి సేకరించిన నమూనాల్లో ప్రమాదకర అవశేషాలు ఉన్నట్లు తేలింది. ఈ కారణంగా చేపలు తరచూ చనిపోతున్నట్లు తేలింది. అయినా అధికారులు దృష్టి సారించడం లేదు.

**మురుగు ముంచుతోంది**

తుంగభద్ర, కుందూ నదులు ఆక్రమణలకు గురవుతున్నాయి. గృహ, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాల నిర్మాణంతో మురుగు నేరుగా నదుల్లో కలుస్తోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రవహించే తుంగభద్ర, హంద్రీ, కుందూ నదుల్లోకి నేరుగా వ్యర్థాలు చేరుతున్నాయి. వీటిని ఎక్కడా శుద్ధి చేయడం లేదు. కర్నూలు నగరంలో 60 ఎంఎల్‌ఎడీ, నంద్యాల పట్టణంలో 20 ఎంఎల్‌డీ వరకు మురుగు ఉత్పత్తి అవుతోంది.



**గుట్టుచప్పుడు కాకుండా**

నంద్యాల పట్టణ శివార్లలోని సీడ్ కంపెనీల నిర్వాహకులు వర్షాకాలంలో రసాయన వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా కేసీ కాలువలోకి వదులుతున్నారు. కొట్టాల సమీపంలోని బూర్గమాను వంకలో రసాయన వ్యర్థాలు కలుస్తుండడంతో సమీపంలోని పంట పొలాల సారం దెబ్బతింటోంది.

**ఏం చేయాలంటే**

చెరువుల్లోని ఘన, ప్లాస్టిక్, గుర్రపు డెక్కను తొలగించాల్సిన అవసరం ఉంది. నదులు, చెరువుల్లో ఆక్సిజన్ మోతాదు పెంచేందుకు ఏరియేషన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. నంద్యాల, కోవెలకుంట్ల, నంద్యాల, గోస్పాడు, పాణ్యం, ఉయ్యాలవాడ, బనగానపల్లి మండలాల పరిధిలోని వివిధ గ్రామాల వ్యర్థాలు, మురుగు నీరు కుందూ నదిలో చేరకుండా దారి మళ్లించాలి. పరిరక్షణ కమిటీలను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలి. లేకుంటే జలచరాల జీవనం ప్రశ్నార్థకంగా మారిపోయే ప్రమాదముంది.

**డీవో తగ్గిపోతూ..** కర్నూలు, నంద్యాల జిల్లాలోని కొన్ని చెరువులు, నదుల్లో ఆశించిన స్థాయిలో డీవో (డిజాల్వ్‌డ్ ఆక్సిజన్) ఉండడం లేదు. సాధారణంగా చెరువులో లీటరు నీటిలో 4 మిల్లీగ్రాముల కంటే ఎక్కువగా డీవో ఉండాలి. చాలా చెరువుల్లో ఇది తక్కువగానే ఉంది.నదుల్లోకి పెద్దఎత్తున రసాయనిక వ్యర్థాలు చేరుతుండటంతో ఆక్సిజన్ పరిమాణం తగ్గిపోతోంది. కుందూ నదిలో ఆక్సిజన్ పరిమాణం తగ్గడంతో నీటి నాణ్యతకు ముప్పు కలుగుతోంది. జలచరాలు మృత్యువాత పడుతున్నా యి. కర్నూలు శివారులోని కొన్ని పరిశ్రమల వ్యర్థాలు నేరుగా తుంగభద్ర నదిలో కలుస్తుండడంతో దుర్వాసన వస్తోంది. నీరు రంగు మారుతోంది. ఆదోని పురపాలక పరిధి నుంచి సగటున విడుదల వుతున్న 5 ఎంఎల్‌డీ వ్యర్థాలతో శివారు ప్రాంతంలో 100 ఎకరాల్లో వివిధ పంటలు పండిస్తున్నారు. ఫలితంగా అనిరోబిక్ బ్యాక్టీరియా పెరిగి హైడ్రోజన్ సల్ఫైడ్ వంటి విష వాయువులు విడుదలవుతున్నాయి. ఫలితంగా ప్రజలతోపాటు పక్షులు, ఇతర జీవులపైనా ప్రభావం పడుతోంది.

# తుంగ'భద్ర'మేనా'

కర్నూలు : తుంగభద్ర జలాలు శ్రీశైలానికి తరలించే సుంకేసుల బ్యారేజీ గేట్ల నిర్వహణ అధికారులకు సవాలుగా మారింది. ఆరు గేట్లు పూర్తిస్థాయిలో పైకి ఎత్తలేని పరిస్థితి నెలకొనడం.. ఇప్పటికిప్పుడు వరద పెరిగితే 2009 నాటి పరిస్థితులు తలెత్తుతాయన్న ఆందోళన నెలకొంది. మంగళవారం 1,25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా నాటికి 1,06,000 క్యూసెక్కులకు తగ్గింది. జలాశయం 7 గేట్లు 2 మీటర్లు, 14 గేట్లు మీటరు ఎత్తు తెరచి దిగువకు 1,05,517 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**వెంటాడుతున్న వైకాపా పాపం**

రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీటిని అందించే అతి కీలకమైన సుంకేసుల బ్యారేజీ నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం వదిలేసింది.. కనీసం గ్రీజుకు చిల్లిగవ్వ చెల్లించలేదు. ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో ప్రస్తుతం గేట్లు మొరాయిస్తున్నాయి. బ్యారేజీకి 30 గేట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. 4,5,7,11,12,29 గేట్లకు సంబంధించి రోప్స్ (తాళ్లు) తెగిపోవడంతో ఓ స్థాయి వరకే పైకి ఎత్తేందుకు అవకాశముంది. మూడు లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తే అన్ని గేట్లు పూర్తిస్థాయిలో పైకి ఎత్తాల్సి ఉంటుంది. అప్పుడు ఈ ఆరు గేట్ల విషయంలో ఏం చేయాలని ఇంజినీర్లు ఆలోచిస్తున్నారు.

**సాంకేతిక బృందం రాక**

సుంకేసుల బ్యారేజీ వద్ద మొండికేస్తున్న ఆరు గేట్ల నిర్వహణకు కూటమి ప్రభుత్వం రూ.30 లక్షలు విడుదల చేసింది. మంగళవారం నుంచి పనులు ప్రారంభించారు. ఆరుగురు సాంకేతిక నిపుణుల బృందాన్ని పిలిపించారు. మరమ్మతులకు 20-25 రోజులు పట్టే అవకాశం ఉందని కేసీసీ డీఈఈ ప్రసాదరావు తెలిపారు.

**శాశ్వత మరమ్మతులు చేస్తేనే**

సుంకేసుల ఆధారంగా కర్నూలు- కడప (కేసీ) కాల్వకు నీటిని విడుదల చేస్తారు. రెండు సీజన్లలో కలిపి 2.80 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తారు. ఏటా సగటున 150 టీఎంసీల నీటిని సుంకేసుల బ్యారేజీ ద్వారా శ్రీశైలానికి విడుదల చేస్తారు. 2009లో 9.30 లక్షల క్యూసెక్కుల భారీగా వరద రావడంతో సుంకేసుల కొట్టుకుపోయింది. తర్వాత 2013లో 3.30 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. బ్యారేజీలో ఏడాదిపాటు నీరు నిల్వ ఉండడంతో మరమ్మతులు చేసేందుకు అవకాశం లేకుండా పోతోంది. గేట్లు ఎత్తితే నీరు దిగువకు విడుదలైతే వేసవిలో కర్నూలు నగర ప్రజలకు మంచినీటి సమస్య ఎదురవుతుంది. గాజులదిన్నెలో నీళ్లు నింపి నగరానికి సరఫరా చేసే ఏర్పాట్లు చేస్తే తప్ప గేట్లకు మరమ్మతులు చేయలేని పరిస్థితి.

## జాన్వీ మినీ స్కర్ట్‌తో గుండె జారి గల్లంతు..!

జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో అడుగు పెట్టి సంవత్సరాలు గడుస్తోంది. ఇప్పటి వరకు ఆమె నటించిన ఏ ఒక్క సినిమా కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకోలేదు. వందల కోట్ల వసూళ్లు సాధించిన సినిమాలు కూడా లేవు. హిందీలో ఈమె చేస్తున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడుతూనే ఉన్నాయి. ఇటీవల కూడా ఈమె నటించిన హెూమ్ బౌండ్ సినిమా సైతం ఆశించిన



స్థాయిలో అలరించలేదు. సాధారణంగా హీరోయిన్స్ వరుస సినిమాలతో ఫ్లాప్ ను చవిచూస్తే కెరీర్ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. జాన్వీ కపూర్ మాత్రం ఇన్నాళ్లుగా ఫ్లాప్స్ పడుతున్నా కెరీర్‌లో ముందుకు సాగుతూనే ఉంది. బాలీవుడ్‌లో ఏడాదికి కనీసం ఒకటి రెండు సినిమాల చొప్పున విడుదల చేస్తూ వస్తుంది. ఇదే సమయంలో టాలీవుడ్‌లో దేవర సినిమాలో నటించింది, ఆ సినిమా ఫలితంతో సంబంధం లేకుండా వెంటనే పెద్ది సినిమాలోనూ ఎంపిక అయింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఆ సినిమాలో జాన్వీ నటించడం చాలా స్పెషల్‌గా చెప్పుకోవచ్చు.

**సోషల్ మీడియాలో జాన్వీ కపూర్ అందాల ఆరబోత...** శ్రీదేవి నట వారసురాలిగా ఎంట్రీ ఇచ్చినప్పటికీ తనకంటూ ప్రత్యేక గుర్తింపు, గౌరవం దక్కించుకోవడం ద్వారా జాన్వీ కపూర్ ఇండస్ట్రీలో ఉండగలుగుతుంది. సినిమాలు హిట్ కాకున్నా జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో షేర్ చేసే అందమైన ఫోటోలు, వీడియోల కారణంగా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తద్వార జాన్వీ కపూర్ కు ఎప్పటికప్పుడు ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. ఇండస్ట్రీలో చాలా మంది నటన ప్రతిభ, అదృష్టం, సినిమాలు హిట్ కావడం వల్ల వరుస సినిమాలు చేస్తున్నారు, కానీ జాన్వీ కపూర్ మాత్రం సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా పాపులారిటీ దక్కించుకుని సినిమా ఇండస్ట్రీలో కొనసాగుతుంది. ఈ విషయాన్ని ఆమె ఫ్యాన్స్ కూడా చాలా మంది ఒప్పుకుంటారు. జాన్వీ కపూర్ హిట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంది.

## కీరవాణి మరో ఆస్కార్ గురి..?

RRR సినిమాతో ఎం.ఎం కీరవాణి అకాడమీ అవార్డ్ అందుకున్నారు. నాటు నాటు సాంగ్ పాన్ ఇండియానే కాదు పాన్ వరల్డ్ మొత్తం షేక్ చేసింది. ఆ సాంగ్ కంపోజింగ్.. దానికి కొరియోగ్రఫీ.. అందులో చరణ్, తారక్ డాన్స్ ఇలా అన్నీ కూడా అలా అదిరిపోయేలా కుదిరాయి. అందుకే ఆ సాంగ్ అంత పెద్ద హిట్ అయ్యి ఆస్కార్ ని సైతం గెలుచుకుంది. ఆస్కార్ వేదిక మీద తన పాట అవార్డ్ గెలుచుకున్న సందర్భాన్ని కీరవాణి ఎప్పుడూ గుర్తు చేసుకుంటారు.

**రాజమౌళి నెక్స్ట్ లెవెల్ లో..** ఐతే నెక్స్ట్ రాజమౌళి చేస్తున్న మహేష్ 29 సినిమాకు కూడా కీరవాణి ఒక రేంజ్ లో మ్యూజిక్ ఇస్తున్నారట. ఈ సినిమా కోసం కీరవాణి అందిస్తున్న మ్యూజిక్ మరోసారి ఆస్కార్ గురి అన్నట్టుగా ఉంటుందట. ఇప్పటికే %బూవీదీ% 29 సినిమా గురిచి ఏ క్లూ విన్నా.. ఏ అప్డేట్ చూసినా రాజమౌళి నెక్స్ట్ లెవెల్ లో సినిమా తెరకెక్కిస్తున్నాడని అన్నారు. అడ్వెంచర్ మూవీగా వస్తున్న



ఈ సినిమాలో మహేష్ లుక్స్ తోనే అదరగొట్టేస్తాడని అంటున్నారు. సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తుండగా పృధ్విరాజ్ సుకుమారన్ ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తున్నాడు. రాజమౌళి మహేష్ కాంబో సినిమా విజువల్ ట్రీట్ పక్కా అంటున్నారు. ఆర్.ఆర్.ఆర్ తో కేవలం సాంగ్ కే ఆస్కార్ వచ్చింది. అందుకే ఎస్.ఎస్.ఎం.బి 29 సినిమా విషయంలో సినిమా, డైరెక్టర్, హీరో ఇలా అన్ని విభగాల్లో అవార్డ్ గురి పెడుతున్నాడట రాజమౌళి.

**2027 రిలీజ్ చేసేలా..** రాజమౌళి అండ్ టీం ఈ సినిమా కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలుస్తుంది. మహేష్ కూడా రాజమౌళికి కావాల్సిన విధంగా తన డేట్స్ అడ్జెస్ట్ చేస్తున్నాడు. త్వరలో ఫారిన్ లో ఒక లాంగ్ షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నారు SSMB 29 టీం. 2027 రిలీజ్ చేసేలా రాజమౌళి వర్క్ చేస్తున్నాడని తెలుస్తుంది. మహేష్ రాజమౌళి ఇద్దరు కలిసి చేసే సినిమా కోసం కొన్నాళ్లుగా ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఐతే ఈ సినిమా ఇన్నేళ్ల వెయిటింగ్ ని మర్చిపోయేలా అదిరిపోయే రేంజ్ బ్లాక్ బస్టర్ సెటప్ రెడీ చేస్తున్నారని తెలుస్తుంది. మహేష్ కూడా ఈ సినిమా కోసం ఎప్పుడు లేని విధంగా మాస్ ఎలిమెంట్స్ తో లైక్ షర్ట్ లెస్.. ఇంకా కెరీర్ లో ఇప్పటివరకు చేయని కొన్ని విషయాలు చేస్తున్నారట. తప్పకుండా తెర మీద సూపర్ స్టార్ ఫ్యాన్స్ అందరికీ ఇది నచ్చేస్తుందని అంటున్నారు.




## మెగా రెబల్ బీభత్సం.. థియేటర్లు ఏమవుతాయో..!



సందీప్ వంగ నెక్స్ట్ బిగ్ వెంచర్ స్పిరిట్ పై ఒక్కో న్యూస్ ఆడియన్స్ కి సూపర్ హై ఇస్తుంది. రెబల్ స్టార్ ప్రభాస్ తో స్పిరిట్ మూవీ చేస్తున్న సందీప్ వంగ ఆ సినిమా విషయంలో పెద్ద ప్లానింగ్ తోనే వస్తున్నాడని అనిపిస్తుంది. సినిమాలో ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ పాత్రలో కనిపిస్తాడని తెలిసిందే. ఐతే ఈ సినిమాకు సంబంధించిన ఒక న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. రెబల్ స్టార్ ప్రభాస్, సందీప్ వంగ కాంబోలో వస్తున్న స్పిరిట్ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి కూడా నటిస్తారట.

**ప్రభాస్ సినిమాలో చిరంజీవి..** ఏంటి మెగాస్టార్ చిరంజీవి ఏంటి ప్రభాస్ సినిమాలో చేయడం ఏంటని షాక్ అవ్వొచ్చు. సందీప్ వంగ ఈ సినిమాలో చిరుని స్పెషల్ అప్పియరెన్స్ గా ప్లాన్ చేస్తున్నారట. సందీప్ వంగ ఎంత పెద్ద మెగాస్టార్ చిరంజీవి అభిమానో తెలిసిందే. అతని ఆఫీస్ లో కూడా చిరంజీవి ఫోటో ఉంటుందంటే ఇక చెప్పాల్సింది ఏముంటుంది. అంతేకాదు చిరు సినిమాల ప్రభావం వల్లే తాను డైరెక్టర్ గా మారానని చెప్పాడు సందీప్ వంగ. యానిమల్ సినిమా తర్వాత ప్రభాస్ తో సందీప్ వంగ చేస్తున్న స్పిరిట్ సినిమాలో స్పెషల్ క్యామియోస్ ప్లాన్ చేస్తున్నాడట. అదేంటి సందీప్ వంగ కూడా లోకేష్ కనకరాజ్ బాటలో వెళ్తున్నాడా అంటే.. అసలు కాదు పాత్రకు ఎలాంటి స్టార్ అవసరమో అలాంటి వాళ్లని తెస్తుంటాడు సందీప్ వంగ. ఊరకనే స్టార్ ని తీసుకుని నెట్టేసే టైప్ కాదు. యానిమల్ సినిమాతో అనిల్ కపూర్ కి మంచి రోల్ ఇచ్చాడు.

**బాబీ డియోల్ మళ్లీ బిజీ స్టార్ అయ్యాడంటే..** అంతేకాదు బాబీ డియోల్ కి మరో లైఫ్ ఇచ్చాడు సందీప్ వంగ. యానిమల్ తర్వాత బాబీ డియోల్ మళ్లీ బిజీ స్టార్ అయ్యాడంటే అది ఆయన వల్లే. సో సందీప్ వంగ కథలో ఈ హీరో కావాలంటే ఆ హీరో ఇమేజ్ కి తగిన ఇంపార్టెన్స్ ఉంటుంది. అది సరే అసలు స్పిరిట్ లో చిరంజీవి రోల్ అంటే మాత్రం థియేటర్లు దద్దరిల్లిపోయాయి. ఈ కాంబో కుదరడం అంత ఆషామాషీ విషయం కాదు. ఐతే క్యామియో అయినా చిరంజీవి కన్విన్స్ అయితే మాత్రం ఇక ఆ మెగా రెబల్ మూవీ రికార్డులకు అందరు సైడ్ అవ్వాల్సిందే. స్పిరిట్ లో మెగాస్టార్ బజ్ బాగున్నా అసలు ఇది జరిగే ఛాన్స్ ఎంతవరకు ఉంటుంది అన్నది చూడాలి. మరి మెగా కాంపౌండ్ నుంచి ఈ అప్డేట్స్ పై ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూడాలి.

## ఘాటీతో విక్రమ్ ప్రభు.. సమ్ థింగ్ స్పెషల్!



టాలీవుడ్‌లో 'ఘాటీ' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. క్వీన్ అనుష్క శెట్టి, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమా అరుదైన యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. అంతే కాకుండా ఈ సినిమాలో ప్రత్యేక పాత్రలో నటించిన హీరో విక్రమ్ ప్రభు చాలా కాలం తరువాత మళ్ళీ తెలుగులో ఫోకస్ అవుతున్నాడు. విక్రమ్ ప్రభు తెలుగు ప్రేక్షకులకు కొత్త కాదనే చెప్పాలి. ఎందుకంటే అతని తొలి చిత్రం కుమ్కిను గజరాజు పేరుతో తెలుగులో విడుదల చేశారు. ఆ సినిమా ద్వారా ఆయనకు తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు 'ఘాటీ' ద్వారా మళ్లీ తెలుగు ఆడియన్స్ ముందుకు వస్తున్నారు. ఈ సినిమాలో విక్రమ్ ప్రభు ఓ కీలకపాత్ర పోషించడమే కాకుండా, తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పి నిజమైన ఫీలింగ్‌ను తెచ్చారని సమాచారం. చిత్ర యూనిట్ సమాచారం ప్రకారం, విక్రమ్ ప్రభు ఈ చిత్రంలో చూపించిన యాక్టింగ్ ప్రత్యేకంగా నిలుస్తుందట. కళ్లలోని ఎమోషన్‌తోనే పాత్రను ఎలివేట్ చేసిన విధానం కూడా హైలెట్ అయినట్లు తెలుస్తోంది. అంతేకాదు, తన తాత, లెజెండరీ నటుడు శివాజీ గణేశన్ సినీ వారసత్వాన్ని గుర్తు చేసుకునేలా ఓ సాంగ్‌లో కూడా స్పెషల్ ట్రిబ్యూట్ ఇచ్చారు. "సైలోరే" అనే పాటలో శివాజీకి సంబంధించిన ట్యూన్‌ని జోడించారు. ఇది సినీ అభిమానుల్లో ఒక ఎమోషనల్ కనెక్ట్‌ని కలిగిస్తోంది. అనుష్క శెట్టి పవర్ఫుల్ పాత్రలో కనిపించనుండగా, విక్రమ్ ప్రభు ఆమెకు సరితూగే ఇంపార్టెన్స్ ఉన్న రోల్ చేశారట. ఈ కాంబినేషన్ తెరపై కొత్త అనుభూతిని కలిగిస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టీజర్స్ చూసినవారంతా ఈ జంట లుక్స్‌కి ఇంప్రెస్ అవుతున్నారు. 'ఘాటీ'ను %ఖఎ% క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ గ్రాండ్‌గా నిర్మిస్తున్నాయి. యాక్షన్, డ్రామా, ఎమోషన్‌ల కాన్సెప్ట్ తో రూపొందుతున్న ఈ మూవీని సెప్టెంబర్ 5న మల్టీ లాంగ్వేజ్‌లో విడుదల చేయనున్నారు. అద్భుతమైన విజువల్స్, టెక్నికల్ వర్క్‌తో కూడిన ఈ సినిమా పాన్ ఇండియా ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి, 'ఘాటీ' ద్వారా విక్రమ్ ప్రభు తెలుగు తెరపై మరోసారి తన ప్రతిభను చాటుకోబోతున్నారు. ఇక సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి కలెక్షన్లను అందుకుంటుందో చూడాలి.

## వృద్ధాప్యాన్ని ఆపేసే టెక్నిక్ కనిపెట్టిన సమంత

మయోసైటిస్ లాంటి ప్రమాదకర రుగ్మత నుంచి బయటపడి, ఇప్పుడు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతున్నారు సమంత రూత్ ప్రభు. ఫిట్నెస్ ఫ్రీక్ అనే పదానికి పర్యాయపదంగా మారారు సామ్. నిరంతరం జిమ్ చేయనిది పొద్దు గడవదు. సమంత ఎప్పుడూ ఏదో ఒక కొత్త వ్యాయామం గురించి పరిచయం చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు మరో కొత్త వ్యాయామ విధానాన్ని తన అనుచరుల కోసం పరిచయం చేస్తున్నామని తెలిపారు. చాలా వయసు సంబంధ సమస్యలకు యోగా, వ్యాయామం, ధ్యానం బెస్ట్ సొల్యూషన్. కానీ ఈ వ్యాయామం చేస్తే వృద్ధాప్యాన్ని దాదాపుగా ఆపేయడం సాధ్యపడుతుందని చెబుతున్నారు సమంత రూత్ ప్రభు. కండరాలతో పాటు మెదడు, ఎముకలకు బలం చేకూర్చే, ఓర్పును ఇచ్చే వ్యాయామ విధానం ఇదని చెబుతున్నారు. దీనితో వృద్ధాప్యాన్ని అధిగమించవచ్చని అన్నారు. క్లియర్ క్రియేటిన్ అనే కొత్త వ్యాయామం గురించి సమంత వివరించారు. ఇది తన దినచర్యలో చాలా ముఖ్యమైన భాగంగా



మారిందని, బలంగా బరువులు ఎత్తడానికి, వేగంగా కోలుకోవడానికి, రోజంతా మరింత దృష్టి కేంద్రీకరించడానికి ఈ వ్యాయామం సహాయపడిందని సమంత తెలిపారు. త్వరలోనే దీనిని అందరి కోసం ప్రారంభిస్తున్నామని, నిజాయితీగా చెప్పాలంటే, ప్రతి ఒక్కరూ దీనిని ప్రయత్నించే వరకు వేచి చూడలేనని కూడా సమంత ఎగ్జయిటింగ్ గా చెప్పారు. ఇంతకుముందు ఓ పోస్ట్ లో సమంత రూత్ ప్రభు తాను స్వీకరించే సప్లిమెంట్ల జాబితా గురించి కూడా చెప్పుకొచ్చారు. విటమిన్ D3 + K2 – ఎముక ఆరోగ్యం, కాల్షియం వినియోగం, గుండె నాళాలకు మద్దతునిస్తుంది. ఒమేగా–3 (ఇపిఎ– డిహెచ్ఏ) – మెదడు, గుండె– కీళ్ల ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడానికి ఉపకరిస్తుంది. ఆల్గేకాల్ – ఎముక సాంద్రత కోసం కాల్షియం అందిస్తుంది.. ఇది మొక్కల ఆధారితంగా లభిస్తుంది. బోరాన్ – ఖనిజ జీవక్రియకు సహాయపడే, హార్మోన్ల సమతుల్యతకు మద్దతు ఇచ్చే ట్రేస్ ఖనిజం. జింక్ – రోగనిరోధక పనితీరు, కణజాల మరమ్మత్తు, మొత్తం జీవక్రియ ఆరోగ్యానికి సహకరిస్తుంది. కొలొస్ట్రమ్ – గట్ సమగ్రత, రోగనిరోధక స్థితిస్థాపకతకు మద్దతునిస్తుంది. సమంత రూత్ ప్రభు తాను వీటిని కొవ్వులతో తీసుకుంటానని తెలిపారు. సాధారణంగా అల్పాహారం లేదా భోజనం తర్వాత జీర్ణించుకోవడానికి ముఖ్యంగా విటమిన్లు D3, K2, ఒమేగా–3లు వంటి వాటిని తీసుకుంటాను అని తెలిపారు. ఆహారం, జీవనశైలి, మొత్తం ఆరోగ్య స్థితిని బట్టి సప్లిమెంట్ అవసరాలు వ్యక్తుల మధ్య మారుతాయని వెల్లడించారు.

## నేను ఫోటోలు తీసేవాళ్లను నమ్మను.. నటి ఫికర్!

నేను ఫోటోలు తీసేవాళ్లను నమ్మను.. కొన్ని ఫోటోలను తీసి ఉద్దేశపూర్వకంగా వాటిని జూమ్ చేయడం ద్వారా సంచలనాలను సృష్టించాలని అనుకుంటారు అని అన్నారు కృతి సనోన్. తాను పొట్టి దుస్తుల్లో ఉన్నప్పుడు ఫోటోగ్రాపర్లు తనను రకరకాల కోణాల్లో ఫోటోలు తీసేందుకు ఆరాటపడతారని, కానీ తాను వేదికలపైకి వెళ్లినప్పుడు తన సహచరులను తనకు ముందుగా నిలబడాలని రెక్వెస్ట్ చేస్తానని కూడా కృతి చెప్పింది. వారు చూసే కోణం తప్పుడు కోణం.. ఉద్దేశపూర్వకంగా అలాంటి ఫోటోలు తీస్తారు! అని కూడా కృతి అన్నారు. సినీరంగంలో ఎదగాలనుకున్న నటీమణులకు ఇలాంటి వ్యక్తుల వల్ల సమస్యలు తలెత్తుతాయని కూడా తెలిపారు. అయితే సెలబ్రిటీల



గోప్యతను కాపాడే విషయంలో హాలీవుడ్ మీడియా పద్ధతిగా ఉంటుందని కూడా కృతి కితాబిచ్చింది. ఓసారి ప్రియాంక చోప్రా గౌన్ వేదికపైనే జారిపోతుండగా, ఆ సమయంలో తన గౌరవాన్ని కాపాడుతూ అంతర్జాతీయ మీడియా దానిని షూట్ చేయలేదని చెప్పింది. కానీ భారతీయ మీడియా అలా కాదు. శరీర అందాలను హైలైట్ చేయాలని తహతహలాడుతుంది. వీటిని మీడియాలు స్పెషల్ స్టోరీలుగా వేస్తారు. అయినా మీడియా, సెలబ్రిటీల మధ్య పరస్పర గౌరవం ఉండాలి! అని కృతి పేర్కొంది. అసలు మీడియాలు మహిళలను ఎలా చూస్తాయో చెప్పాలని కూడా కృతి ఈ సందర్భంగా కోరారు. ఇది త్రోబ్యాక్ వీడియో అయినా జోరుగా వైరల్ అవుతోంది. మహిళల రక్షణ, గోప్యత, గౌరవం గురించి కృతి మాట్లాడిన విషయాలు అందరికీ నచ్చాయి. కృతి సనోన్ తో పాటు ఇటీవలి కాలంలో పలువురు యువనటీమణులు ఇండస్ట్రీలో సమస్యలపై బహిరంగంగా చర్చిస్తూ చర్చల్లోకొస్తున్నారు. కాక్ టైల్ 2, తేరే ఇష్క్ మే అనే రెండు భారీ చిత్రాల్లో కృతి సనోన్ నటిస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536